అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 21-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 234 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ఐటీ రిటర్న్స్‌పై

గందరగోళం?

ప్రధాని, ఆర్థికమంత్రి, ఆర్థిక సర్వే లెక్కల్లో తేడాలెందుకు.?

పెద్దనోట్ల రద్దు తర్వాత తడబడుతున్న ప్రభుత్వ పెద్దలతీరు



న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు తర్వాత ఆదాయం పన్ను చెల్లింపులు అనూహ్యంగా పెరిగాయంటూ ప్రభుత్వ వర్గాలు చెబుతున్న పూటకో లెక్కతో జనం మదిలో పలు సందేహాలు అలాగే మిగిలి ఉన్నాయి. కొత్తగా(అదనంగా) గతేడాదితో పోలిస్తే ఈసారి ఐటీ రిటర్న్స్ పెరిగాయని చెబుతున్న మాటల్లో ఏది నిజమో..? ఏది అబద్ధమో..? తేల్చుకోలేని పరిస్థితి. అదనపు ఐటీ రిటర్న్స్ విషయంలో ఇటీవల విడుదలైన ఆర్థిక సర్వే 5.4 లక్షలుగా తేల్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో 56 లక్షలని చెప్పారు. ఆర్థికమంత్రి 91 లక్షలుగా తేల్చారు. ఇదే అంశంపై రాజ్యసభలో 33 లక్షలని చెప్పారు. వీటిలో ఏది నిజం..? ఏది అబద్ధం..? తేల్చుకునేదెలా..?

ప్రధానమంత్రికైనా, ఆర్థిక మంత్రిత్వశాఖకైనా ఆదాయం పన్ను విషయంలో అధికారిక లెక్కలు ఇచ్చేది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ). ఈ గందరగోళానికి తెరదించేలా సీబీడీటీ ...9లో



ఆకాశంలో హంసలమై...

హైదరాబాద్ గండిపేట చెరువులో ఫ్లెమింగ్ పక్షుల సందడి

రాంకీ భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

కొనుగోలు చేసిన భూ రికార్డులను స్వాధీనం చేసుకోవాలి : తమ్మినేని

వివరాలు 2లో

బంగ్లా ప్రధాని హత్యకు కుట్ర కేసు

10 మందికి ఉరిశిక్ష

వివరాలు 2లో

ప్రభుత్వ భూమిలో పవర్ ప్లాంట్

- దళితుల భూములు ఆక్రమణ
- ఐబీ అధికారుల మాటలు బేఖాతరు
- యథేచ్ఛగా ప్లాంట్ నిర్మాణం

వివరాలు 2లో

తెలంగాణకు.. ఐఏ'ఎస్'

- రాష్ట్రానికి వచ్చేందుకు పలువురి ఆసక్తి

వివరాలు 12లో



ధావన్ దంచికొట్టాడు

తొలి వన్డేలో భారత్ ఘన విజయం 12లో

డిప్యూటీ సీఎంగా పన్నీర్,

సీఎంగా పళనిస్వామి?



చెన్నై: ఏఐఏడీఎంకే చీలిక వర్గాల విలీనం కోసం సాగుతున్న సంప్రదింపులు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. విలీనం దిశగా మరో అడుగు ముందుకు పడిందని తమిళనాడు మాజీ సీఎం పన్నీర్‌సెల్లం ఆదివారం మీడియాకు తెలిపారు. తన వర్గీయులతో సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఐక్యం కానున్నదని, కుటుంబ రాజకీయాలకు తావు లేదని పన్నీర్ అన్నారు. త్వరలోనే మంచి నిర్ణయం వెలువడుతుందని ఆయన అన్నారు. ఇరు పక్షాల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం పన్నీర్ సెల్వంకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా పళనిస్వామి కొనసాగను న్నారు. శశికళను పార్టీ నుంచి బహిష్కరించేందుకు కూడా పన్నీర్, పళని వర్గాలు అంగీకారానికి వచ్చినట్టు సమాచారం. పార్టీ స్టీరింగ్ కమిటీకి పన్నీర్ నేతృత్వం వహించనున్నట్టు తెలుస్తోంది.



ప్రజలకు ప్రశ్నించటాన్ని

నేర్పుతాం

సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరు

టీ-మాస్ ఆవిర్భావ సభల్లో వక్తలు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్

"రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న ప్రజలకు ప్రశ్నించడం నేర్పడమే టీ మాస్ ఫోరం లక్ష్యం. సామాజికంగా వెనుకబడిన వారికి అన్యాయం జరిగితే టీ మాస్ ఫోరం అండగా నిలుస్తుంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సమానత్వం కోసం పోరు కొనసాగిస్తాం" అని పలువురు వక్తలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన టీమాస్ ఫోరం ఆవిర్భావ సభలో 174 సంఘాల నాయకులు హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లహరి గార్డెన్‌లో టీమాస్ ఆవిర్భావ సభలో 150కిపైగా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సభల్లో ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ... "రాష్ట్రం కేసీఆర్ పోరాటంతో రాలేదు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ వచ్చింది" అని ఆయన అన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు చైతన్యమయ్యేలా టీమాస్ కృషిచేస్తున్నదన్నారు. 60ఏండ్ల ...9లో

ఉత్తర భారతాన్ని వీడని వరదలు

ఇప్పటి వరకు 427 మంది మృతి

బీహార్‌లో వంతెన కూలి ముగ్గురు మృతి

ఉత్తర భారతదేశంలో వరదలు బీభత్సం సృషిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వరదల్లో చిక్కుకుని మృతి చెందినవారి సంఖ్య ఆదివారం నాటికి 427కి చేరుకున్నట్టు అధికారులు ధ్రువీకరించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో, విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. 2లో



ఊర్లు జలసమాధి

- రీడిజైన్‌తో ఏడు గ్రామాలకు ముంపు
- భారం రూ.800 కోట్లు... అదనంగా సాగయ్యేది 31 వేల ఎకరాలే 9లో



రెండు నెలల్లో రామమందిర నిర్మాణం

- దీనికోసం పార్లమెంటులో ప్రత్యేక చట్టం తేవాలి
- ధర్మంపై న్యాయస్థానాలు తీర్పులు చెప్పలేవు
- హిందువుల మనోభావాల్ని కోర్టులు గుర్తించాలి
- గోసంరక్షకులు చట్టాన్ని రక్షిస్తున్నారు : వీహెచ్‌పీ నేత ప్రవీణ్‌తొగాడియా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అయోధ్యలో రామమందిర నిర్మాణ పనుల్ని రెండు నెలల్లో ప్రారంభిస్తామని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రవీణ్‌తొగాడియా చెప్పారు. పటేల్ సోమనాథ్ ఆలయం కోసం తెచ్చినట్టే అయోధ్య రామమందిరం కోసం పార్లమెంటులో ప్రత్యేక చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాల్ని గౌరవించాల్సిన ...9లో

కొక్కొరొకో..



మనకు కావాల్సింది...రంగులు కరెన్సీ రంగుల బతుకులని వారికి తెల్వదే..!!

కన్నీటి సాగరంలో కన్నవారు

నేడు సీనియర్ సిటిజన్స్ డే

రెక్కలొచ్చిన గువ్వలు ఎగిరిపోతాయన్న విషయం తెలిసి కూడా కన్న ప్రేమ వాటి యోగ క్షేమాలను ప్రాణం పోయే వరకు మరువదు. జీవిత చరమాంకంలో ఉన్నప్పటికీ.. తల్లిదండ్రుల ధ్యాసంతా పిల్లల బాగోగులపైనే గానీ, వారు సంపాదించిన ఆస్తి పాస్తులపై కాదు.. ముదిమి వయస్సులో ఆ పండుటాకులకు కావలసింది కాసింత ప్రేమ, ఆదరణ! ఐతే, ఆ చిరు ప్రేమ, ఆప్యాయత కూడా ప్రస్తుత జనరేషన్ నుండి నోచుకోలేక అవస్థలు పడుతున్న సీనియర్ సిటిజన్లు దేశంలో నానాటికీ పెరిగిపోతుండటం గుండెల్ని పిండేస్తోంది.

దేశంలో దయనీయ పరిస్థితుల్లో సీనియర్ సిటిజన్స్

- రక్తసంబంధీకుల అనురాగానికి దూరమై మానసికంగా కుంగిపోతున్న 43శాతం వయోవృద్ధులు
- ప్రతీ ఇద్దరిలో ఒకరు అనాథగా బతుకుతున్న వైనం..గ్రామాల కంటే, పట్టణాల్లో పరిస్థితి మరింత దారుణం
- మా హక్కులను కాపాడటంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్న 46.82 శాతం సీనియర్ సిటిజన్స్
- ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్, ఏజ్‌వెల్ ఫౌండేషన్ సర్వేల్లో వెల్లడైన పలు వాస్తవాలు

జై

సుమారు పన్నెండు కోట్ల సీనియర్ సిటిజన్స్ కలిగిన భారతంలో సుమారు సగం మందికి పైగా వయో వృద్ధులు కుటుంబీకుల ప్రేమకు దూరమై అనాథలుగా బతుకీడుస్తున్నట్టు ఏజ్‌వెల్ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. కుటుంబ సభ్యులకు దూరమవడం చేత సుమారు 43శాతం వృద్ధులు మానసిక సమస్యలతో సతమతమవుతున్నట్టు, గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో ఈ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉన్నట్టు సర్వే పేర్కొంది. పట్టణాల్లో సుమారు ...9లో



యూపీ రైలు ప్రమాదం..

- 24కు చేరిన మృతుల సంఖ్య, గాయపడినవారు 156మంది

ముజఫర్‌నగర్: యూపీలో పూరీ-హరిద్వార్ మధ్య నడిచే కళింగఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 24కు చేరుకోగా, గాయపడినవారి సంఖ్య 156గా ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ముజఫర్‌నగర్‌కు 40 కి.మీ.దూరంలోని ఖతౌలీ వద్ద కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం సాయంత్రం పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 14 బోగీలు పట్టాలు తప్పాయి. మరోవైపు ఈ రైలు ప్రమాదం వల్ల తన ఇల్లు పూర్తిగా ధ్వంసమైందని, నష్టపరిహారం చెల్లించకపోతే కోర్టుకు వెళ్తానని బాధితుడు పింటూ చౌదరి రైల్వేశాఖను హెచ్చరించారు. ఈ సంఘటనలో ఓ బోగి తన ఇంట్లోకి దూసుకురావడంతో ఇల్లు ధ్వంసమైందని పింటూ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పరిహారం ఇవ్వకపోతే రైల్వేశాఖపై కేసు పెడ్తానని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో రెండు ఇండ్లలోకి బోగీ దూసుకుపోయి చివరికి అక్కడి కళాశాల గోడకు ఢీకొని ఆగిపోయినట్టు స్థానికులు తెలిపారు.

జేఈఈ టాపర్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

- 100 శాతం మార్కులు సాధించిన కల్పిత్ వీర్వల్



న్యూఢిల్లీ: జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్) మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కల్పిత్ వీర్వల్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఉదయ్‌పూర్‌కు చెందిన కల్పిత్ జేఈఈ మెయిన్స్‌లో 100శాతం మార్కులు సాధించాడు. 360 మార్కులకు గాను 360 మార్కులు సాధించి అందర్నీ అబ్బురపరిచాడు. ప్రస్తుతం ఇతను ముంబయి ఐఐటీలో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. జేఈఈ మెయిన్స్‌లో 100 శాతం ప్రతిభ కనపర్చినందుకు గాను 'ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్' విభాగంలో పురస్కారం అందజేయనున్నట్టు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కల్పిత్ మాట్లాడుతూ..'నేను మంచి మార్కులు సాధిస్తానని అనుకున్నాను కానీ.. 360కి 360 మార్కులు (100 శాతం) సాధిస్తానని ఊహించలేదు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నా పేరు నమోదవుతుందని కలలో కూడా ఊహించలేదు' అని అన్నాడు. కల్పిత్‌కు ఈ అరుదైన గౌరవం దక్కినందుకు అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. 'మంచి మార్కులు సాధించాలి, మంచి ర్యాంకు సాధించాలి, కోట్లు సంపాదించాలని మా అబ్బాయిపై ఎప్పుడూ ఒత్తిడి తీసుకురాలేదు. కానీ, మంచి కళాశాలలో చదివించాలని మాత్రమే అనుకున్నాం. వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా ఎదిగితే చాలని భావించాం. మేం ఆశించిన దానికంటే మా బాబు బాగా కష్టపడుతున్నాడని తెలుసుకుని సంతోషిస్తున్నాం' అని కల్పిత్ తండ్రి పుష్పేంద్ర అన్నారు. కల్పిత్ తండ్రి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. తల్లి పుష్ప ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు.

నేడు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో మోడీ సమావేశం

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్రమోడీలు సోమవారం సమావేశం కానున్నారు. 13 మంది ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉప ముఖ్యమంత్రులు పలువురు కేబినెట్ మంత్రులు ఈ సమావేశానికి హాజరుకానున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు ప్రకటించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది ముఖ్యమంత్రుల సమావేశం కాగా బీహార్‌లో జేడీ(యూ)ను కలుపుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడం, రాష్ట్రాల్లో అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ఉన్నట్టు సమాచారం. 2019 ఎన్నికలకు అమిత్ షా ప్రణాళిక సిద్ధం చేసిన తర్వాత ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉత్తర భారతాన్ని వీడని వరదలు

ఇప్పటివరకు 427 మంది మృతి



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వరదల్లో చిక్కుకుని 69 మంది మృతి చెందినట్టు అధికారులు ధ్రువీక రించారు. వరద ఉధృతి 24 జిల్లాల్లో కొనసాగు తోందన్నారు. వరదల కారణంగా 24లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2,523 గ్రామాలు నీటము నిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 39,783 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని అన్నారు. భారత సైన్యం, వాయుసేన, ప్రత్యేక భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో ప్రవహిస్తున్న నదులు పొంగిపొర్లుతున్నాయని సెంట్రల్ వాటర్ కమిషన్ పేర్కొన్నది. శారదానది పొంగిపొర్లడంతో ఎల్గిన్‌ఆనకట్ట వద్ద వరదనీరు గరిష్టస్థాయికి చేరుకుందని తెలిపింది. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అస్సాం రాష్ట్రంలో బ్రహ్మపుత్ర నది పొంగిపొర్లడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరదల్లో చిక్కుకుని మృతి చెందినవారి సంఖ్య 150కి చేరుకున్నది. బార్పేట జిల్లా బోర్గుల్‌ఛార్ ద్వీపానికి సమీపంలో నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బందులుపడుతున్నాయి. లక్షలాది ఎకరాల పంట నష్టం వాటిల్లింది. మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఇండ్లు నీటమునడంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నట్టు స్థానికులు తెలిపారు. కాగా, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోనూ వరద ఉధృతి కొనసాగుతున్నది. వరదల్లో చిక్కుకుని మృతిచెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 55కి చేరుకుంది. 48 మంది గల్లంతయ్యారు. విద్యుత్, రవాణా వ్యవస్థలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద నీరు ఇండ్లలోకి ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఆహార పదార్థాల తీవ్ర కొరత ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రైల్వే సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత రైల్వే సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

బీహార్‌లో వంతెన కూలి ముగ్గురి మృతి

బీహార్‌లో వరదలు పోటెత్తాయి. వరదల్లో చిక్కుకుని మృతిచెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 153 మందికి చేరుకున్నట్టు అధికారులు ధ్రువీకరించారు. ఒక్క అరేబియా జిల్లాలోనే 30 మంది మృతిచెందినట్టు తెలిపారు. తాజాగా, ఇదే జిల్లాలోని ఓ వంతెన కూలిపోయింది. వంతెన దాటి గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో ముగ్గురు మృతి చెందారు. వరదల కారణంగా 17 జిల్లాల్లో 1.08కోట్ల మంది ఇబ్బందిపడుతున్నారని అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టామని అన్నారు.



ఐదేండ్లలో 298మంది భారతీయులకు పాక్ పౌరసత్వం

న్యూఢిల్లీ : ఐదేండ్లలో 298 మంది భారతీయులకు పౌరసత్వం కల్పించినట్టు పాకిస్తాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత్‌తో సత్సంబంధాలను కోరుకుంటున్నందుకే అర్హులైన పౌరులకు పౌరసత్వం కల్పిస్తున్నట్టు పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ పేర్కొన్నది. 2012లో 48 మందికి, 2013లో 75 మందికి, 2014లో 76 మందికి పౌరసత్వం కల్పించినట్టు తెలిపింది. పాక్ ప్రభుత్వం ఎంత మంది భారతీయులకు ఈ ఏడాది పౌరసత్వం కల్పించిందని జాతీయ అసెంబ్లీలో ముస్లింలీగ్ ఎంపీ షేక్ రోహలే అజ్గర్ లేవనెత్తిన ప్రశ్నకు ఆదేశ అంతర్గత మంత్రిత్వ శాఖ పై విధంగా సమాధానమిచ్చింది. కాగా, భారత్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, బర్మా దేశాల పౌరులకు పౌరసత్వం కల్పించే విషయంలో పాక్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

మైనారిటీ బాలికలకు విద్యాసంస్థల్లో 40శాతం రిజర్వేషన్

- కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ



న్యూఢిల్లీ : మైనారిటీ బాలికలకు పలు విద్యాసంస్థల్లో 40 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించనున్నట్టు కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. 100 నవోదయ విద్యాసంస్థల్లో, ఐదు ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తామని అన్నారు. మైనారిటీల జనాభా అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. ముస్లిం బాలికల డ్రాపవుట్ అధికమైందని ఇటీవల మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (ఎంఏఈఎఫ్) సంస్థ ప్రభుత్వానికి నివేదించింది. బాలికల డ్రాపవుట్ తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు మైనారిటీ బాలికలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో ఎంఏఈఎఫ్ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకున్నామని నఖ్వీ తెలిపారు. నవోదయ విద్యాసంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. మల్టీ సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎమ్ఎస్‌డీపీ) పథకాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రమాణాలను పెంపొందిస్తామన్నారు.

యూపీలో బాలికపై లైంగికదాడి

- కానిస్టేబుల్ సహా ఎనిమిది మంది అరెస్ట్

లక్నో : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బాల్లియా గ్రామంలో 16ఏండ్ల మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడి జరిగింది. కానిస్టేబుల్, గ్రామపెద్ద సహా ఎనిమిది మంది లైంగికదాడికి పాల్పడ్డట్టు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికిలోనై తన తండ్రి కూడా మృతిచెందాడని ఫిర్యాదులో పేర్కొ న్నది. గోపాల్‌నగర్ ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం...బాధితురాలి కుటుంబానికి గ్రామపెద్ద ప్రదీప్ యాదవ్‌కు మధ్య వివాదం నెలకొన్నది. ధరమ్‌రాజ్ అనే కానిస్టేబుల్ ఈ వివాదంలో జోక్యం చేసుకుని ఇటీవల సస్పెండ్ అయ్యాడు. దీంతో, అతను కూడా బాధితురాలి కుటుంబంపై కక్ష్య పెంచుకున్నాడు. బాధితురాలి కుటుంబాన్ని ఎలాగైనా అగౌరవపర్చాలని నిర్ణయించుకున్నాడు. కానిస్టేబుల్, గ్రామపెద్ద సహా ఎనిమిది మంది ఒంటరిగా ఉన్న బాధితురాలిని గమనించి లైంగికదాడికి పాల్ప డ్డారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. బాధితురాలి తండ్రి కూడా తమ శాఖలోనే పనిచేసేవారని అన్నారు.

నోట్లరద్దుతో వారికి నిధుల కొరత

- మావోయిస్టులు, వేర్పాటువాదులపై అరుణ్ జైట్లీ



ముంబయి: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ పెద్ద నోట్లరద్దు చర్యను మరోసారి సమర్థించుకున్నారు. బీజేపీ ముంబయి విభాగం అధ్యక్షుడు ఆశిష్ షెలార్ నిర్వహించిన 'నవభారత ప్రతిజ్ఞ' కార్యక్రమంలో ఆయన పాల్గొని నోట్లరద్దు ప్రభావంపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని మావోయిస్టులకూ, జమ్మూకాశ్మీర్‌లోని వేర్పాటువాదులకు పెద్ద నోట్లరద్దుతో నిధుల కొరత ఏర్పడిందని ఆయన అన్నారు. ఉగ్రవాద ప్రభావిత ప్రాంతంలో సైన్యంపై రాళ్లు రువ్వే యువకుల సంఖ్య గణనీయంగా తగ్గడమే దీనికి ఆధారమని పేర్కొన్నారు. గతంలో కొన్ని వందల మంది ఆ తరహా ప్రదర్శనల్లో పాల్గొనేవారని, కానీ నోట్లరద్దు అనంతరం ఆ సంఖ్య 25కి పడిపోయిందని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చి చేరిందని చెప్పుకొచ్చారు. రక్షణ, గ్రామీణ, మౌలిక నిర్మాణాలపై ఎక్కువ నిధులు ఖర్చు పెట్టాలన్నదే బీజేపీ ప్రభుత్వ నవభారత ప్రతిజ్ఞ అని వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి సంస్థలు నిర్మించుకోవాలని, గోరఖ్‌పూర్ వంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకూడదని జైట్లీ పేర్కొన్నారు. 7 నుంచి 7.75 శాతం వృద్ధి రేటుతో మోడీ ప్రభుత్వం సంతృప్తి చెందదని, వృద్ధి రేటును పెంచేందుకు మరిన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటామని ఆయన అన్నారు.

బంగ్లా ప్రధాని హత్యకు కుట్ర కేసు 10 మందికి ఉరిశిక్ష



ఢాకా : బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా హత్యకు పథకం రచించారనే ఆరోపణలపై 10 మంది ఉగ్రవాదులకు న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. మరో వ్యక్తికి జీవిత ఖైదు, మరో 9 మందికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రతిపక్ష నాయకురాలు షేక్ హసీనా ఎన్నికల ప్రచారంలో భాగంగా గోపాల్‌గంజ్ జిల్లాలోని ఓ కాలేజీ మైదానంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించడానికి సభ ఏర్పాటు చేశారు.

అయితే ఆమె ప్రసంగానికి ఒక రోజు ముందు ఉగ్రవాదులు సభ ప్రాంగణ సమీపంలో 76 కేజీల బాంబును అమర్చారు. పోలీసుల తనిఖీల్లో బాంబు బయటపడింది. దీంతో హసీనా హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై హర్కత్ ఉల్ జీహాద్ అల్ ఇస్లామీ అధ్యక్షుడు ముఫ్తీ హన్నన్‌తో పాటు పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించగా.. ఒకరు బెయిల్‌పై విడుదల అయ్యారు.

మరో 15 మంది పరారీలో ఉన్నారు. ముఫ్తీ హన్నన్‌ను 2005లో అరెస్ట్ చేసి, 2017 ఏప్రిల్‌లో ఉరి తీశారు. బ్రిటీష్ హైకమిషనర్‌పై గ్రెనేడ్ దాడిలో ప్రధాన నిందితుడు హన్నన్. అంతేకాదు.. దేశవ్యాప్తంగా బాంబు దాడులకు పథక రచన చేసిన ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.

ఇండోనేషియా జెండాలో పొరపాటు

- మలేషియా క్షమాపణలు



జకార్తా : ఇండోనేషియా జాతీయ పతాకాన్ని తలకిందులుగా చూపించినందుకు మలేషియా ఆదేశానికి క్షమాపణలు చెప్పింది. అనుకోకుండా జరిగిన తప్పిదంగా దీన్ని పేర్కొంది. సౌత్‌ఈస్ట్ ఆసియా గేమ్స్ సందర్భంగా విడుదల చేసిన సావనీర్‌లో ఈ తప్పిదం చోటుచేసుకుంది. సావనీర్‌లో ఇండోనేషియా జాతీయ పతాకాన్ని తలకిందులుగా ప్రచురించారు. అయితే ఇది పోలాండ్ దేశ జాతీయ పతాకాన్ని పోలి ఉండటంతో ఇండోనేషియన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'షేమ్ ఆన్ యూ మలేషియా' అంటూ సామాజిక మాధ్యమంలో నెటిజన్లు విరుచుకుపడ్డారు. ఇండోనేషియన్ జాతీయ పతాకంలో ఎరుపు రంగు చార కింద తెలుపు రంగు చార ఉంటుంది. అయితే పోలాండ్ జాతీయ పతాకంలో మొదట తెలుపు రంగు, దాని కింద ఎరుపు రంగు చార ఉంటుంది. ఇండోనేషియా జెండా తప్పుగా ప్రచురించడంతో అది కాస్త పోలాండ్ జాతీయ పతాకంగా మారింది.

దీనిపై మలేషియా యువజన, క్రీడల శాఖ మంత్రి ఖైరీ జమాలుద్దీన్.. ఇండోనేషియన్ మంత్రి నెహ్రావీని కలిసి వ్యక్తిగతంగా క్షమాపణలు కోరారు. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని.. ఎందుకంటే దేశాలకు జాతీయ జెండాలు ఎంతో ముఖ్యమైన చిహ్నాలని నెహ్రావీ పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా జరిగిన తప్పు కాదని.. తమ నిర్లక్ష్యానికి క్షమాపణ కోరినట్టు ఖైరీ వెల్లడించారు.

ఈ విగ్రహాల్ని కూల్చాల్సిందే..

అమెరికా నగరాల్లో ప్రజల నుంచి డిమాండ్

- మరోవైపు దీనికి వ్యతిరేకంగా శ్వేతజాతి దురహంకారుల నిరసన ర్యాలీలు



న్యూ ఓర్లాన్స్‌లో తొలగిస్తున్న రాబర్ట్ ఇ.లీ స్మారక విగ్రహం (మే 19, 2017)



ఉత్తర కరోలినా రాష్ట్రంలో డ్యూక్ వర్శిటీలోని రాబర్ట్ ఇ.లీ స్మారక విగ్రహం. దీనిని తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు ఇటీవల నిరసన వ్యక్తం చేశారు.

> అమెరికా మొత్తం శ్వేతజాతీయులదే, ఇందుకోసం శ్వేతజాతీయులంతా ఏకం కావాలి అన్న సిద్ధాంతంతో ఏర్పడినవే జాత్యాంహకార గ్రూపులు. కాన్ఫడరేట్ స్మారక విగ్రహం రాబర్ట్ ఈ.లీ విగ్రహాన్ని కూల్చాలని నిర్ణయించిన ఛార్లెట్స్‌విల్లే నగరంలో ర్యాలీ జరపాలని, క్రమక్రమంగా దేశమంతా దీనిని విస్తరించాలని జాత్యాంహకార గ్రూపులు నిర్ణయించాయి. క్లూక్లక్స్ క్లాన్, నయా నాజీలు, కాన్ఫెడరేట్ వైట్ నైట్స్, ట్రెడిషనలిస్ట్ అమెరికన్ నైట్స్, అమెరికా ఫ్రీడం పార్టీ - ఇలా అనేక పేర్లతో ఈ గ్రూపులు దేశవ్యాప్తంగా పనిచేస్తున్నాయి.

వాషింగ్టన్ : అమెరికాలో 'కాన్ఫెడరేట్' విగ్రహాల కూల్చివేత ఒక పెద్ద చర్చనీయాంశంగా మారింది. మొత్తం అమెరికా రాజకీయాల్నే ఈ అంశం కదలిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈ విగ్రహాల కూల్చివేతకు విముఖత వ్యక్తం చేయటంతో అమెరికా ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నది. అమెరికా అంతర్యుద్ధం సమయంలో...జాతివివక్ష, బానిస వ్యవస్థకు మద్దతు పలుకుతూ ఏర్పడినవే 'కాన్ఫడరేట్' సైన్యాలు. ఈ సైన్యాలకు నాయకత్వం వహించినవారివే ఈ 'కాన్ఫడరేట్' విగ్రహాలు.

సమానత్వానికి, మానవత్వానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులైన ఈ కాన్ఫెడరేట్ సేనల నేతల విగ్రహాలు, స్మారకచిహ్నాలు తొలగించడాన్ని ఈ శ్వేత జాత్యాంహకారులు పెద్ద పాపంగా పరిగణించి దాన్ని వ్యతిరేకిస్తున్నారు. వర్జీనియాలోని ఛార్లెట్స్‌విల్లే నగరంలో రాబర్ట్ ఈ.లీ విగ్రహాన్ని కూల్చేయాలని అక్కడి స్థానిక కౌన్సిల్ నిర్ణయిస్తే, దీనిని అడ్డుకోవాలని శ్వేతజాతి దురహంకారులు ర్యాలీ నిర్వహించారు. వీరిని వ్యతిరేకిస్తున్న మరో గ్రూప్ రంగంలోకి దిగి విగ్రహాల కూల్చివేతకు మద్దతు పలికింది.

విగ్రహాలను కూల్చివేయాల్సిందే...అన్న ఉద్యమం అమెరికాలోని అనేక నగరాల్ని హోరెత్తిస్తున్నది. బాల్టిమోర్, గేయిన్స్‌విల్లే, దుర్హాం నగరాల్లో, ఉత్తర కరోలినా, ఫ్లోరిడా, రాష్ట్రాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల విగ్రహాల్ని తొలగించారు. అలబామా, కాలిఫోర్నియా, ఫ్లోరిడా, లూసియానా తదితర రాష్ట్రాల్లో 'కాన్ఫడరేట్' స్మారక చిహ్నాలను తొలగించటం, పాఠశాలలు, వీధుల పేర్లను మార్చటం చేశారు. మరికొన్ని నగరాల్లో విగ్రహాలు, స్మారక చిహ్నాలు, పేర్లను ఎలా తొలగించాలన్న రాజ కీయ చర్చ వాడివేడిగా సాగుతు న్నది. ఈ విగ్రహాల న్నింటినీ ఒక మ్యూ జియంలో ఏర్పాటు చేయాలని, పూర్తిగా ధ్వంసం చేసేయా లని...దక్షిణాది రాష్ట్రాల్లో స్థానిక రాజకీయ నాయకులు అనేక ప్రతిపాదనలు చేస్తున్నారు.

- అమెరికా అంతర్యుద్ధం (1865 సంవత్సరం) సమయంలో శ్వేతజాతీయుల అధికారాన్ని మరింత బలోపేతం చేయటం కోసం ఏర్పాటైనదే 'కాన్ఫడరేట్' సైన్యం. వీరు బానిసత్వం, జాతివివక్షను రద్దును తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అంతర్యుద్ధం అనంతరం వీరి స్మారక విగ్రహాల్ని 1910–1920 మధ్య వివిధ నగరాల్లో ఏర్పాటుచేశారు. 'కాన్ఫడరేట్' సైనిక నేతల పేర్లను స్కూళ్లకు, వీధులకు, రోడ్లకు, భవనాలకు పెట్టారు. ఇలాంటివన్నీ అమెరికాలో అంతటా 1500 వరకూ ఉన్నాయన్నది ఓ సర్వే తెలియజేసింది. వీటిని అమెరికాలో శ్వేతజాతీయుల ఆధిపత్యానికి చిహ్నంగా చెప్పుకోవచ్చు.

ఇంతకీ ట్రంప్ ఏమన్నాడు ?

కాన్ఫడరేట్ విగ్రహాల కూల్చి వేతను అధ్యక్షుడు ట్రంప్ వ్యతిరేకిస్తున్నాడు. అమెరికా చారిత్రక, సాంస్కృతిక సంపదను అవి తెలియజేస్తున్నాయని, శ్వేతజాతి దురహంకారులకు పరోక్షంగా మద్దతు పలికాడు. వర్జీనియాలోని ఛార్లెట్స్‌విల్లే నగరంలో ర్యాలీ సందర్భంగా హింస చోటుచేసుకుంది. శ్వేతజాతి దురహంకారులను వ్యతిరేకిస్తున్న మరో గ్రూప్ పైకి ఒక ఉన్మాది వాహనంతో దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఒక మహిళ చనిపోగా, 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ మొత్తం ఘటనలో రెండు గ్రూపుల్నీ ఒకేగాటున కట్టి వ్యాఖ్యలు చేయటం వివాదాస్పదమైంది. పరోక్షంగా శ్వేతజాతి దురహంకారులకు మద్దతు పలుకుతున్నాడని ట్రంప్‌పై రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తాయి.

బిగ్గరగా నవ్వుతూ..

- అదుపు తప్పి భవనం నుంచి కిందపడి మహిళ మృతి



వాషింగ్టన్: బిగ్గరగా నవ్వుతూ మెక్సికోలో ఓ టీచర్ ప్రాణాలు కోల్పోయింది. బిగ్గరగా నవ్వుతూనే పై అంతస్తు నుంచి పడిపోయి మృతిచెందింది. షారోన్ రెగోలి సిఫోర్రోనో (50) మెక్సికోలోని మిడిల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తోంది. వేసవి సెలవులు కావటంతో సోమవారం తన కూతురితో ఓ స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. అక్కడ సరదాగా బాల్కానీలో ఓ బెంచ్ మీద కబుర్లు చెబుతూ గడిపింది. ఇంతలో ఏం జరిగిందో తెలీదుగానీ బిగ్గరగా నవ్వటం ప్రారంభించిన ఆమె ఆ కుదుపులో వెనక్కి ఒరిగి, అదుపు తప్పి బాల్కనీ నుంచి కింద పడిపోయింది. తలకు తీవ్రగాయాలు కావటంతో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించింది. ఆ సమయంలో ఆమె మద్యం సేవించి ఉన్నట్టు అనుమానించినా.. తర్వాత పరీక్షల్లో నిజం కాదని తేలింది. బాల్కనీకి ఇనుప కంచె లేకపోవటమే ప్రమాదానికి కారణమైందని పోలీసులు తెలిపారు.

విమానం కూలి ఇద్దరి మృతి

ఒరెగాన్ : అమెరికాలోని ఒరెగాన్ విమానాశ్రయానికి సమీపంలో ఓ చిన్న విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో పైలట్, ఓ ప్రయాణికుడు మరణించారు. చాలా ఏండ్ల అనంతరం అమెరికాలో సంభవించనున్న సంపూర్ణ సూర్యగ్రహణ దృశ్యాలను తిలకించేందుకు ఒరెగాన్ ప్రాంతానికి వీక్షకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

సెంట్రల్ ఒరెగాన్ విమానాశ్రయానికి సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. విమానం ఎయిర్‌పోర్టుకు సమీపిస్తున్న సమయంలో ఒక్కసారిగి కుప్పకూలింది. స్థానికంగా రూపొందించిన ఈ విమానం ఒకే ఇంజిన్ కలిగి ఉన్నట్టు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై విచారణకు ఫెడరల్ ఏవీయేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశించింది. అమెరికాలో ఆగస్టు 21న ఏర్పడే సంపూర్ణ సూర్యగ్రహణ దృశ్యాలను వీక్షించేందుకు ఒరెగాన్ ప్రాంతానికి సుమారు 2 లక్షల మంది తరలివస్తారని అంచనావేస్తున్నారు.

అప్పుడు 'కౌఫెఫె'.. ఇప్పుడు 'హీల్'



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ట్వీట్‌లో మరోసారి తప్పులు దొర్లాయి. అవి కాస్తా నెటిజన్ల కంట పడ్డాయి. ఇంకేముందు నెటిజన్లు దీనిపై విపరీతంగా కామెంట్లు పెట్టేస్తున్నారు. శనివారం బోస్టన్‌లో 'ఫ్రీ స్పీచ్' పేరిట జరిగిన ర్యాలీలో దాదాపు 15వేల మందికి పైగా ఆందోళనకారులు పాల్గొన్నారు. జాతి విద్వేషదాడులను వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీని నిర్వహించారు. దీని గురించి ట్రంప్ ట్వీట్ చేశారు.

ఆయన చేసిన ట్వీట్‌లో ష్రముశ్రీకి బదులుగా ష్రవవశ్రీఅని రాసుకొచ్చారు. ఒకే ట్వీట్‌లో రెండు మార్లు హీల్ అనే పదం స్పెలింగ్‌ను తప్పుగా రాశారు. అది కాస్తా నెటిజన్ల కంట పడింది. ఇంకేముంది కొద్ది సేపట్లోనే ఈ ట్వీట్ సంచలనంగా మారింది. తప్పును గ్రహించుకున్న తర్వాత మూడోసారి ఆయన హీల్ స్పెలింగ్‌ను సరిగా రాస్తూ మళ్లీ ట్వీట్ చేశారు.

ఈ ఏడాది మే నెలలో కూడా ట్రంప్ మీడియాను ఉద్దేశించి ఓ ట్వీట్ చేశారు. అందులో ఎశీఙటవవటవ అని రాశారు. అయితే అసలు అక్కడ ట్రంప్ కవరేజ్ అని రాయాల్సి ఉంది. కానీ పొరపాటుగా కౌఫెఫె అని రాశారు. ఇది అర్థం కాక నెటిజన్లు తలపట్టుకున్నారు. దాని అర్థం ఏమిటో తెలుసుకునేందుకు డిక్షనరీలు కూడా వెతికారు.

ప్రభుత్వ భూమిలో పవర్ ప్లాంట్



దళితుల భూములు ఆక్రమణ

- ఐబీ అధికారుల మాటలు బేఖాతరు
- యథేచ్ఛగా ప్లాంట్ నిర్మాణం

నవతెలంగాణ-నేరేడుచర్ల

దళితుల, సర్కారు భూములను ఓ వ్యక్తి ఆక్రమించేశాడు. అధికారుల మాటలను పెడచెవిన పెట్టి అందులో యథేచ్ఛగా పవర్ ప్లాంట్ నిర్మాణమూ మొదలు పెట్టేశాడు. 'ఇదేమిటి' అని దళితులు ప్రశ్నిస్తే...'ఆ భూమి కొన్నా. అన్ని అనుమతులూ ఉన్నాయ్. దిక్కున్నచోట చెప్పుకోండి' అంటూ దబాయిస్తున్నాడు. ఓ పక్క కేసీఆర్ ప్రభుత్వం దళితులకు మూడెకరాలు ఇస్తామని చెబుతుండగా...మరో పక్క దళిత భూములను కొంతమంది బడాబాబులు ఆక్రమించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 12లో 16.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత భూమిని కొన్నేండ్ల కింద దళితులకిచ్చారు. వారు అందులో సాగు చేసుకుంటున్నారు. మరికొందరు వదిలేశారు. ఈ క్రమంలో మిర్యాలగూడెంకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న ఓ రైతు వద్ద ఎకరం ఆరు కుంటలు కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమితో పాటు ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించుకొని ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నాడు. ఇది ప్రభుత్వ భూమి అని, గతంలో దీనిని దళితులకు ఇచ్చారని కొందరు రైతులు ఫిర్యాదు చేసేంత వరకూ అధికారులు గుర్తించలేదు. నదీపరివాహక ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దని నిబంధనలున్నప్పటికీ విరుద్ధంగా ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఐబీ అధికారుల నుంచి అనుమతులు లేకుండా పనులు ప్రారంభించారు. ఆ శాఖ అధికారులు కూడా ఆ ప్లాంట్ నిర్మాణానికి అనుమతి లేదని చెబుతున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశానికి అతి సమీపంలోనే మూసీ నదిపై రూ.14కోట్లతో నిర్మించిన వంతెన ఉంది. ఈ వంతెనకు సమీపంలో బ్లాస్టింగ్‌లు చేపడుతుండటం గమనార్హం. మరోవైపు పట్టాలున్న పొలాల నుంచి అక్రమంగా మట్టికోసం తవ్వకాలు చేపట్టడంతో రైతులు పొలాల్లో వేసుకున్న నీటిపైపులు దెబ్బతింటున్నాయి.

అక్రమ నిర్మాణాలు ఆపాలి జేసీకి వినతి

తమ భూముల్లో అక్రమంగా చేపడుతున్న పవర్‌ప్లాంట్ నిర్మాణాలు వెంటనే ఆపాలని చిల్లేపల్లికి చెందిన కొందరు రైతులు ఇటీవల నేరేడుచర్లకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టరాదని, విచారణ జరిపి వెంటనే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఐబీ అధికారుల మాటలు బేఖాతరు

ప్లాంట్ నిర్మాణం జరిగే ప్రదేశాన్ని శుక్రవారం ఐబీ అధికారులు సందర్శించారు. పనులను ఆపాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. అయినప్పటికీ ఐబీ అధికారుల మాటలు లెక్క చేయకుండా శనివారం కూడా పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వెంటనే పనులు ఆపాలని రైతులు కోరుతున్నారు.

అధికారులతో తప్పుడు సర్వేలు చేయిస్తున్నారు: మాతంగి భిక్షం

మా అమ్మ మాతంగి లక్ష్మమ్మ పేర సర్వే నెంబర్ 12లో సర్కారు ఎకరం భూమిని ఇచ్చింది. భూమి ఇవ్వాలని ప్లాంటు యాజమాన్యం అడిగితే నిరాకరించాం. దీంతో ఆ భూమి మాది కాదని సర్వేనెంబర్ 11లో ఉన్న ఇతర రైతులదని అభ్యంతరాలు చేసి, అధికారులతో తప్పుడు సర్వేలు చేయిస్తూ, మమ్ముల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సర్వే ప్రకారం ఎవరి భూములు వారికి ఉన్నప్పటికీ మేము దళితులం కావడంతో మమ్ముల్ని అధికారులతో కలిసి, ప్లాంటు యజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

భూమి ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారు



సర్వేనెంబర్ 12లో నాకు 30గుంటల భూమిని సర్కారు ఇచ్చింది. ప్లాంటు నిర్మాణం చేసే నిర్వాహకులు మా భూమి కావాలని అడిగారు. మేము దానికి ఒప్పుకోలేదు. మా భూమిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధి పనుల్లో భాగంగా ఉపాధి హామీ కింద రాళ్లను, కంపచెట్లను తొలగించి, సేద్యం చేసుకుంటున్నాం. ప్లాంటు వారు మా భూములపై కన్నేసి అమ్మాలని ఒత్తిడి చేస్తున్నారు. కొందరు రైతులను మాపైకి ఉసిగొల్పుతున్నారు.

మాతంగి బాబు

ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండానే



చిల్లేపల్లిలోని మూసీ పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్న పవర్‌ప్లాంట్ నిర్మాణానికి గ్రామసభగానీ, ప్రజాభిప్రాయ సేకరణగానీ జరుపలేదు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

మాతంగి శేఖర్

అన్ని అనుమతులు ఉన్నాయి



పవర్‌ప్లాంట్ నిర్మాణానికి అన్ని శాఖల అనుమతి తీసుకొనే నిర్మాణ పనులు చేపడుతున్నాం. ప్లాంట్ నిర్మాణానికి ఎకరం 30గుంటల స్థలాన్ని రైతులు శశిధర్‌రెడ్డి, సిద్ధయ్య, గోపయ్య, కొండా గంగయ్య, వెంకయ్య, కొండ పద్మ, మలిగిరెడ్డి మణెమ్మల వద్ద నుంచి భూమి కొనుగోలు చేశాం. గ్రామపంచాయతీ అనుమతి కూడా తీసుకున్నాం. 'ఇది ప్రభుత్వ భూమి' అని రైతులు అభ్యంతరం తెలిపితే సర్వే కూడా చేయించాం.

ప్లాంట్ నిర్వాహకుడు చంద్రారెడ్డి

డిప్యూటీ సర్వేయర్ పోస్టుల రాతపరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డు శాఖలో డిప్యూటీ సర్వేయర్ పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. 26,874 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 21,060 (78.37 శాతం) మంది హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 56 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. 273 డిప్యూటీ సర్వేయర్ పోస్టులకు జూన్ 2న నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. ఆ పోస్టులకు 27,068 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వారిలో 26,874 మంది అర్హులుగా ఉన్నారని పేర్కొన్నారు.

'ఈఫీ' జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హబీబ్, పిఎన్ చౌదరి ఎన్నిక

వచ్చే ఏడాది ఆగస్టు 1న దేశవ్యాప్త సమ్మె

- 'ఈఫీ' జాతీయ మహాసభల్లో నిర్ణయం
- పలు తీర్మానాలకు ఆమోదం
- ముగిసిన మహాసభలు



కెఓ హబీబ్



పిఎన్ చౌదరి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఫీ) నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెఓ హబీబ్, పిఎన్ చౌదరి ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 21 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మరో ఇద్దరిని తర్వాత నామినేట్ చేస్తారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూడురోజుల పాటు జరిగిన 'ఈఫీ' 8వ జాతీయ మహాసభలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో 'ఈఫీ' జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హబీబ్, చౌదరి మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే ఏడాది ఆగస్టు 1వ తేదీ దేశవ్యాప్త సమ్మె చేయాలని మహాసభల్లో నిర్ణయించినట్టు చెప్పారు. 2014 విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని, సుప్రీంకోర్టు తీర్పు సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని, విద్యుత్ బిల్లులోని 'కంటెంట్-క్యారియర్' విధానాన్ని రద్దు చేయాలని, దేశంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలను షెడ్యూల్డ్ కంపెనీల జాబితాలో చేర్చాలని, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ స్కీంను రద్దు చేసి, పాత విధానంలోనే పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తెలిపారు. ప్రజాసమస్యలపై 'ఈఫీ' ఇకపై మరింత విస్తృతంగా స్పందించాలని నిర్ణయించినట్టు చెప్పారు. వచ్చే ఏడాది ఆగస్టు 1వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెతో పాటు ప్రజాసమస్యలపై విస్తృత స్థాయి క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో జాతీయ మహాసభల సమన్వయకర్త ఆర్ సుధాభాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు (కిరణ్), కోశాధికారి కె ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఈఫీ' నూతన జాతీయ కార్యవర్గం

అధ్యక్షులు – కెఓ హబీబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ – స్వదేశ్‌దేవ్‌రాయ్, ప్రధాన కార్యదర్శి–పిఎన్ చౌదరి, కోశాధికారి– ఎస్ఎస్ సుబ్రమణియన్.

ఉపాధ్యక్షులు– కంచన్ ముఖర్జీ (వెస్ట్‌బెంగాల్), జెఎస్ రాథోర్ (పంజాబ్), కర్ల్వీందర్‌సింగ్ (పంజాబ్), బేలాపాత్ర (వెస్ట్‌బెంగాల్), పి సూరిబాబు (ఆంధ్రప్రదేశ్), ధనలక్ష్మి (తమిళనాడు), సుభాష్‌లంబ (హర్యానా), బి ప్రదీప్ (కేరళ), విఎస్ అజిత్‌కుమార్ (కేరళ), నయన్‌జ్యోతి చక్రవర్తి (అస్సాం), రాజేంద్రన్ (తమిళనాడు).

కార్యదర్శులు – జైప్రకాష్ (కేరళ), సుమశేఖర్ (కేరళ), జెఎస్ ఉప్పల్ (పంజాబ్), నరేష్‌కుమార్ (హర్యానా), ఎన్ కిరణ్ (తెలంగాణ), తరున్‌భరద్వాజ్ (వెస్ట్‌బెంగాల్), జితిన్‌నంది (వెస్ట్‌బెంగాల్), ప్రణయ్‌నాయక్ (ఒడిస్సా), మరో ఇద్దర్ని తర్వాత నామినేట్ చేస్తారు.

ఉద్యోగుల సామూహిక సెలవుకు టీటీయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) రద్దు కోసం వచ్చేనెల 1న ఉద్యోగుల సామూహిక సెలవుకు తెలంగాణ టీచర్స్ సంఘం (టీటీయూ) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీటీయూ అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2004, సెప్టెంబర్ 1 తర్వాత నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ పథకాన్ని రద్దు చేసి, సీపీఎస్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇది నిరంకుశ నిర్ణయమని పేర్కొన్నారు. వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ దర్వాజ
హైదరాబాద్ 4
సోమవారం 21-8-2017


తెలంగాణ ప్రాంతాన సాహిత్య, సాంస్కృతిక చైతన్యం విస్తరించడానికి విశేష కృషి చేసిన వైతాళికుడు డాక్టర్ దేవులపల్లి రామానుజరావు (25 ఆగస్టు 1917– 8 జూన్ 1993) శతజయంతి ముగింపు ఉత్సవాల సందర్భమిది. తెలుగు భాషా సాహిత్యాల ఉన్నతికి, గ్రంథాలయోద్యమ వ్యాప్తికి అహర్నిశలు పాటుపడిన కవి, రచయిత, సంపాదకుడు రామానుజరావు నుంచి స్ఫూర్తి పొందడం ఇవాళ్టి అవసరం. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో మంచి ప్రావీణ్యముంది వారికి. విభిన్న ప్రక్రియల్లో విశేష రచనలు చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, కేంద్ర



సాహిత్య అకాడమీలతో మూడు దశాబ్దాలకు పైబడిన అనుబంధం ఆయనది. శోభ, గోలకొండ పత్రికలకు ఆయన రాసిన సంపాదకీయాలు ఎంతో విలువైనవి. దాదాపు ఇరవై పుస్తకాల వరకు రచించారు. వారు సృజించిన 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' వారి జీవనయానాన్ని, తెలంగాణలో వారు నిర్వహించిన పాత్రని వివరిస్తాయి. తెలంగాణ నేలపై కవిగా, రచయితగా, వివిధ పాలక మండళ్ళ సభ్యునిగా ఆయన నిర్వహించిన పాత్రను తలచుకోవడం అవసరం. తద్వారా ఇవాళ తెలంగాణ సమాజంలో గ్రంథాలయాల పునర్వికాసానికీ, సాహిత్య చైతన్యం పదునెక్కడానికి ఏం చేయాలో గుర్తు చేసుకోడం మంచిది.

ప్రజాపాటల ట్రంకుపెట్టె... తరగని తేనె తుట్టె...


వాళ్లకలం నుంచి వస్తే చాలు... పాటకూ అదొక పరవశం
పదలాలిత్యాల భావ సౌందర్యాలలో సాహిత్యానికి అదొక పరమానందం
నీ పాటకు నేలమ్మ పరవశించి వేల వేల వందనాలంది.
ఆకుపచ్చ చందమామ గేయం రైతన్న గాయానికి వెన్నపూస అద్దినట్టుంది
రెండు మనసులు మనసు విప్పి మాట్లాడు కొన్నట్టుంటుంది
వానమ్మా! నువ్వు రావమ్మా అని పాడితే.. వాన వచ్చినట్టుంది.
భవితకు మార్గం అంబేద్కర్, భారత్‌కు మార్క్స్ అంబేద్కర్
పాటవింటే... లాల్‌నీల్ జెండాలు కల్సినట్టు పేదల రాజ్యమొచ్చినట్టుంది.
వెన్నెల వాకిట్లో... ముత్యాల ముగ్గు వేసినట్టుంటుంది.
గుమ్మానికి పసుపు పూసి నట్టుంటుంది. పరిగడుపున
పాలు తాగినట్టుంటుంది. కోకిలలన్నీ కచ్చేరి చేసి
నట్టుంటుంది. రాగాల వాగు పొంగినట్టుంటుంది.
వాళ్ళు తెలుగు పాటల ట్రంకుపెట్టె... ఎంత జుర్రుకొన్నా తరగని తేనెతుట్టె...



– భూపతి వెంకటేశ్వర్లు

వీళ్లపాటలబడి సాగిందిలా.. వీరి ప్రజానాట్యమండలి తెలంగాణ అమరవీరుల ఆశయబలం, మట్టిమనుష్యుల నుండి మరమనుషుల వరకు ఎరిగినోళ్ళు, దొర భూస్వాముల పెట్టుబడుల, గుట్టు, కనికట్టు తెలిసినోళ్ళు, లాఠీలు, తూటాలు జైలు గోడలు సూసినోళ్లు, ఆరోగ్యం అనారోగ్యం చావు అంచుల వరకు వెళ్ళి వచ్చిన వాళ్ళు అందుకే వాళ్ల కలంలో గళంలో అంతపదును, పచ్చనిపాటలు, వెచ్చని కవితలు అరుణారుణ కిరణాలుగా మనపై ప్రసరించగలరు... ఆడించగలరు... లాలించగలరు... మనతో పాడించగలరు.. పరుగులు పెట్టించగలరు. ప్రజల స్వరాల నదిలో పరవళ్లు తొక్కించగలరు. అందుకే... ప్రజలంతా వాళ్ళ జట్టే.. వారే వీరు తెలంగాణ తేజం, ప్రజలసుకవి సుద్దాల అశోక్‌తేజ, జగమెరిగిన "ప్రజాకవి" జయరాజుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా... విశిష్ట పురస్కారాలను అందుకున్నందుకు తెలంగాణ సాహితీ అభినందిస్తున్నది. స్నేహ వాక్యం అందిస్తున్నది. చెయ్యి చెయ్యి కలిపి మరో ప్రపంచానికి "తరలుదామురండి మన జన్మభూమికి తల్లిపాల రుణం కొంత తీర్చడానికి" వూళ్లకి వూళ్ల కదిలించిన పాట తీరు...





'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు, మహాపురుషులవుతారు" అనే పాటకు నిలువెత్తు నిదర్శనం సుద్దాల, జయరాజ్‌లు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, కష్టాలు, నష్టాలు, కన్నీళ్లు దొరతనం, దోపిడీ ఇవన్నీ తెలుసు. ఇవిలేని సమాజం కోసం కలలుగన్నారు. ఆకలి, అన్నం విలువ, బాధలు, భయాలు మనిషిగా చూసినోళ్ళు మనసుపెట్టి ఆలోచించినోళ్ళు, మాక్సింగోర్కిని, అమ్మ నవలను అధ్యయనం చేసినోళ్ల ప్రకృతికి మనిషికి ఉన్న పేగుబంధం తెలిసినోళ్ళు, ప్రపంచ మార్పులు పసిగట్టేవాళ్ళు దేన్నీ ధ్వంసం చేయకుండా, దేన్నీ నిర్మించలేము అనే సూత్రం తెలిసినవాళ్ళు, గొప్ప కవి కావటానికి ప్రతిక్షణమూ దగ్ధమవ్వాలని గుర్తుచేసుకునేవాళ్ళ, శ్రమజీవుల బతుక్కి, పెట్టుబడుల బలుపుకి మధ్యనున్న వ్యత్యాసం ఖచ్చితంగా తెలిసినోళ్ళు, శ్రమయేవ జయతే అంటూ పలువరిస్తున్నవాళ్ళు కట్టెల మీద నిలబడరా కట్టు తెగితే మనమెక్కడరా, ఎన్నెన్నో దారులలో చీలిన మన ఉద్యమాలు ఐక్యంగా నడవాలి. ఇప్పుడే, ఇక్కడే, ఈ క్షణము కమ్యూనిస్టులందరూ ఐక్యం గావాలని గానం చేస్తున్నవారు, పల్లెతల్లి కళ్ళనీళ్ళు తుడిచే బాధ్యతను స్వీకరించాలని, యువతకు ప్రబోధించినోళ్ళు పనికోసం పనిముట్టు ఎట్లా పుట్టాయో పనిలోంచి పాట ఎట్లా పుట్టిందో... పనిపాటల రక్తసంబంధాన్ని పదిలంగా కవిత్వీకరించినవాళ్ళు, "ఆడిదాన్నిరో! నేను ఆడిదాన్నిరో! ఈడ ఎవనికి కానిదాన్ని యాడిదాన్నిరో నేను" అని అడకూతురుగా ఆక్రోశించినవాళ్ళు, మొగనికి చెరిసగం కాదు, మొగులుకే చెరిసగం నువ్వు, ఆడదాని గుండెలలో ఆదిశక్తి ఉన్నది అని అన్నోళ్ళు, అమ్మకు అమ్మై పుడితే తప్ప అమ్మరుణం తీరదన్నారు. "అమ్మ"కు అగ్రతాంబులం ఇచ్చారు.

పల్లెను ప్రాణప్రదంగా ప్రేమించినవారు, కోడికూతలు తొలకరివానలు, పచ్చని పంటలు, అలమందలు, లేగదూడలు, గువ్వలగూళ్ళు, ఎడ్లబండ్లు, గొర్రు గుంటకలు, చేనేత పరికరాలు, పండుగలు పబ్బాలు, ఇలా పల్లెబతుకు తెల్లవారుతున్న వైనం. ప్రపంచీకరణ వృషభం పల్లె నడిబొడ్డున కాలు దువ్విన దృశ్యం. తల్లిలాంటి పల్లెకు తనువంత గాయాలురా అని బాధపడ్డారు. వీళ్ళు అచ్చమైన తెలంగాణ పల్లెటూరు పిల్లగాళ్ళు. సొంత గొంతులను విప్పారు. విశ్వాసాన్ని గానం చేశారు. తమ సొంత ముద్రలను లీనం చేశారు. ప్రజాపోరాట వీరుడైన సుద్దాల పద పథంలో హనుమంతు నుంచి, మరెందరో ప్రజా గాయకుల వరకు సంక్రమించిన వారసత్వం. అందుకే పాటలో అశ్రువై... మనల్ని దు:ఖ సముద్రాలు చేస్తారు. నిప్పు కణికై మనల్ని అగ్నిపర్వతాలు చేస్తారు. ఉత్తమ మానవులై మనల్ని మహా మానవుల్నిగా మలుస్తారు. సినీగేయ రచయితగా, కవిగా, సీరియస్ కవిగా వీరు గుర్తింపు, గౌరవాన్ని రెండింటినీ ఘనంగా పొందుతున్నారు. ఏ విశ్వాసాన్ని దేనికోసం, ఏ విలువను దేనికోసం అమ్ముకోవడానికి సిద్ధంగా లేరని... తండ్రుల తరంనుంచీ తనదాకా ఎన్ని దొరతనాలు మారినా ప్రజలకేమీ ఒరగలేదని వీరు గుర్తించారు. 'రాజ్యహింస జరిపే దారుణ మారణకాండ' గురించి తెలుసుకున్నారు.

వీళ్ళది కమ్యూనిస్టుల వారసత్వం. ప్రజావాగ్గేయకారుల వారసత్వం. జానపద కవుల వారసత్వం. భక్తికవులు, బైరాగులు, తత్వకవుల వారసత్వం, మనిషిపట్ల, అపారమైన ప్రేమ, పేద బతుకులో మునిగిపోవడం, లీనం కావడం, ప్రతీదాన్ని అనుభవించడం, అనుభవించినదాన్ని తన అంతరంతరాల్లో పదిలపర్చటం, చిక్కుపడ్డ దారంపోగులా చిక్కు విప్పినట్టు ప్రజలకందివ్వడం వంటి ప్రజాసాహిత్య ప్రతిభ వారిలో ఇమిడిఉంది. తమదైన సొంతముద్ర కనిపిస్తుంది. వీళ్ళు ఇలా ఉండటానికి ఉద్యమం నుంచి, వామపక్ష భావాజాలం నుంచి వచ్చినవారు అవటమే. స్త్రీవాద, దళిత నేపథ్యం నుంచి ప్రజాపోరాట ప్రభావంతో వచ్చినవే ఈ పాటలు. శ్రీశ్రీ, దాశరథి, సినారే, దేవులపల్లి, ఆరుద్రలాంటి వరుసలో సినీగేయాలు ప్రజా గేయాలు రాస్తున్నారు. అభ్యుదయ కవుల తీవ్రత, భావకవుల లాలిత్యాలను స్వీకరించి తమదైన బాణీని (డిక్షన్) సృష్టించుకున్నారు.

పాటల్లో మేటిగా అశోక్‌తేజా ఇప్పటివరకూ 11 పుస్తకాలు రాశారు. సుమారు 1250 సినిమాల్లో 2,225కు పైగా పాటలు రాశారు. రెండుసార్లు నంది అవార్డులు అందుకున్నారు. 2003లో ఠాగూర్ సినిమాలో పాటకు జాతీయ అవార్డు, నేడు విశిష్ట పురస్కారం లభించినా... అవి ప్రజాసామాజిక సాహిత్యానికే వచ్చాయని చెప్పక తప్పదు.

పాటల నెలరాజు జయరాజు. ప్రకృతికవి, సమాజానికి పట్టిన కులం, మతం, ఆకలి, దరిద్రంపై ఫిరంగులు కురిపిస్తున్న విప్లవ కవి. సమతానురాగాలు కలగలసిన ప్రేమకవి. బుద్ధుడు, పూలే, మార్క్స్, అంబేద్కర్ జీవితాలను మన కాలపు పిల్లలకు పాటై వినిపిస్తున్నారు. ప్రజా సాహిత్యాన్ని అందిస్తున్నారు. 'మానవుడు – కల'గనడం ఆగనంత వరకూ పాట ఆగదు. పాట ఎప్పుడూ ప్రవహిస్తున్న నది. పాటలేని తెలంగాణ లేదు. కోటల్ని కూల్చింది ఫిరంగి కాదు, పాటే. సామ్రాజ్యాల్ని దించింది పాట. ప్రజల పాటలకు ఇక్కడ ఎప్పుడూ పట్టం కడతారు. అందుకే ఉద్యమ వారసత్వానికి కృతజ్ఞతలు. సామాజిక సాహిత్య చేవ్రాలుకు మా కౌగిలింతలు. మనిషిలో ఆశను, అగ్నిని చల్లారనీయకుండా మరో లోకానికి పరుగుపెట్టాలని, వయసెరుగని పాటలు రాసే బాటసారులకు అభినందనలు.

సెల్: 9490098343

తక్కెడలో చెమట చుక్కలు

వాళ్ళెన్నడూ
కడుపుకింత కమ్మగ తిని
కంటి నిండా నిద్రపోయిన వాళ్ళు కాదు

వాళ్ల బతుకు
పొలంలనే పొద్దుగూకి
పొలంలనే తెల్లారుతది
మన్ను బుక్కి మన్ను కక్కుతరు



ఇంటి సంతు పంట సంతు
వాళ్ళకు వేరువేరు కాదు
చేను చేతికచ్చేదాక
పానాపానమోలె కాపాడుతరు

ఆరుగాలం ఏ విత్తనం ఎప్పుడు వెయ్యాలో
ఏ పురుగుకు ఏ పంట ప్రేమో
చీడ పుట్టుపడి శేను సాగుబడి
అన్నీ తెలిసిన వ్యవసాయ శాస్త్రవేత్తలు వాళ్ళు
కానీ
ఎంత నెత్తి కొట్టుకున్నా
ఏ దినుసును ఏ దళారీ చెరబడుతడో
ఏ పంటకు ఏ వ్యాపారి
కడుపుల మంట వెడుతడో
పసిగట్టడం వాళ్ళకు అస్సలు చేతకాదు

ధోకకు లోనవడం తప్ప
ధోకాబాజీ తనం తెలియనోళ్ళు


తక్కెడలో వాళ్ళ చెమట చుక్కల బరువు
ఎప్పుడూ అల్కగనే
పాసంగంలో సెంటు తుంపరల దరువు
ఎల్లప్పుడూ మోతకోలుగనే

– మద్దికుంట లక్ష్మణ్, 9441677373

సాహిత్యవిమర్శలో పదునైన స్వరం

బుద్ధుడు, పూలే, అంబేద్కర్, కాన్షీరాం మొదలు పోతులూరి వీరబ్రహ్మం, మాదిగ కక్కయ్య, వేమన, గుర్రం జాషువా, బోయి భీమన్న, శివసాగర్, బాలగోపాల్, సాహు, విలాస్ ఘోగ్రే, త్రిపురనేని శ్రీనివాస్, కేశవరెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, హేమన్‌డార్ఫ్, రావూరి భరద్వాజ, ఎస్.ఆర్. శంకరన్, వడ్డెర చండీదాస్, కెఎన్‌వై. పతంజలి, న్యాయవాది చంద్రశేఖర్, సివి. సుబ్బారావు, జ్యూలియస్ ఫ్యూజిక్, కలేకూరి ప్రసాద్, నాగప్పరాజు సుందర్రాజు, అలిశెట్టి ప్రభాకర్, చంద్రశ్రీ... యింకా అనేకమందిని ఏకకాలంలో ఒకచోటకు చేర్చి, మన అవగాహనని ఇనుమడింపజేసే పుస్తకం డాక్టర్ పగడాల నాగేందర్ రాసిన 'మొగురం'. ఇంత విలువైన పుస్తకాన్ని రచించిన నాగేందర్‌కు ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం విమర్శనా రంగంలో కీర్తి పురస్కారం ప్రకటించడం సంతోషదాయకం. మరోసారి సాహిత్యపాఠకులు ఈ పుస్తకం చదవాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన సందర్భం. 2012లో వచ్చిన ఈ పుస్తకం సాహిత్యవిద్యార్థులందరికీ ఉపయుక్త గ్రంథం. నిత్య జీవితంలో తనచుట్టూ విస్తరించుకుని ఉన్న సమాజంలో ప్రజాస్వామిక స్పృహ విస్తరించాలనే తపనని పొదివిపట్టుకుని నడిపించిన అనేక వాక్యాలు ఈ పుస్తకం నిండా ఉంటాయి.





"నీ శత్రువులను ఎల్లప్పుడూ క్షమించు. కాని వారి కారణంగా పడిన బాధను మాత్రం ఎప్పుడూ మర్చిపోకు" అన్న ఆస్కార్ వైల్డ్ మాటలు 'మొగురం' చివరి పేజీలో చివరి మాటలుగా పగడాల నాగేందర్ ప్రస్తావించటం చెప్పుకోదగింది. కాగా, ఉద్యమాల వెంట అలసట ఎరుగని బాటసారిలా తిరిగిన నాగేందర్ అవగాహనని ఈ పుస్తకం పరిచయం చేస్తుంది. అనేక ఉద్యమాల పరిధిని విశాలం చేస్తూ, వాటిని సమర్ధించటంలో ప్రజాస్వామిక స్పృహ విస్తరిస్తుందంటూ ఓ రెండు దశాబ్దాల పాటు నిరంతర సాహిత్య సృజనగా మన కళ్ల ముందు దీటుగా మార్చింగ్ చేస్తుందీ పుస్తకం. ఒంటరిగానో, సమూహంగానో తాను నమ్మిన విలువల్ని ప్రచారం చేస్తూ, సమర్ధనగా కవిత్వమో, వ్యాసమో, విమర్శనో రాస్తూ నిరంతరం కాలం మీద చెవొగ్గి అస్తిత్వాల లోపలి స్వరాన్ని వినటానికి చిరంతనం ప్రయత్నించిన సాహితీకారుడు నాగేందర్.

కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్‌బాబులతో పాటు అనేకమంది కవుల గుంపుల మధ్య నాగేందర్‌తో ముచ్చటించిన సందర్భం ఉన్నప్పటికీ, ఈ పుస్తకం నాగేందర్ ఈ సమాజం నుంచి బహుజన సమాజానికి ఏం కావాలో కోరుకోవటం స్పష్టంగా కనిపిస్తుంది. కారంచేడు అనంతరం ఉవ్వెత్తున ఎగసిన దళిత కవిత్వంలో తన వంతు పాత్రని నిబద్ధంగా నిర్వహించాడు. కవిగా, రచయితగా, సాహిత్య విమర్శకునిగా నాగేందర్ చేస్తున్న కృషి ఎంతో ఉపయుక్తమైంది.

'ఆధునిక వచన కవిత్వం – ప్రాంతీయతా దృక్పథాలు' అంశంపై పిహెచ్‌డి చేసిన నాగేందర్ ఓ ఇరవై సంవత్సరాలు అస్తిత్వ ఉద్యమాల దివిటీగా అటు జీవితంలో, ఇటు సాహిత్యంలో గాలిపటంలా తిరిగాడు. విమర్శలో తెలంగాణ యాసనీ, డిక్షన్‌నీ ప్రవేశపెట్టటంలో సిద్ధహస్తుడయ్యాడు. 'జీవితపు సన్నని సందులకే ఆకర్షణ మాకు' అనే శ్రీశ్రీ పాదాలను నిరంతరం కోట్ చేయటం ఆయనకు ఆలవాటు. ఏది చెప్పినా, చెప్పాలనుకున్నదాన్ని సూటిగా చెప్పడం అతని విమర్శనా వ్యాసంగానికి పదునైన శైలిని సమకూర్చింది.


కవిత్వంలో ఎంత గొప్ప వారైనా, సాహిత్యరంగంలో సుదీర్ఘ చరిత్ర కలిగివున్నా ఏ సాహిత్య సంస్థనైనా విమర్శకు పెట్టటం, గుణ, రుణ చర్చ చేసి మళ్లీ సంలీనం ఐపోవటం, ఒక ప్రజాస్వామిక స్పృహ కోసం తండ్లాట పడటం నాగేందర్ విమర్శలో ఉండే గుణం. ఇది తొలి పుస్తకమే కావొచ్చు. కానీ, అనేకానేక పుస్తకాల సమీక్షలు ఇందులో కనిపిస్తాయి. దాదాపు ఓ నలభై ఏళ్ల సాహిత్య ప్రవాహ గతిని ముచ్చటగా ముడేసిన తీరు 'మొగురం' పాఠకులకి గొప్ప అవగాహనని కల్పిస్తుంది.

ఇందులో మద్దెల శాంతయ్య, మద్దూరి నగేష్‌బాబు, గ్యార యాదలపై ఉన్న నివాళి వ్యాసాలు మనకి కన్నీళ్ళు తెప్పిస్తాయి. తాను చదివిన పుస్తకాల్లోంచి, తాను నడిచిన దారుల్లోంచి, తనని కదిలించిన సంఘటనల్లోంచి, తాను తిరుగుబాటు చేయాలనుకున్న సందర్భాల్లోంచి నాగేందర్ తననుతాను ఆవిష్కరించుకున్న వ్యాసాల సంపుటి ఇది. ఇంతా చేసి, ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత కెఎన్‌వై. పతంజలికి అంకితం ఇవ్వటం మరో విశేషం. కవిగా, రచయితగా, సాహిత్య విమర్శకుడిగా నాగేందర్ ప్రయాణాన్ని నిశితంగా వ్యక్తం చేసే పుస్తకం మొగురం. అస్తిత్వాల తండ్లాటలో వెలుగులోకి వచ్చిన అనేక సాహిత్య ధోరణులకు ప్రతినిధిగా అనేక పోరాటాలు చేస్తూ, తన అవగాహనను విశాలం చేసుకుంటూ రాసిన ఈ పుస్తకానికి అవార్డు రావటం అభినందనీయం.

– డాక్టర్ నూకతోటి రవికుమార్, 98481 87416

అన్వేషణ

బయట పరచుకున్న
కటిక చీకటి
అంతరంగంలోకి ప్రవేశించకూడదు
వెలుతురు కోసం
అన్వేషణ
కొనసాగుతూనే వుండాలి
నీలాకాశం నిండా
కారుమబ్బులు కమ్ముకున్నప్పుడు
మెరుపుల కాంతి రాక తప్పదు



చిరుజల్లులకు
మోడువారిన వృక్షాలు
చిగురించక మానవు
పున్నమి పరిమళాలను ఆస్వాదించాలంటే
అమావాస్య చీకటిని
అనుభవించక తప్పదు
నేల
ఆకాశం
అంచులు కలిసేచోట
వెలుగు కిరణాలు ఉదయిస్తాయి
మంచి అనే కెటలిస్ట్
మనసును తడితే
బాధ సంతోషంగా రూపాంతరం
చెందుతుంది
హృదయ కుహరాలు వికసిస్తాయి

– గొట్టిపర్తి యాదగిరిరావు, 9297277795

ఆశయసాధనలో భిన్న పంథా

అఖిల భారతస్థాయిలో ఆచార్య ఎన్.జి.రంగా తొలిరైతు ఉద్యమ నిర్మాత, గాంధేయవాదిగా తెలుగునాట ఎందరెందరో అతిరథ రాజకీయ వేత్తలకు ఆచార్యత్వం వహించిన అగ్రశ్రేణి మేధావి 1934లో రంగాజీ నిడుబ్రోలులో రైతాంగ విద్యాలయం స్థాపించారు. దేశంలో అదే మొదటి రాజకీయ పాఠశాల. రైతు సంఘాలు, రైతాంగ విద్యాలయాలు, రైతు పోరాటాలు, రైతు రక్షణ యాత్రలు, రైతాంగ భజనావళి ఇవన్నీ ఆయన సృష్టే. రైతు పోరాటాన్నే స్వాతంత్ర్య పోరాటంగా, స్వాతంత్ర్య పోరాటాన్నే రైతు పోరాటంగా తీర్చిదిద్దారు. 1946 నుండి 1951 వరకు రంగాజీ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు. కేంద్ర శాసన సభలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్ష బాధ్యతలను నిర్వహించారు. కంట్రోళ్ళను, పర్మిట్లను, రేషనింగులను రద్దు చేయాలని ఆయన ఉద్యమాలు నడిపారు.

నెహ్రూతో విభేదించి 1951లో రంగా కాంగ్రెస్ నుండి వెళ్ళిపోయారు. తరువాత ప్రజాపార్టీలో చేరారు. అక్కడ ప్రకాశం గారితో సరిసమాన ప్రతిపత్తి రాలేదని దాన్ని వదిలారు. కృషిక్ లోక్ పార్టీ స్థాపించారు. పార్లమెంటుకు నిలిచి ఎన్నికల్లో ఓడిపోయారు. 1969లో కాంగ్రెస్ రెండుగా చీలింది. బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు మొదలయ్యి ఇందిరాగాంధీ విధానాలను ఆచార్యరంగా బలపరిచారు. దాంతో ఆయన 1971లో తిరిగి కాంగ్రెస్‌లో చేరిపోయారు. 1978లో కాంగ్రెస్ మరోసారి చీలినప్పుడూ ఆచార్య రంగా ఇందిరాగాంధీ పక్షానే వున్నారు. ఆచార్య రంగా ఏనాడూ ఆంధ్ర శాసన సభ్యుడు కాదు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రధానులుగా వున్న కాలంలో ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి ఉపనాయకుడిగా వున్నారు. పి.వి.నరసింహారావుకు మద్దతు పలికారు. 1919లో భారత ప్రభుత్వం ఆచార్య రంగాకు పద్మవిభూషణ్ ఇచ్చి సత్కరించింది.

ఎన్ని కష్టాలు పడినా, ఎన్ని పార్టీలు మార్చినా ఆచార్య రంగాకు అధికారం అందని పండులా మారింది. పైగా పార్టీలు మార్చాడన్న అపప్రథ మిగిలింది. స్వంతరాష్ట్రంలో పట్టు సాధించలేనివారు కేంద్ర రాజకీయాలను పట్టుకుని వేలాడుతుంటారు. అలాంటి వారిలో ఒకడిగా రంగా మిగిలిపోయారు. ఇందుకు కారణం ఆయన అభిజాత్యం, ఆధిక్యధోరణులే అని కొంతమంది విశ్లేషకుల భావన. కాని నిజానికి ఆయనలో ఒక రాజకీయ నాయకుడికి ఉండాల్సిన దూరదృష్టి, లౌక్యం లోపించడమే ఆయన్ని దెబ్బతీసింది. ఆచార్య రంగా గురించి బయట వినిపించే వాదనలు, కనిపించే చరిత్ర వేరు. ఆయన జీవితం ఎన్ని మలుపులు తిరిగిందో వివరిస్తూ, ఎక్కడ – ఎందుకు – ఎలా ప్రవర్తించవల్సి వచ్చిందో వివరిస్తూ ఆయనే రాసుకున్న 'స్వీయ చరిత్ర' అన్ని సందేహాలనూ పటాపంచలు చేస్తుంది.

ఈ స్వీయ చరిత్ర రంగా పుట్టినప్పటినుండి (1900) మొదలుకొని స్వతంత్ర పార్టీలోకి (1959) చేరేవరకు గల ఆర్థిక, సామాజిక, రాజకీయ చరిత్రను నమోదు చేసింది. ఇందులో గాంధీజీ దొంగ వేషాలను, నెహ్రూ ఆధిపత్య – నిరంకుశ ధోరణులను, సర్దార్ పటేల్ చాకచక్యాన్ని, వినోబా భూదానోద్యమ డ్రామాను, కామరాజ్ నాడార్ చెంచాగిరి – నాన్చివేత ధోరణిని బట్టబయలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలు, అవినీతి, అధికార లాలసతతో భ్రష్టుపట్టి పోయినందుకు ఆ పార్టీని రద్దు చేయమని గాంధీజీ సూచించారు. కాని కాంగ్రెస్ పార్టీపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం నెహ్రూ ఆ పని చేయలేదు. సోవియట్ నమూనా పట్ల ఆకర్షితుడై నెహ్రూ తలపెట్టిన పనులన్నీ రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక పనులని ఎప్పటికప్పుడు రంగా నిలదీయడం నెహ్రూ భరించలేకపోయాడు. కాంగ్రెస్‌లో వుండలేని పరిస్థితులు కల్పించడంతో రంగా బయటకు రావలసి వచ్చింది. అంతే తప్ప అధికార దాహంతో కాదు. తన ఆశయాల సాధన కోసం కొత్త పార్టీలను పెట్టాల్సివచ్చిందని తెలియజేశాడు. ఉత్తరాదిరాజకీయ నాయకులకు దక్షిణాది వారిపై వున్న చులకన భావాన్ని – అలసత్వాన్ని తెలియజేయడంతో పాటు తెలుగు వాళ్ళలో వున్న అనైక్యత, ముఠాధోరణులు, కుళ్ళుబోతు తనాన్ని కూడా ప్రస్తావించారు. ప్రొఫెసర్ హిరెన్ ముఖర్జీ నివాళి, యలమంచిలి శివాజీ ముందుమాట ఆచార్య రంగా గారి ఇంకో కోణాన్ని తెలియజేస్తాయి. రావెల సాంబశివరావు అనువాదం బాగుంది.



ఆచార్య రంగా స్వీయచరిత్ర, అనువాదం : రావెల సాంబశివరావు, పేజీలు : 446, వెల : 450/–, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు.

– కె.పి.అశోక్‌కుమార్, 9700000948

శివరాజు సుబ్బలక్ష్మికి మాలతీచందూర్ పురస్కారం

మాలతీచందూర్ పురస్కారం 2017కు శివరాజు సుబ్బలక్ష్మి ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని ఈ రోజు హైదరాబాద్‌లో అందజేస్తారు.

డా॥జయప్రకాష్‌కు దాశరథి పురస్కారం

తెలుగు భాష చైతన్యసమితి, ద్వా.నా సాహితీ కుటీరం సంయుక్త ఆధ్వర్యంలో డా॥జయప్రకాష్‌కు డా॥ దాశరథి రంగాచార్య స్మారక పురస్కారం అందజేస్తారు. ఈ పురస్కార సభ 24వ తేదీన సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. నందిని సిధారెడ్డి, ద్వా.నా.శాస్త్రి, బైస దేవదాసు, కందుకూరి శ్రీరాములు పాల్గొంటారు.

బి.ఎస్.రాములుకు పల్లేరు స్వయంప్రభ సాహితీ పురస్కారం

బి.ఎస్.రాములుకు ఈ నెల 26వ తేదీన పరకాలలోని స్వర్ణ గార్డెన్స్‌లో పల్లేరు స్వయంప్రభ సాహితీ పురస్కారం అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ఈ సభలో దేవులపల్లి ప్రభాకర్‌రావు, టి.రంగస్వామి, పసునూరి దయాకర్, జి.గిరిజా మనోహర్‌బాబు, చల్లా ధర్మారెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, డా॥పత్తిపాక మోహన్, మార్త రాజభద్రయ్య, డా॥పి.ఎల్లయ్య, బొచ్చు వినయ్, కె.వి.యల్, యం.బ్రహ్మచారి, జీడికంటి శ్రీనివాసమూర్తి, మండ సదాలక్ష్మి పాల్గొంటారు. ఇదే సభలో ఏరుకొండ శశిరేఖ 'పల్లె పిలుస్తుంది' కథా సంపుటి ఆవిష్కరణ ఉంటుంది.

భూతం ముత్యాలు పుస్తకాల ఆవిష్కరణ

భూతం ముత్యాలు రాసిన 'దగ్దం' స్వీయ కథల సంపుటి, 'కులాట్కం' నాటకం పుస్తకాల ఆవిష్కరణ ఈ నెల 27న జరుగుతుంది. హైదరాబాద్, రవీంద్రభారతిలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభలో ఎస్వీ సత్యనారాయణ, జి.వి.రత్నాకర్, అంబటి సురేంద్రరాజు, దెంచనాల శ్రీనివాసం, నిమ్మ బాబురావు పాల్గొంటారు.

27, 28 తేదీల్లో వర్ధమాన కవయిత్రుల శిబిరం

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆగస్టు 27, 28 తేదీల్లో జరిగే వర్ధమాన కవయిత్రుల అధ్యయన శిబిరంలో పాల్గొనదలచిన వర్ధమాన కవయిత్రులు తమ వివరాలను telanganasaraswathaparishath@gmail.comకు దరఖాస్తులు పంపాలి. వివరాలకు 040–24753724.

– జె. చెన్నయ్య

కవితా సంపుటాలకు ఆహ్వానం

వెన్నెల సాహితీ సంగమం, సిద్ధిపేట ఆధ్వర్యంలో ఎడ్ల గురవారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం కోసం 2015, 2016లో ప్రచురితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. మూడు ప్రతులను ఆగస్టు 31లోగా కొండి మల్లారెడ్డి, ఇం.నెం.19– 61/5/సి, విద్యానగర్, రోడ్ నెం.3, కుషాల్ నగర్, సిద్ధిపేట– 502103 చిరునామాకు పంపాలి. వివరాలకు : 94419 05525.

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్– 500020



కొత్త జీవితం...

ఖైదీలంటే సమాజంలో చిన్నచూపు. జైలు నుంచి బయటికొచ్చినా అవమానాలు తప్పవు. ఇక మహిళా ఖైదీలంటే వేరే చెప్పనవసరం లేదు. భర్త ఆదరించపోగా వేరే పెండ్లి చేసుకుని తన సుఖం తాను చూసుకుంటాడు. పిల్లల భారం ఈమెపై పడుతుంది. వాళ్ళను పెంచి పెద్ద చేయాలి. కష్టపడదామంటే ఎవరూ పని ఇవ్వరు. అలాంటి వారికి తెలంగాణ జైళ్ల శాఖ గౌరవప్రదమైన జీవితాన్ని ప్రసాదించింది. వారి కోసం ప్రత్యేకంగా పెట్రోల్ బంకు పెట్టి ఆత్మవిశ్వాసంతో బతికేలా ఉద్యోగాలిచ్చింది.

కారణం ఏమైనా కావొచ్చు... క్షణికావేశం మనిషిలోని మానవత్వాన్ని కనుమరుగుచేస్తుంది. చివరకు నేరస్తులుగా మార్చేస్తుంది. ఫలితం జైలు శిక్ష. అలాంటి వారికి మరో జీవితాన్ని అందివ్వాలి. ఇదే లక్ష్యంతో తెలంగాణ జైళ్ల శాఖ ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మాజీ ఖైదీల కోసం జూన్ నెలలో చంచల్‌గూడ జైల్ సమీపంలో ఓ పెట్రోల్ బంకును ప్రారంభించింది. దీంతో విడుదలైన మహిళా ఖైదీల కోసం పెట్రోల్ బంకు ప్రారంభించిన ఘనత తెలంగాణ రాష్ట్ర జైళ్ళ శాఖకు దక్కింది. సమాజం నుండి ఆదరణ కరువై ఏ దిక్కూ లేని మాజీ మహిళా ఖైదీలకు ఈ బంకు కొత్త జీవితాన్ని అందిస్తుంది.

ఇక నేరాలు చేయాను

సత్తెమ్మకు ప్రస్తుతం 72 ఏండ్లు. ఓ హత్య కేసులో ఆరేండ్లు జైలు శిక్ష అనుభవించింది. 2016లో జైలు నుంచి విడుదలయ్యింది. ఇంట్లో ముసలాయనకు 80 ఏండ్లు. ఇద్దరు కొడుకులున్నా ఆదరించే వారు కరువయ్యారు. అలాంటి స్థితిలో పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్నారని తెలిసి అధికారులను కలిసింది. అయితే వయసు ఎక్కువగా ఉండడంతో ఆమె బంకులో పని చేయడం కష్టం. అందుకే బంకు దగ్గరే జైల్లో ఖైదీలు తయారు చేసిన వస్తువులతో ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసి అందులో సత్తెమ్మకు పని కల్పించారు. 'ఇకపై గౌరవంగా బతుకుతా, ఎలాంటి నేరాలు చేయను' అంటుంది ఆమె.

కొండంత ఓదార్పు

సారిక భర్త ఉరివేసుకుని చనిపోయాడు. ఈ కేసులో జైలు శిక్ష అనుభవించింది. ఒక బాబు, పాప ఉన్నారు. భర్త చనిపోయిన తర్వాత అత్తమామలు ఆస్తులన్నీ తీసుకుని పిల్లల్ని వదిలేశారు. తన చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకుంది సారిక. తండ్రి మరో పెండ్లి చేసుకున్నాడు. ఆమె జైల్లో ఉన్నన్ని రోజులు పిల్లల్ని అక్క చూసుకుంది. జైలు నుంచి వచ్చిన తర్వాత పరిస్థితి ఏంటి? ఎక్కడా పని దొరకలేదు. ఎవ్వరూ ఆదరించలేదు. పైగా ఛీత్కారాలు. దాంతో సిటీ వదిలి ఊరికి వెళ్ళి కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని పెంచుకోవాలనుకుంది. ఆ సమయంలో జైలు నుంచి 'ఉద్యోగం ఇస్తాం చేస్తావా' అని ఫోన్ వచ్చింది. కష్టాల్లో ఉన్న సారికకు ఈ పిలుపు కొండంత ఓదార్పునిచ్చింది. వెంటనే వెళ్ళింది. అక్కడే పదిహేను రోజులు ట్రైనింగ్ ఇచ్చి పెట్రోల్ బంకులో ఉద్యోగం ఇచ్చారు. నెలకు పన్నెండు వేల జీతం. మొదటి నెల జీతం తీసుకున్నప్పుడు సారిక కంట్లో నీరు ఆగలేదు.



ఇక్కడ రక్షణ ఉంటుంది

26 ఏండ్ల వాణి పాల్‌టెక్నిక్ చదివింది. పెండ్లయి రెండేండ్లు. భర్తకు వాణిపై విపరీతమైన అనుమానం. అతని హత్య కేసులో ఈమెకు శిక్ష పడింది. మూడు నెలలు జైలు జీవితం గడిపిన వాణి బెయిల్‌పై బయటకు వచ్చింది. కేసు ఇంకా నడుస్తునే ఉంది. ప్రస్తుతం ఆమె బాబుకు ఐదు నెలలు. 'నేను జైలుకు వచ్చినప్పటి నుంచి మా అమ్మానాన్నలను మా బంధువులు వెలివేశారు. నా వల్ల వాళ్ళకు ఎన్ని కష్టాలో. కానీ మా అమ్మ నాకు చాలా సపోర్ట్‌గా ఉంది. మొదట్లో పెట్రోల్ పంప్‌లో ఉద్యోగం అంటే కాస్త ఇబ్బందిగా అనిపించింది. ఈ పని చేయడం కాస్త కష్టమే. ఓసారి మానేద్దాం అని కూడా అనుకున్నాను. కానీ మా అమ్మనే ధైర్యం చెప్పింది. ఇప్పుడు అలవాటయ్యింది. ఇక్కడ పని చేస్తూ నా కష్టాలన్నీ మర్చిపోతున్నా. ఈ ఫీల్డ్‌లో అమ్మాయిలు చాలా తక్కువ. ఇందులో పని చేయడం చాలా గర్వంగా ఉంది. జైలు నుంచి వచ్చినా గౌరవమైన జీవితాన్ని గడుపుతున్నందుకు సంతోషంగా ఉంది. ఇక్కడ మాకు రక్షణ ఉంటుంది. ఎందుకంటే ఎక్కడ ఉద్యోగం చేసినా అమ్మాయిలకు ఏదో ఒక సమస్య. కానీ ఇక్కడ మాకు సమస్యలేవీ లేవు.



గౌరవంగా బతకాలనే...

గతంలోనూ 42 మంది మాజీ ఖైదీలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్లలో ఉపాధి కల్పించాం. మరికొంతమంది బేకరీ, నోట్ బుక్, టైలరింగ్, క్యాండిల్స్ తయారీ, ఫుడ్ కోర్టులో శిక్షణ పొంది వేర్వేరు చోట్ల పనిచేస్తున్నారు. పెట్రోల్ బంకులో పనిచేసే మహిళల చేతికి యూనిఫాం ఇచ్చినప్పుడు వాళ్ల కండ్లలో కనిపించిన ఆనందం మాటల్లో చెప్పలేను. ఉద్యోగం ఎంతో అవసరమైన వారికి ఇక్కడ ప్రాధాన్యం ఇస్తున్నాం. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు, రాష్ట్రంలోని ఏ జైల్లో శిక్ష పొందిన ఖైదీలకైనా ఈ బంకులో ఉద్యోగం ఇస్తున్నాం. మాజీ ఖైదీలకు ఉపాధి కల్పించి మళ్ళీ వాళ్ళు ఎలాంటి నేరాలు చేయకుండా గౌరవంగా సమాజంలో బతకడానికే మేము ఇలాంటి ప్రయత్నం చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి మా డీజీ వీకే సింగ్, ఐజీ ఆకుల నర్సింహం గార్లు ఎంతో కృషి చేస్తున్నారు' అంటున్నారు చంచల్‌గూడ మహిళా జైలు సూపరింటిండెట్ బషీరాబేగం. ప్రస్తుతం ఈ బంకు నిర్వహణ బాధ్యతలు ఈమే చూసుకుంటున్నారు

జీవితమే మారిపోయింది

రమ అత్తను చంపిన కేసులో జైలుకు వచ్చింది. ఆమె జైలుకెళ్ళిన వెంటనే భర్త మళ్ళీ పెండ్లి చేసుకున్నాడు. జైలు జీవితం ఈమెను పూర్తిగా మార్చివేసింది. అక్షరం ముక్కరాని రమ జైల్లోనే అక్షరాలు నేర్చుకుంది. ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు కూడా రాస్తోంది. జైల్లో ఉన్నప్పుడు బేకరీ యూనిట్‌లో పని చేసేది. విడుదలైన తర్వాత ఆమె పుట్టింట్లో ఉంటుంది. ఓ స్కూల్లో అటెండర్‌గా పనిలో చేరింది. అక్కడ జీతం చాలా తక్కువ. సత్తెమ్మ కోరిక ఒక్కటే, పిల్లల్ని బాగా చదివించాలి. జీతం సరిపోక ఇబ్బంది పడుతున్న సమయంలోనే పెట్రోల్ బంకులో ఉద్యోగం ఇచ్చారు. 'ఒకప్పుడు కూలిగా ఉన్న నేను ఇప్పుడు ఉద్యోగినయ్యాను. ఇదంతా బషీరా మేడం దయ వల్లనే' అని ఆనందంగా చెబుతుంది రమ.



ధైర్యంగా బతుకుతున్నాను

షహనాజ్‌కు ముగ్గురు పిల్లలు. భర్త ఒక్క పని చేసేవాడు కాదు. అన్నీ పుట్టింటి వాళ్ళే చూసుకునేవారు. వదిన చనిపోయిన కేసులో ఈమె ఐదున్నరేండ్లు జైల్లో ఉంది. ఈమె జైలుకు వెళ్ళిన తర్వత భర్త మళ్ళీ పెండ్లి చేసుకున్నాడు. 'జైలుకు వచ్చిన తర్వాత నాకు బతికే ధైర్యం వచ్చింది. నా భర్త నన్నూ, పిల్లల్ని పట్టించుకోకపోతే పుట్టింటిపై ఆదరపడి బతికేదాన్ని. కాని ఇప్పుడు ధైర్యంగా బతుకుతున్నా. జైల్లో ఉన్నప్పుడు కుట్టు మిషన్ నేర్పించారు. జైలు నుంచి విడుదలైనప్పుడు ఓ మిషన్ కూడా ఇప్పించారు. కానీ టైలరింగ్‌తో వచ్చే డబ్బులు నాకూ, పిల్లలకు సరిపోయేవి కావు. ఇప్పుడు నాకు పెట్రోల్ బంక్‌లో ఉద్యోగం వచ్చింది. నెలకు పన్నెండు వేలు సంపాదిస్తున్నానని తెలిసి ఇప్పుడు ఆయన మళ్ళీ నాదగ్గరకు వస్తున్నాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత ఎలా బతకాలో తెలియక దిగులుపడ్డాను. జైల్లో బషీరా మేడమ్ ఇచ్చిన ధైర్యం, సహకారంతో ఇప్పుడు ఉద్యోగస్తురాలినయ్యాను.

కొత్తవాళ్ళకు అవకాశం

మహా పరివర్తన్‌లో భాగంగా ఖైదీల్లో మార్పు తేవడానికి, విడుదలైన ఖైదీలు జీవనోపాధి లేక మళ్ళీ నేరాలకు పాల్పడకూడదని తెలంగాణ జైళ్ల శాఖ ఈ పెట్రోల్ బంకును ప్రారంభించింది. ఇక్కడ పది రోజుల శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిన వారికి నెలకు 12 వేల జీతం ఇస్తున్నారు. మొత్తం 25 మంది మహిళలు ఈ బంకులో పని చేస్తున్నారు. అందరూ షిఫ్టుల వారీగా పనిచేస్తారు. సేల్స్ పెరిగిన కొద్దీ కొత్తవాళ్లకు అవకాశం కల్పిస్తామని కూడా అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా జైలు నుంచి విడుదలైన మహిళా ఖైదీలు గౌరవంగా బతికే అవకాశం కల్పించిన జైళ్ళ శాఖకు అభినందనలు చెప్పాల్సిందే.

సలీమ



'ప్రమదావనం'తో గిన్నిస్ రికార్డు

తొలి మహిళా కాలమిస్టుగా గుర్తింపు పొందిన ఆమె పాఠకుల సమస్యలకు సమాధానాలు సూచిస్తూ.. ఆత్మీయురాలిగా మారారు. అనువాదకురాలిగా ఎన్నో పుస్తకాలు తెలుగు పాఠకులకు అందించారు. దశాబ్దంన్నర పాటు ఓ తెలుగు పత్రికలో వివిధ శీర్షికలు నిర్వహించి గిన్నిస్ రికార్డు సాధించారు. ఆమే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న ప్రముఖ రచయిత మాలతీ చందూర్.

కష్ణాజిల్లా, నూజివీడులో మాలతి జన్మించారు. ఆమె తల్లిదండ్రులు జ్ఞానాంబ, వెంకటేశ్వర్లు. ఆరుగురు అబ్బాయిల తర్వాత పుట్టిన ఆడపిల్ల. ఎనిమిదో తరగతి వరకు నూజివీడులోని ఎస్‌ఎస్‌ఆర్ పాఠశాలలోనే చదివారు. ఆ తర్వాత ఏలూరులో మామయ్య(చందూర్) ఇంట్లో ఉంటూ వల్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అక్కడ డి.కామేశ్వరి, ఆనందారామం, అరవిందాచారి, సక్కుబాయి తదితరులతో పరిచయమైంది. వారి ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకటచలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. వారి సంభాషణలు, సాహిత్యంపై జరిగే చర్చలు ఆమెలో సాహిత్యాభిలాషను పెంచాయి.

చందూర్‌తో పెండ్లి అయిన తర్వాత వారి మకాం చెన్నైకి మారింది. అక్కడే ఆమె ప్రైవేటుగా ఎస్‌ఎస్‌ఎల్‌సి పూర్తి చేశారు. రేడియోలో రచనలను చదివి వినిపించేవారు. ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామ కృష్ణ, పి.వి.రాజమన్నార్, మునిమాణిక్యం నరసింహారావులను దగ్గరగా గమనించే అవకాశం ఆమెకు లభించింది. ప్రముఖుల ప్రభావం, సాహిత్యంతో పరిచయం ఆమెను రచయితగా మార్చాయి. 1949 నుంచి రచనలు చేసినా 1952 నుంచి రచనా వ్యాసంగంతో బిజీగా మారారు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 1952 నుండి ఆడవారి కోసం 'ప్రమదావనం' శీర్షికను చాలా సంవత్సరాలు నిర్వహించారు. ఈ శీర్షిక ఆమెను గిన్నిస్ రికార్డు వరకు తీసుకువెళ్ళింది. ఇందులో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చేస్తూ.. విదేశాలకు వెళ్లివచ్చిన వారి అనుభవాలు రాయించేవారు. మహిళలకు ఒక సలహాదారుగా ఉండి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేవారు. ఆమె రాసిన వంటల పుస్తకాలు కొత్తగా వంటనేర్చుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేవి.

Women of the day

మాలతీ చందూర్ రాసే "జవాబులు" పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఈ శీర్షిక పేజీలను బైండింగులు చేసి అపురూపంగా దాచుకొన్న పాఠకులలో మహిళల కన్నా మగవారే ఎక్కువగా ఉండేవారు. ఆమె తెలుగులో మహిళా ప్రధాన నవలలు దాదాపు 25 రచించారు. అంతేకాదు 300 కు పైగా ఆంగ్ల రచనలను తెలుగులోకి అనువదించారు. ఆమె అనువాదాలు నాటి 'జేన్ ఆస్టిన్' నుండి నేటి 'అరుంధతీ రాయ్' రచనల వరకూ ఉన్నాయి. ఇవన్నీ స్వాతి మాసపత్రికలో 'పాత కెరటాలు' శీర్షికన ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా ఇతివృత్తాలపై కాలమిస్టుగా అనేక పురస్కారాలను మాలతీ చందూర్ అందుకొన్నారు.

కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేసే సమయంలో తమిళ సినిమాలను అర్థం చేసుకోవటానికి తమిళ భాష నేర్చుకున్నారు. అంతేకాదు తమిళంలోని అనేక పుస్తకాలను తెలుగులోకి అనువదించారు.

రచయితగానే కాకుండా 'జగతి' మాసపత్రికకు ఎడిటర్‌గా ఆమె పనిచేశారు. ❄

'మానవి' మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచ నలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా:
మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్,
ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.



శుభ్రంగా ఉంచుకోండి !

వానా కాలంలో వ్యక్తిగతంగా ఉపయోగించే టవల్ ను శుభ్రంగా ఉంచుకోండి. లేదంటే ఆరోగ్య, చర్మ సమస్యలు వస్తాయి. స్నానం చేసిన తర్వాత టవల్‌తో చేతులను, కండ్లను, కాళ్లను, ముఖాన్ని శుభ్రంగా తుడుకుంటారు. ఇలా తుడిచిన టవల్ చాలా తడిగా ఉంటుంది. టవల్ తడిగా ఉన్నప్పుడు చేతులను కడుక్కొని పట్టుకోవాలి. లేదంటే చేతులకు ఉండే బ్యాక్టీరియా, దుమ్ము, ధూళీ కణాలు టవల్‌కు అంటుకుంటాయి.

కొంత మంది టవల్‌ను బాత్ రూమ్‌లోనే పెడుతుంటారు. అలా పెట్టడం వల్ల టవల్‌కు గాలి, ఎండ తగలక పోవడంతో పాటు దుర్వాసన వస్తుంది. బాత్‌రూమ్‌లో అందుబాటులో ఉండటంతో ఇతరులు మీ టవల్‌తో తుడుచుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి శుభ్రంగా ఉండాలంటే టవల్ ఆరిన తర్వాత షెల్ఫ్‌లో పెట్టుకుంటే సరిపోతుంది.

చాలా మంది భోజనం చేసిన తర్వాత చేతులు తుడుచుకోవటానికి నాప్ కిన్‌కు బాదులుగా టవల్స్‌ను ఉపయోగిస్తారు. దీని వల్ల చాలా సమస్యలు వస్తాయి. కాబట్టి చేతులు తుడుచుకోవటానికి ప్రత్యేకంగా ఒక క్లాత్ లేదా నాప్ కిన్ ఉపయోగించడం మంచిది. చివరగా ఇంట్లో ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా ఒక టవల్‌ను ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోండి. అదే విధంగా ఒకరి టవల్ మరొకరు ఉపయోగించడం వల్ల ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే టవల్‌ను ఎప్పుడూ గాలి, ఎండ తగిలే ప్రదేశంలో ఆరేయడం, ఆరిన వెంటనే షెల్ఫ్‌లో పెట్టాలి. వీటితో పాటు వారానికి రెండు సార్లు టవల్‌ను శుభ్రంగా ఉతికి, ఒక్కసారి ఇస్త్రీ చేసుకుంటే సరిపోతుంది. ❄

చర్మ సౌందర్యానికి...

చాలా మంది చర్మం కాంతివంతంగా, అందంగా ఉండాలని... కురులు దృఢంగా, మృదువు కనిపించాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కొంత మంది వేలు ఖర్చు పెట్టి బ్యూటీపార్లర్‌లకు వెళ్తారు. కానీ ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇలా రసాయనాలు అధికంగా ఉన్న పదార్థాలను ఉపయోగించడం వల్ల జుట్టు, చర్మ సమస్యలు వస్తాయని చెబుతున్నారు నిపుణులు. అందంగా, సహజ సిద్ధంగా కనిపించాలంటే కొన్ని చిట్కాలను పాటించాల్సిందే !

- ఒక కప్పు పెరుగులో సగం చెంచా చక్కెర కలిపి మెత్తగా పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమంలో నారింజ పొడిని కలుపుకొని ముఖానికి పట్టించి పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగితే సరిపోతుంది.
- బొప్పాయి పండు గుజ్జులో ఒక చెంచా ఓట్స్, ఒక చెంచా తేనె, రెండు చెంచాల పచ్చి పాలను కలుపుకొని స్క్రబ్‌లా చేయాలి. దీంతో ఐదు నిమిషాల పాటు ముఖాన్ని మర్దన చేయాలి. ఐదు నిమిషాల తర్వాత కడిగితే సరిపోతుంది. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చక్కటి ఫలితం కనిపిస్తుంది.
- జుట్టు ఎక్కువగా చిక్కులు పట్టి ఇబ్బంది పెడుతుంటే ఇలా చేయండి ! నిమ్మకాయ ముక్కలను నీటిలో వేసి బాగా మరిగించి ఆ నీటితో తల స్నానం చేస్తే చాలు... చిక్కులు, చుండ్రు సమస్య తొలగిపోతాయి.
- రెండు కప్పుల గులాబీ నీటిలో రెండు చెంచాల బ్లాక్ టీ పౌడర్, ఒక షాంపూ వేసి బాగా కలిపి కురులకు పట్టించి 15 నిమిషాల తర్వాత స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా వారానికి రెండు సార్లు చేసిన జుట్టు ఊడటం తగ్గుతుంది. ❄



మిరియాల చాయ్...

జలుబు త్వరగా తగ్గాలంటే మిరియాల చాయ్ తాగితే సరిపోతుందని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు. మిరియాల చాయ్‌ను రోజుకు రెండు సార్లు తాగితే జలుబు నుంచి తొందరగా ఉపశమనం పొందుతారు. మిరియాలు మంచి ఔషధ గుణాలు ఉన్న యాంటీ బయాటిక్. ఇన్ని ఉపయోగాలు కలిగి ఉన్న మిరియాల చాయ్ తయారీ విధానం గురించి తెలుసుకుందాం !

కావలసిన పదార్థాలు : నీళ్ల-రెండు కప్పులు, మిరియాలు-ఒక చెంచా, పసుపు-ఒక చెంచా, ధనియాలు- ఒక చెంచా, లవంగాలు-రెండు, అల్లం ముక్కలు, చక్కెర-ఒక చెంచా, టీ పౌడర్-ఒక చెంచా.



తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నీళ్ల పోసుకోవాలి. నీళ్ల కాస్త వేడి కాగానే మిరియాలు, పసుపు, లవంగాలు, ధనియాలు, అల్లం ముక్కలు, చక్కెర, టీ పౌడర్ వేసి పది నిమిషాలు బాగా మరిగిస్తే సరిపోతుంది. ఈ చాయ్‌ను వేడి వేడి గా ఉన్నప్పుడే తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది. ❄



మరకలు మాటు మయం...

తెలుపు రంగు దుస్తుల మీద ఏవైనా రంగు మరకలు పడితే అస్సలు వదలవు. సబ్బు నిండుగా పెట్టి మరకలు పోవడానికి ఎన్నిసార్లు బ్రష్ చేసినా సరే ఎలాంటి మార్పు కనిపించదు. రంగు మరకలు పోవాలంటే వేడి పాలతో రుద్దితే చాలు మరక వదులుతుంది.

అయితే ఒక్కసారికే మరకలు వదలకుంటే రెండు లేదా మూడు సార్లు ప్రయత్నిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ముఖ్యంగా పాలల్లో ఉండే ఖనిజ లవణాలు రంగు పదార్థాలను పీల్చుకుంటాయి. రంగులు ఎక్కువగా ఫెనోలిక్ గ్రూప్‌లో ఉంటాయి. అయితే ఈ రంగులను పాలల్లో ఉండే కొవ్వు పదార్థం త్వరగా పీల్చుకుంటుంది. ఇలా పీల్చుకున్న తర్వాత బట్టలు ఉతికితే చాలు మరకలు సులభంగా తొలగిపోతాయి. మరకలు వదిలించుకోవడానికి ఇది చాలా సులభమైన పని. ఇలా వేడి పాలలో నానబెట్టి ఉతకడం వల్ల ఎలాంటి మరకలైనా సరే ఇట్టే వదులుతాయి. ❄

ఇట్లచేద్దాం

క్యారెట్లు మెత్తగా ఉడకాలంటే కొద్దిసేపు గోరువెచ్చని నీటిలో నానబెట్టి వండుకుంటే సరిపోతుంది

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకుంటే ఊరుకోం

- బస్సుయాత్రలో ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాఖ : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకుంటే ఊరుకోబోమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చైతన్య యాత్ర పేరుతో చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల బస్సు యాత్ర విశాఖ జిల్లా పెందుర్తి, ఆనందపురం, తగరపువలస మీదుగా ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. తగరపువలసలోని చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదల కష్టార్జితాన్ని అగ్రిగోల్డ్ మింగేసిందన్నారు. ఇటీవల కాలంలో 142 మంది బాధితులు కంపెనీ వైఖరి వల్ల ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి టీడీపీ ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు.

దద్దరిల్లిన ఉత్తర బెంగాల్

- 24 గంటల్లో మూడు బాంబు పేలుళ్లు

కోల్‌కతా : ఉత్తర బెంగాల్ వరస బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. 24 గంటల వ్యవధిలోనే మూడు బాంబు పేలుళ్లు సంభవించాయి. ముందుగా డార్జిలింగ్‌లో బాంబు పేలుడు జరగ్గా, తరువాత రెండు పేలుళ్లు కలిమ్‌పాంగ్ పోలీస్ స్టేషన్ ముందు జరిగాయి. కేవలం గంటలోపే ఈ రెండు పేలుళ్లు జరిగాయి. తొలి పేలుడు శనివారం రాత్రి 10.30 గంటలకు, రెండో సంఘటన 11.30 గంటలకు సంభవించింది. ఈ పేలుళ్లలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రంగా గాయలయ్యాయి. మృతి చెందిన వ్యక్తిని రాకేష్ రౌత్ అనే పౌర స్వచ్ఛంద సంస్థ కార్యకర్తగా గుర్తించారు.

ఇద్దరు పోలీసు అధికారులు కూడా ఈ పేలుడు లో గాయపడ్డారు. బాంబుల పేలుడు తీవ్రత ఎక్కువగా ఉందని, ఈ ప్రాంతంలో అలజడిని సృష్టించడానికే ఈ పేలుళ్లు జరిపివుంటారని పోలీసు అధికారులు తెలిపారు. డార్జిలింగ్‌లో జరిగిన బాంబు పేలుడు ఉదయం 12.50 గంటల ప్రాంతంలో చౌక్‌బజార్‌లో జరిగింది. 'ఇది చాలా తీవ్రమైన పేలుడు. పేలుడు పదార్థాలు 30 నుంచి 40 మీటర్ల దూరంలో లభించాయి' అని పోలీసులు తెలిపారు. ఈ పేలుడుపై సదర్ పోలీస్ స్టేషన్‌లో గూర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం) అధినేత బిమాల్ గురుంగ్‌తో సహా అనేక మంది నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గుర్ఖాలాండ్‌కు అనుకూలంగా లేని వ్యక్తులే ఈ బాంబు దాడులు జరిపారని జిజెఎం నేతలు ఆరోపిస్తున్నారు.

జీఎస్టీతో ప్రజలపై భారం

సీఐటీయు రాష్ట్ర కన్వెన్షన్‌లో కే.నాగేశ్వర్

- పలు అంశాలపై వక్తల ప్రసంగం
- సమ్మెకు కార్యచరణ రూపొందిస్తున్నామని వెల్లడి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

నవతెలంగాణ - ఏఎస్‌రావునగర్

జీఎస్టీతో సామాన్య ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తువులు భారంగా మారాయని, బడా వ్యక్తులు వినియోగించే విలాసవంతమైన వస్తువులు కారుచౌకగా మారాయని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి పారిశ్రామికవాడలో గల అసోసియేషన్‌హాల్‌లో ఆదివారం ప్రారంభమైన సీఐటీయూ రాష్ట్ర స్థాయి కన్వెన్షన్ సందర్భంగా 'జీఎస్టీ-ఒక పరిశీలన' అనే అంశంపై నాగేశ్వర్ ప్రసంగించారు. జీఎస్టీతో దేశ ప్రజలకు ఒరిగిందేమి లేదని, పెనుభారంగా మారిందని తెలిపారు. కార్మిక రంగంపై జీఎస్టీ ప్రభావాన్ని విశదీకరించారు. జీఎస్టీ ప్రభావం కార్మిక రంగంపైనా పడనుందని, వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. 'సరళీకరణ విధానాలు-కార్మిక వర్గంపై ప్రభావం' అంశంపై సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడిని పెంచాయన్నారు. కార్మిక చట్టాలు మార్చాలని యజమాన్య అనుకూల నిర్ణయాలు తీసుకోవడానికి చట్టాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడి దారులకు అనుకూలంగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. సామాజికంగా రిజర్వేషన్ ఉన్న ప్రయివేటు వ్యక్తులకు సంస్థలు అప్పగించడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని, ఇప్పటికే రైల్వే డిఫెన్సీ, బ్యాంకులు ప్రయివేటు పరం చేస్తున్నారని అన్నారు. బడా సంస్థల మొండి బకాయిలను రద్దు చేసి సామాన్య ప్రజలపై భారాలు మోపేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. 'కార్మికోద్యమం-సవాళ్లు' అనే అంశంపై సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రసంగిస్తూ...సమ్మెలు, పోరాటాలు జరుగకుండా కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని, కార్మిక వర్గం పోరాటాన్ని అణచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. గోరక్ష దళాల పేరుతో దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో 54 రంగాల్లో జీవోలను సవరించలేదని, కంపెనీలు జీతాలు పెంచలేదని చెప్పారు. ఈ-పాస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చి కంపెనీల యజమానులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, కార్మికుల గురించి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామని, కార్మిక వర్గంపై జరుగుతున్న దాడికి నిరసనగా తమ కార్యాచరణను రూపొందించుకుంటున్నామని తెలిపారు. నవంబర్ 10, 11, 12 తేదీలలో కార్మిక చట్టాలు సవరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కాంట్రాక్టు వ్యవస్థ రద్దు కోసం ఢిల్లీలో మహాధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. అంతకు ముందు సీఐటీయూ జెండాను సీనియర్ నాయకులు బీఎన్.సుదర్శన్ ఆవిష్కరించారు. సీఐటీయూ కార్యదర్శి నిర్మల, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు అశోక్, జీ.శ్రీనివాసులు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రావు, బీవీ.సత్యనారాయణ, బాబురావు, శ్రీనివాస్, వెంకన్నతో పాటు 300మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ సీట్ల కేటాయింపులో పొరపాట్లు సరిచేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ సీట్ల కేటాయింపు ప్రక్రియలో జరిగిన పొరపాట్లను సవరించి విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మూడోవిడత కేటాయింపులో జరిగిన అవకతవకలను సరిచేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు, కార్యదర్శి కోట రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సీట్లలో గందరగోళం జరగడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సీట్లు కేటాయించిన తర్వాత మళ్లీ వేరే కాలేజీకి అలాట్ చేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. మొదట కేటాయించిన కాలేజీల్లో కొందరు ఫీజు చెల్లించారని, ఒరిజినల్ ధ్రువపత్రాలు అందజేశారని తెలిపారు. ఇప్పుడు వేరే కాలేజీ కేటాయించడంతో విద్యార్థులకు ఏం చేయాలో తోచడం లేదని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై తరగతులు జరుగుతుంటే కొందరికి సీట్లు దక్కకపోవడం దుర్మార్గమని విమర్శించారు. తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించి డిగ్రీకి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని దోస్త్ అధికారులను డిమాండ్ చేశారు.

నేటితో ప్రచారానికి తెర

- నంద్యాలలో పోటాపోటీ
- రెండురోజులు పర్యటించిన బాబు
- చివరి రోజు వరకూ జగన్
- రెండు పార్టీల రాష్ట్ర నాయకత్వాలు ఇక్కడే!

నంద్యాల : నంద్యాల నియోజకవర్గంలో పోటాపోటీగా సాగిన ప్రచార పర్వానికి నేటితో తెరపడనుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సోమవారం సాయంత్రం నుండి మైకులు మూగబోనున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అదే సమయంలో ఎటువంటి సర్వేలను ప్రచురించ కూడదని మీడియాపై ఆంక్షలు విధించింది. ఈ ఉప ఎన్నికతో టిడిపి ప్రభుత్వానికి జరిగే నష్టం, వైసిపికి వచ్చే లాభం ఏమీ లేనప్పటికీ 2019 సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్‌గా రెండు పార్టీలు భావించడంతో ప్రచారం పతాకస్థాయిలో సాగింది. ఉప ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడిపి, వైసిపిల రాష్ట్ర నాయకత్వం నంద్యాలలోనే మకాం వేసింది. టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల కోడ్ రాకముందే రెండు సార్లు పర్యటించి నాలుగురోజులు మకాం వేసి టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డికి మద్దతుగా వ్యూహరచన చేశారు. ప్రచారం సందర్భంగా శని, ఆదివారాలల్లో రెండ్రో జులు పర్యటించారు. వీధివీధి నా తిరగడంతోపాటు పలు సమావేశాల్లో పాల్గొని మద్దతునివ్వాలని ఓటర్లను కోరారు. ఆదివారం నాడు పలు సంఘాల ప్రతినిధులతో సమావేశమైనారు. సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఏకంగా 13 రోజుల పాటు నంద్యాలలో బసచేశారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు.ఇంటింటికీ తిరిగి వైసిపి అధినేత జగన్మో హన్‌రెడ్డి ఓట్లు అడిగారు. 2014 ఎన్నికల్లో ధరావత్తు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కూడా తాజా ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపింది. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి కూడా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ప్రచార పర్వంలో టిడిపి, వైసిపిలు చూపిన దూకుడు పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. రెండుపార్టీలు పోటీపడి ఓటర్లను ప్రలోభ పెట్టాయి.

రూ.1.08 కోట్లు సీజ్

నంద్యాల ఉప ఎన్నికలలో భాగంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పంపిణీ చేస్తున్న నగదును పెద్ద ఎత్తున అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటిదాకా రూ.1.08కోట్లు వరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శనివారం ఒక్కరోజే రూ.58లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రూ.6లక్షలను పోలీసులు సీజ్ చేశారు. రైతు నగర్ చెక్‌పోస్టు, అయ్యలూరు మెట్ట ప్రాంతాల్లో వాహనాల తనిఖీలలో అక్రమ నగదును గుర్తించి పట్టుకున్నారు.

డబ్బు బడాబాబులకు.. జబ్బు ప్రజలకా?

ముత్తుకూరు : పరిశ్రమలు ఏర్పాటుచేసి బడా బాబులు డబ్బులు సంపాదించుకుంటూ.. కాలుష్యాన్ని మాత్రం రైతులకు, ప్రజలకు పంచుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాల్లో కాలుష్య బాధిత గ్రామాలను ఆయన ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులను, ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన ముత్తుకూరు మండలం, నేలటూరు దళితవాడకు వెళ్లారు. అక్కడ బహిరంగ సభలో ప్రసంగించారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కాలుష్యానికి గురవుతున్న సైనాపురం, నేలటూరు దళితవాడ, మామిడిపూడి, ముసునూరువారిపాలెం, పిడతాపోలూరు, మండపం, వరకవిపూడి గ్రామాల ప్రజలు ఈ సభకు హాజరయ్యారు. తమను పునరావాస ప్రాంతాలకు తరలించాలని ఆయనకు మొర పెట్టుకున్నారు. కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. మధు మాట్లాడుతూ.. థర్మల్ ప్రాజెక్టులు రాకముందు ఈ మండలాల పరిధిలో సుమారు 110 గ్రామాలు పచ్చని పొలాలతో, గొర్రెలు, బర్రెలతో కళకళలాడేవని తెలిపారు. ఆహ్లాదకరంగా ఉండేదన్నారు.

ఎన్‌సిసి, టిపిసిఐఎల్, ఎపిజెన్‌కో ప్రాజెక్టుల యాజ మాన్యాలకు కట్టబెట్టేందుకు.. నేలటూరు పంచాయతీ పరిధిలో 14 వందల ఎకరాల భూమి ఉంటే అందులో 1,250 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా సేకరించిందని విమర్శించారు. భూములిచ్చిన వారికి పరిహారం, ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చి నేడు నెరవేర్చలేదన్నారు. దాంతో వారు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

అక్రమాలకు కేంద్రాలుగా గోశాలలు

- లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

రాయ్‌పూర్: గోరక్షకులమని చెప్పుకుంటూ ప్రజలపై దాడులు చేస్తున్న కాషాయ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్న గోశాలల్లో ఆవుల ఆకలిచావులు నానాటికీ విస్తరిస్తున్నాయి. ఇప్పటి వరకూ రాజ్‌పూర్‌లోని గోశాలలో మాత్రమే ఆవుల చావులు వెలుగు చూసినప్పటికీ ఇప్పుడు బీజేపీ నేత ఆధ్వర్యంలోని మరో రెండు గోశాలల్లో ఆవుల మరణ మృదంగం మోగుతోంది. బీజేపీకి చెందిన జాముల్ నగర్ పంచాయిత్ ఉపాధ్యక్షుడు హరిష్ వర్మ ఆధ్వర్యంలోని గోశా లలో దాదాపు 200 ఆవులు నీరు, ఆహారం అందక మర ణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే గోశాలలో మరో 30 ఆవులు ఆకలితో ప్రాణాలు కోల్పోయాయి. దుర్గ్ జిల్లా రానో గ్రామంలోని మయూరి గోశాలలోనూ, గోడ్‌మర్రా గ్రామంలోని పూల్‌చంద్ గోశాలలోనూ శనివారం నాడు ఇటువంటి దృశ్యాలేకన్పించాయి. ఈ మూడు గోశాలలనూ నిర్వహిస్తున్న వర్మను తాము శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. రాజ్‌పూర్ గోశాలకు అందాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయనందువల్లే ఆవులు ఆకలిచావుల బారిన పడుతున్నాయని వర్మ చెబుతున్నాడు. జంతు పరిరక్షణా చట్టం, నమ్మక ద్రోహం అభియోగాలతో వర్మపై మూడు కేసులు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారులు చెప్పారు. ఈమూడు గోశాలలనూ హరిష్‌వర్మ నిర్వహిస్తున్నట్లు తమకు తెలిసిందని, అతడిని ఇప్పటికే అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని ఐజీపీ దీపాంశు కబ్రా చెప్పారు. పూల్‌చంద్, మయూరి గోశాలల నిర్వహణలో ప్రమేయం వున్న ఇతరులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

ఈ మూడు కేసుల్లోనూ కన్పిస్తున్న నిర్లక్ష్యము, నమ్మక ద్రోహం వంటి ఆరోపణలు సర్వసాధారణమే అయినప్పటికీ ఇక్కడ ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కూడా కన్పిస్తోంది. గోవుల పరిరక్షణకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఛత్తీస్‌గఢ్ గోసేవా ఆయోగ్ సంస్థ నుండి ఈమూడు గోశాలలకూ ఏటా లక్షలాది రూపాయల నిధులు అందుతున్నాయి. తాము అందచేస్తున్న ఈ నిధులు గోశాలల నిర్వహణ, పశు దాణా కొనుగోలు, నీరు, ఔషధాల సరఫరా వంటి వాటికి వినియోగించాల్సి వుంటుందని అధికారులు చెప్పారు. ఈ సంస్థ పోలీసులకు అందచేసిన అధికారిక లెక్కల ప్రకారం షగున్ గోశాల 2011లో ఏర్పాటు చేసిన ప్పటి నుండి ఇప్పటి వరకూ రు.93లక్షల నిధులను అందుకుంది. ఇక 2014, 2015ల్లో ఏర్పాటు చేసిన పూల్‌చంద్, మయూరి గోశాలలకు వరుసగా రు.50లక్షలు, రు.22.64లక్షల నిధులుఅందాయి. ఈ నిధుల వ్యయంపై పర్యవేక్షణ వుండదా అన్న ప్రశ్నకు ఆయోగ్ అధ్యక్షుడు విశ్వేశ్వర్ పటేల్ బదులిస్తూ తాము గత ఏడాది జులైలో ఈ మూడు గోశాలలను తనిఖీ చేశామని, ఆసందర్భంలోనే అనేక అక్రమాలు కనుగొన్నామని వివరిం చారు. సౌకర్యాల లేమి, పరిమితికి మించిన ఆవుల వంటి అక్రమాలపై తాము వివరణ కోరామని, ఇప్పటి వరకూ జవాబివ్వకపోవటంతో తాము నిధులను నిలిపివేసి, చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశామని ఆయన చెప్పారు. తమ నుండి నిధులు అందుకుంటున్న ఈ గోశాలలు తమ సొంతంగా కూడా నిధులను ఖర్చుచేయాల్సి వుంటుం దన్నారు. తాము ఇప్పుడు ఈ గోశాలలకు వైద్యుల బృందాలను, పశువుల మేతను, ఔషధాలను పంపుతున్నామని, అందుకు కొంత సమయం పడుతుందని ఆయన చెప్పారు. అక్కడి ఆవులను ఇతర ప్రదేశాలకు తరలించే అంశాన్ని కూడా తాము పరిశీలిస్తున్నామని, ఇందులో కొన్ని సమ స్యలున్నాయని అన్నారు. ఆవుల మరణాలపై నివేదిక కోరిన రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి కార్యాలయం, అక్రమాలున్న ట్లు తేల్చిన నివేదిక ఆధారంగా దుర్గ్, బెమెటరా జిల్లాల అధికారులను సస్పెండ్ చేసింది.

ఓన్లీ సెలక్షన్స్

- పాఠశాల క్రీడల పట్ల విద్యాశాఖ నిర్లక్ష్యం
- మండల, జిల్లాస్థాయిల్లో ఎంపికలకే పరిమితం
- జోనల్, రాష్ట్ర స్థాయిల్లోనే పోటీలు
- నిధులలేమి అసలు కారణం
- నిరాశలో గ్రామీణ క్రీడాకారులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

క్రీడాకారుల తయారీ కేంద్రాలుగా ఉండాల్సిన పాఠశాలలు ఆటలు లేక వెలవెలబోతున్నాయి. తూతూమంత్రంగా క్రీడాకారులను గుర్తించడం, వారిని పోటీలకు ఎంపిక చేయడం మినహా ఆటల పోటీలు నిర్వహించడం లేదు. అన్నిస్థాయిల్లో పోటీలు నిర్వహించాలని సర్కారు ఉత్తర్వులు ఉన్నా, విద్యాశాఖ నిర్లక్ష్యంతో అవేవీ అమలుకు నోచుకోవడం లేదు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాల క్రీడలూ అలసత్వానికి గురవుతున్నాయి. నిధుల కొరత, పర్యవేక్షణ లేమితో భావిక్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు.

రాష్ట్రంలో మొత్తం 40,821 పాఠశాలలున్నాయి. వీటిలో 60లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో 25,994 పాఠశాలలుంటే, వీటిలో కేవలం 2200మంది పీఈటీలు, పీడీలు మాత్రమే ఉన్నారు. పాఠశాలల్లోని క్రీడాకారులను గుర్తించడంతో పాటు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం నింపేందుకు పాఠశాల విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. ఎస్‌జీఎఫ్ ప్రతిఏటా జూలై, ఆగస్టు నెలల్లో స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల చేస్తోంది. రాష్ట్రంలో దాదాపు 62 ఆటలను గుర్తించారు. ప్రధానంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హాకీ, కుస్తీతో పాటు పలు రకాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తుంటారు. ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ షెడ్యూల్ ప్రకారం ఈనెలాఖరులోగా మండలస్థాయి, 10లోపు జిల్లా స్థాయిలో పోటీలు పూర్తికావాల్సి ఉంది. అక్టోబర్ 4లోపు జోనల్(ఉమ్మడి జిల్లాలు), రాష్ట్రస్థాయి పోటీలు పూర్తి చేయాలి.

పోటీలు లేకుండానే సెలక్షన్స్

మండలస్థాయి పోటీలంటే ఆ మండలంలోని అన్ని పాఠశాలల మధ్య క్రీడాపోటీలు నిర్వహించాలి. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. కొన్ని పాఠశాలల నుంచి కొంతమంది క్రీడాకారులను నేరుగా సెలక్షన్స్ చేస్తున్నారు. డివిజన్, జిల్లాస్థాయిల్లోనూ ఇలాగే నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆటలు లేకపోవడంతో చాలా చోట్ల ప్రయివేటు పాఠశాలలు తమ పరపతిని వినియోగించి, వారి పాఠశాలల నుంచే ఎక్కువ మంది విద్యార్థులు ఎంపికయ్యేలా చూస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద క్రీడాకారుల ప్రతిభ అడ్డుకట్ట పడినట్టవుతోంది. కొంతమంది పీఈటీలు, పీడీలు కొందరు సర్కారు విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తున్నారు. కానీ ప్రయివేటు యాజమాన్యాల ఒత్తిడిలో ఒక్కోసారి వారూ ఇబ్బందులు పడుతున్నారు.

పైసా ఇవ్వని సర్కార్..

మండల, డివిజన్, జిల్లా, జోనల్‌స్థాయి పోటీలకు ప్రభుత్వం గానీ, విద్యాశాఖ గానీ పైసా నిధులు ఇవ్వడం లేదు. కేవలం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్నారు. దీంతో ఆయా మండలాలు, జిల్లాల్లో పోటీల నిర్వహణకు కొంతమంది పీఈటీలు, పీడీలు సొంతడబ్బులతో, దాతల ద్వారా నిధులు సేకరించి పోటీలు అక్కడక్కడ నిర్వహిస్తున్నారు. అయితే జీవో నెంబర్94 ప్రకారం క్రీడలకోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.20 వసూలు చేసుకోవచ్చని చెబుతున్నారు. ఆర్‌టీఈ ప్రకారం కేవలం 9,10 తరగతుల విద్యార్థుల నుంచి మాత్రమే ఈ మొత్తం వసూలు చేయాలి. రూ.20ల్లోంచి కేవలం ఆరురూపాయలు జిల్లాకు పంపిస్తారు. మిగిలిన మొత్తం ఆయా పాఠశాలల్లోనే క్రీడల కోసం ఖర్చు చేయాలి. అయితే వచ్చే మొత్తం చాలా తక్కువ కావడంతో అది క్రీడల నిర్వహణకు ఏ మూలకు సరిపోవడం లేదు.

అడ్డంకిగా 3ఆర్ కార్యక్రమం..

ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3ఆర్(చదవడం, రాయడం, లెక్కలు) కార్యక్రమం నడుస్తోంది. అక్టోబర్ వరకూ ఈ కార్యక్రమం కొనసాగనున్నది. 60రోజులకూ విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో విద్యార్థులను క్రీడలపేరుతో వారం, పదిరోజుల పాటు పంపించేందుకు హెచ్‌ఎంలు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. పీఈటీలు,పీడీలు ఒత్తిడి చేస్తే పాఠశాల నుంచి ముగ్గురు, నాలుగురు విద్యార్థులను మాత్రమే పంపిస్తున్నట్టు వారు చెబుతున్నారు. ప్రభుత్వం క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించి, పోటీల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

పోటీలు నిర్వహించాలి: రాంరెడ్డి, ఎస్‌జీఎఫ్‌టీఎస్ కార్యదర్శి

మండల, జిల్లా, జోనల్‌స్థాయిల్లో క్రీడలు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశాం. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతోనే డీఈఓలకు ఆదేశాలు వెళ్లాయి. దీన్ని అందరూ అమలు చేయాల్సిందే. జీవోనెంబర్ 94 ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేసే నిధులతోనే మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించుకోవాలి. ప్రభుత్వం నుంచి కేవలం రాష్ట్ర, జాతీయ క్రీడాపోటీల నిర్వహణకు మాత్రమే నిధులు వస్తాయి.


సీఎంకు అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం: పోచారం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్‌కు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియా తో మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం సీఎం అహర్నిషలు కృషి చేస్తున్నా రని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రికి దక్కని గౌరవం కేవలం 36 నెలల పాలనలో సీఎం కేసీఆర్‌కు దక్కడం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. ముఖ్యమంత్రి మంత్రి వర్గంలో వ్యవసాయ మంత్రిగా పనిచేస్తున్నందుకు తాను గర్విస్తున్నానని పోచారం చెప్పారు. ప్రతి క్షణం రైతుల సంక్షేమం గురించే సీఎం తపిస్తారని, రైతాంగం మేలుకోసం పడ్డ తపనకు అవార్డుతో గుర్తింపు వచ్చిందన్నారు. సమైక్య రాష్ట్రంలో రైతుల కరెంటు కష్టాలు చూసిన సీఎం అధికారంలోకి వచ్చిన మూడేండ్లలోనే సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. రైతులకు ప్రభుత్వమే పెట్టుబడి సమకూర్చాలన్న ఆలోచన దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. సీఎం పర్యవేక్షణలో రైతులకు ఇప్పుడు కష్టాలులేవన్నారు. కాంగ్రెస్ నేతలు ఎంత అడ్డుపడ్డా ప్రాజెక్టులు ఆగవన్నారు. రైతుల రుణమాఫీ కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అంటూ కొనియాడారు. ప్రాజెక్టులు శరవేగంతో పూర్తవుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.

కాంగ్రెస్‌ది నీచబుద్ధి:కర్నె



ప్రాజెక్టుల నిర్మాణంపై కాంగ్రెస్ నీచబుద్ధిని ప్రదర్శిస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కోటి ఎకరాలకు సాగు నీరందించేందుకే ప్రాజెక్టుల రీడిజైనింగ్ జరుగుతోందన్నారు. 2018 నాటికి ప్రాజెక్టుల్లో 80 శాతం పూర్తి చేయాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే తమకు పుట్టగతులుండవనే నీచపు బుద్ధితో కాంగ్రెస్ పార్టీ కోర్టులను ఆశ్రయిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 22 నంచి నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకోవడానికి మర్రి శశిధరరెడ్డి, కేంద్ర పర్యావరణ కార్యదర్శికి ఫిర్యాదు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు తాము బెదరమని, ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

కేసీఆర్‌కు అవార్డు ఇవ్వడం మిలీనియం జోక్ : దాసోజు, బిక్షమయ్య గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వ్యవసాయ నాయకత్వ అవార్డు ఇవ్వడమంటే ఒక మిలినియం జోక్ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో నల్లగొండ డీసీసీ అధ్యక్షులు భిక్షమయ్యగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉండి, రైతులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. దేశంలోనే తెలంగాణ వ్యవసాయం పూర్తిగా వెనుకబడి ఉందని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న రైతు వ్యతిరేక విధానాలు కారణమైతే ఆయనకు వ్యవసాయ నాయకత్వ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు వ్యవసాయ నాయకత్వ అవార్డు ఇస్తున్నట్టు భారతీయ ఆహార వ్యవసాయ మండలి ప్రకటించడం ఒక పెద్ద కుట్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మండలి ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థగా భ్రమింపజేసి, ప్రజలను తప్పుదోవ పట్టించిందని చెప్పారు. ఈ ప్రయివేట్ సంస్థకు ఎంజె ఖాన్ అనే వ్యక్తి చైర్మెన్, ఆయన ఒక విత్తన కంపెనీల బ్రోకర్ అన్నారు. తెలంగాణను సీడ్‌బౌల్ చేస్తామనే కుట్రలో ప్రయివేట్ విత్తన కంపెనీలను దోచి పెట్టేందుకు ముఖ్యమంత్రికి వ్యవసాయ నాయకత్వ అవార్డు ప్రకటించిందని ఆరోపించారు. ఇది పనికిరాని అవార్డు అని, ఇచ్చే వారికి ఇంగితం జ్ఞానం లేకున్నా...తీసుకునే వారికి బుద్ధి ఉండాలన్నారు. 'దున్నపోతు ఈనిందంటే దొడ్లో కట్టేయ్యమన్న చందంగా రాష్ట్ర గవర్నర్ ఒక రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఈ అవార్డు ఏమిటో, ఏందో కూడా తెలుసుకోకుండా కేసీఆర్‌ను అభినందించడం ఏమిటని ప్రశ్నించారు. గవర్నర్‌కు ఎప్పుడు కేసీఆర్‌ను పొగుడుదామా అంటూ కాచుకుని కూర్చుంటాడని విమర్శంచారు. గవర్నర్‌కు నైతికత ఉంటే ఒక ప్రైవేట్ కంపెనీ ఇచ్చిన అవార్డుకు తెలుసుకోకుండా అభినందనలు తెలిపానని వాటిని విరమించుకుంటున్నట్టు మీడియాకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పశువుల కోసం మనుషులను చంపడం అమానుషం



నవతెలంగాణ - రాంనగర్

పశువుల పేర మనుషులను చంపటం అమానుషమని సీపీఐ మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జనతా ఫ్రంట్ ఆధ్వర్యంలో 'దళితులు, బహుజనులు, మైనార్టీలపై దాడులు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుండా మల్లేష్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి సుధమల్ల వెంకట్‌స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరక్షణ పేరుతో దళితులపైనా, మైనార్టీలపైనా దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ రకమైన దాడులు గతంలో గ్రామాల్లో ఉండేవని, కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాలకు కూడా విస్తరించాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ శక్తులు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా దళితులపై దాడులు పెరిగాయన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే దళితుడే తొలి సీఎం అని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. ఈ దాడులను అరికట్టేందుకు వామపక్ష పార్టీలు, అభ్యుదయ వాదులంతా ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకట్‌రాజు, దళిత సంఘం నాయకులు చిన్మయ్ ఆనంద్, ఆర్‌జేడీ తెలంగాణ శాఖ అధ్యక్షులు శోభాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలకు కారణమైన సీఎంకు వ్యవసాయ పురస్కారమా ?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోనే రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో నిలిపిన తెలంగాణ సీఎం కేసీఆర్‌కు భారత వ్యవసాయ మండలి నాయకత్వ పరస్కారం ఇవ్వడం పట్ల తెలంగాణ తెలుగుదేశం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రైతుల సంక్షేమానికి కేసీఆర్ చేసిన కృషి ఏంటో భారత వ్యవసాయ మండలి చెప్పాలని డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం ఆ పార్టీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్‌కు అవార్డు ప్రకటించడాన్ని చూసి తెలంగాణ రైతాంగం నవ్వుకుంటున్నదని ఎద్దేవా చేశారు. రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ధోరణిని కేంద్ర సంస్థలే ఒక వైపు తప్పుబడుతూ, మరో వైపు అవార్డు ఇవ్వాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు సాయం కింద కేంద్రం రూ. 700 కోట్లు పంపితే ఇంతవరకు పంపిణీ చేయని విషయం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి తెలియదా ? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చిందన్నారు. రూ. 17 వేల కోట్ల రుణమాఫీ ఇప్పటివరకు జరగలేదన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేసీఆర్‌కు అవార్డు ఇవ్వడం పట్ల నిరసన తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గిందని సర్కారు గణాంకాలే చెబుతున్నాయని గుర్తు చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లోనూ వ్యవసాయరంగానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.

పంచాయితీరాజ్ సంస్థలు ప్రభుత్వానికి పట్టవా?

- నిధులు వెంటనే విడుదల చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయితీలతోపాటు మండల, జిల్లా పరిషత్‌లు నిధుల్లేక విధులూ నిర్వర్తించలేని దుస్థితి నెలకొందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయితీరాజ్ సంస్థలు పట్టవా?అని ప్రశ్నించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థలకు నేరుగా 40 శాతం నిధులు కేటాయిస్తామని, వాటిని బడ్జెట్‌లో పొందుపరుస్తామని పేర్కొన్న ప్రభుత్వం ఆ మాటే మర్చిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయితీరాజ్ సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్లుగా ఇవ్వకపోవడంతో రూ.15 వేల కోట్లు బకాయి పడిందని తెలిపారు. స్టాంపుడ్యూటీ బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కేంద్రం పూర్తిగా నిధులివ్వడం ఆపేసిందని తెలిపారు. పంచాయితీరాజ్ సంస్థలకు సొంత ఆదాయం లేక ప్రభుత్వ సహకారం అందకపోవడంతో ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు పనులు చేయలేక ప్రజలకు ముఖం చాటేయాల్సిన పరిస్థితి వస్తోందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సంపూర్ణంగా నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యల్లేకపోవడంతో బలహీనమవుతోందని పేర్కొన్నారు. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టైన పంచాయితీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. అవసరమైన నిధులు విడుదల చేసి స్వపరిపాలన సాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంపూర్ణ సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి అందించాలని కోరారు.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

- 9-

(గురువారం తరువాయి భాగం)

భూస్వామి ఏంజేస్తడు కార్మికున్ని పిలిచి కొరడా దగ్గర పెట్టుకొని అరే నా పొలంలో మూడు రోజులు పనిచేయాల..నీ పొలంలో మూడు రోజులు పనిచేసుకో..దోపిడీని మనకింకా ప్రత్యేకంగా దాన్ని మరుగుపర్చే దేమీ లేదు. ఉచితంగా వీడికి మూడు రోజులు చేయించుకున్నడు. తర్వాత వానికి చేసుకోమన్నడు. కాబట్టి దోపిడీ చేస్తున్నడని ప్రత్యేకంగా సిద్ధాంతాలు, రాద్ధాంతాలు మార్క్స్ గ్రంధాలు రాయాల్సిన అవసరం లేదు. బానిస వ్యవస్థ చూసినపుడు మనకేం కనబడుతుంటదీ. అసలు వీడు మనిషినే దోచుకంటున్నాడురా అని అనిపిస్తుంటది. మనిషినే మొత్తంగా ఒక సరుకుగా, యంత్రంగా ఉపయోగించుకొని మొత్తంగా తీసుకెళుతున్నాడని మనకు తెలుస్తుంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని అర్థంకాకుండా చేసే పరిస్థితి ఉంటుంది. అక్కడ అదనపు శ్రమను దోచుకుంటున్నడు. అదనపు ఉత్పత్తిని దోచుకుంటున్నడు అని మనకు అర్థమవుతున్నది. ఇక్కడ అర్థం కాలేదు కాబట్టే దీన్ని అదనపు విలువ అంటాం. అంతకు ముందు వాడు ప్రత్యేకంగా దోపిడీ చేసుకోవల్సిన అవసరం లేదు. నీ దగ్గరా నీది నీవే ఉత్పత్తి చేసి నీకు సరిపోను మిగతా సరుకును ఆ రాజులు, మిగతావాళ్లు కొట్టుకుపోయేది. పన్నుల రూపంలో మిగతా రూపంలో లేకపోతే బలవంతంగా తీసుకుపోయేవాళ్లు. కానీ అదనపు ఉత్పత్తి నీదగ్గరే ఉండేది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారుడు నీ చేత అదనపు ఉత్పత్తి చేయిస్తాడు. నీకు అంతకు ముందు రాజొచ్చి నువు వంద బస్తాలు పండించు, రెండొందల బస్తాలు పండించు అని చెప్పేది. వీడు పండిస్తాడు. ఆ పండించిందాంట్లో కొంత తీసుకెళతాడు. ఉత్పత్తితో వాడికి సంబంధం ఉండేది కాదు దోపిడీ దారుడికి. ఇప్పుడు దోపిడీ దారుడే ఉత్పత్తి చేయిస్తాడు. అదనపు ఉత్పత్తి చేయిస్తాడు. అదనపు ఉత్పత్తిని వాడు తీసుకుంటాడు. కానీ అదనపు ఉత్పత్తిని తీసుకుంటున్నట్టు మనకు కనిపించకుండా ఏర్పాట్లు చేస్తాడు. అందుకని పెట్టుబడిదారీ వ్యవస్థ అనేది ఒక రకంగా.. మోసం అనే మాట వాడలేం. మిస్టిఫికేషన్ అనే మాట వాడిండు. నీ సరుక్కి నేను సమానంగా ఇస్తున్నా కదా.? నీ దగ్గరేముందీ..శ్రమ శక్తి ఉంది. ఆ శ్రమ శక్తికి సరిపడే డబ్బు నేనిస్తున్నగా బతకడానికిస్తున్న..నీ కుటుంబం బతకడానికిస్తున్న కాబట్టి నేను మోసమేం చేస్తున్నా..నీ శ్రమశక్తికి ఎంత పెట్టావో ఆ ధర నేనిస్తున్నాను. నీకు అది నచ్చింది కాబట్టి తీసుకుంటున్నావు. కాబట్టి మన దగ్గర మోసమేమీ లేదు. కానీ దోచుకుంటున్నడు. అదీ ప్రత్యేకత. ఎందుకంటే ఇప్పుడు లడ్డూ తింటే ఒక స్పెషాలిటీ ఉంది తీపి.. వేపాకు తింటే ఇంకో స్పెషాలిటీ ఉంది చేదు. అది కూడా చాలా మంది తింటుంటారు కదా.? రాందేవ్‌బాబా వేపాకును సరుకుగా చేసి అది కూడా ఒక ఆహ్లాదకరమైన సరుగ్గా..ఇంతకు ముందు వేపాకుని ఎంతో కష్టంగా మింగిచ్చేది. ఇప్పుడు రాందేవ్‌బాబా అంత శ్రమ లేకుండా చేశాడు. ఎక్కువ ధర పెట్టేశాడు. ఎక్కువ ధర ఉంది కాబట్టి దీంట్లో ఏదో ఉందని మనం తలా ఓ గుళికను మింగేస్తున్నాం. కాబట్టి దానిని కూడా ఓ సరుకు చేసేశాడు. కాబట్టి క్యాపిటలిస్టు ఈ రకంగా సమానమైన సరుకుల్ని ఏం మోసం చేయకుండా సమానమైనంత ఇచ్చి నీ దగ్గర దోచుకుంటున్నడు. కాబట్టీ ఎలా జరుగుతుందంటే మార్క్స్ ఓ చోట తమాషాగా చెబుతుంటాడు. పెట్టుబడిదారుని దృష్టిలో ఏం మోసం లేదు. ఎందుకనీ..నువు ఎంత ధర పెట్టావో నేను అంతకిచ్చాను. కార్మికుని దృష్టిలో చూసినపుడూ మోసం లేదు. ఎందుకంటే నాకవసరాల్ని బట్టి లెక్క గట్టి వాడిచ్చాడు. ఎక్కడా మోసం లేనపుడు వర్గపోరాటంలో తేలేదేంటంటే బలమెవరిదైతే వాడే రాజు. వాడే తేల్చుకుంటడు. ఫోర్స్ విల్ డిసైడ్ అండర్ ఈక్వల్ పార్టనర్స్..కాబట్టి ఇటువంటి పెట్టుబడిదారీ విధానంలో ఏదైనా న్యాయం తేలాలంటే శక్తిని బట్టి తేలాలి తప్ప ఈ కోర్టులు, చట్టాలు ఇది న్యాయం, అది న్యాయం అంటే తేలదు. ఎందుకంటే ఇద్దరిదీ న్యాయమిక్కడ. అసలైన అన్యాయం కనబడదు. కోర్టులో, చట్టాల్లో ఏంటా అన్యాయం. నువు ఫ్యాక్టరీ దగ్గరికెళ్లినపుడు..8 గంటల పని నువు చేసినపుడు వాస్తవంగా నీకిచ్చిన దానికి నువు ఆరు గంటలే పనిచేస్తే సరిపోద్ది కానీ నీ చేత 8 గంటలు పనిచేయించుకున్నారు. ఆ రెండు గంటలు వాడు తీసుకున్నాడు. మనకివ్వాలికదా అంటే నీకిచ్చేశాను కదా..సమానమైన వేతనం ఇంకేంటివ్వాలి అని



చెప్పేసి వాడంటాడు. దాంట్లో న్యాయం కనబడుద్ది. సమానమైంది ఎక్కడిచ్చావయ్యా. నేను ఆరు గంటలు పనిచేస్తేనే సరిపోద్ది. రెండు గంటలు అదనం గదా అంటే..నిన్ను 24 గంటలూ కొన్నానయ్యా నీకు వేతనం ఇచ్చానంటే అర్థమేంటీ..నీ శ్రమను 24 గంటలూ కొన్నాను. 24 గంటలు ఉపయోగించుకోకుండా 8 గంటలే ఉపయోగించుకుంటున్నాను. మరి నేనెక్కడ మోసం చేసినట్టు.. ఈ వాదనలన్నీ మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో ..పెట్టుబడిదారుడు ఏం వాదన చేస్తాడు, కార్మికుడేం వాదన చేస్తాడు. ఈ రెండు వాదనల్లోనూ న్యాయమున్నట్టే అనిపించుద్ది. ఇటు వంటి వాదనలు తేలాలంటే కుస్తీ బట్టడమే. అందుకని క్లాస్ స్ట్రగుల్ ద్వారానే తేలుద్దని చెబుతడు. అసలు సిసలైన పెట్టుబడిదారీ విధానం లక్షణమేంటంటే వాస్తవాన్ని మరుగుపర్చడమే. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందేకొద్దీ ఈ మరుగు పర్చే విధానం ఎక్కువవుద్ది. కాబట్టి ఒక ఫ్యూడల్ వ్యవస్థని, ఒక బానిస వ్యవస్థని, ఒక ట్రైబల్ వ్యవస్థని ప్రజలు అర్థం చేసుకోవడం చాలా సులభం. వాస్తవాలు తెల్సుకోవడం చాలా సులభం. పెట్టుబడిదారీ వ్యవస్థను, వాస్తవాలను శాస్త్రం ద్వారా మాత్రమే తెల్సుకోగల్గుతారు. విప్లవం చైనాలో ఎందుకొచ్చింది. వియత్నాంలో ఎందుకొచ్చింది. ఫ్రాన్స్‌లో ఎందుకొచ్చింది..అంటే అక్కడ ఫ్యూడల్ పద్ధతులు ఎక్కువున్నయి. మనం కూడా ఫ్యూడల్ పద్ధతులు చాలా ఎక్కువున్నపుడు చాలా తొందరగా వచ్చేదేమో..ఇప్పుడు పెట్టుబడిదారీ విధాన్వమైంది. ఇప్పుడు ఆ కష్టాలను చూసి తిరుగుబాటు చేసి విప్లవాలు, పోరాటాలు తొందర తొందరగా వచ్చే రోజులు ప్రపంచమంతా తగ్గిపోయినాయి. కార్మికవర్గం ఇతర ప్రజలు శాస్త్రాన్ని అర్థం చేసుకొని, చైతన్యం పొంది వ్యవస్థ యొక్క అంతర్యం అర్థం తీసుకొని ఈ వ్యవస్థ లాభం లేదని మార్చే ప్రయత్నం అవసరముంది. అందుకనీ వస్తుగత పరిస్థితులను బట్టే విప్లవాలు వచ్చేరోజులు తగ్గిపోయినయ్. మన చైతన్యాన్ని బట్టి విప్లవాన్ని దగ్గర చేసుకోవాల్సిన పరిస్థితి రావాలి. ఆ చైతన్యం మీద మనం కేంద్రీకరించకపోతే వచ్చే పరిస్థితి..పెట్టుబడిదారీ విధానమే. ఇది మనం పెట్టుబడి గ్రంథం చదివితే మనకు కూలంకుశంగా అర్థమవుద్ది. దీనికి పెట్టుబడి గ్రంథంలో ఫెటిసిజం అనే మాట వాడాడు.

(తరువాయి భాగం గురువారం సంచికలో)

డిటెన్షన్ విధానం రాజ్యాంగ సూత్రాలకు విఘాతం



కె.బి. ధర్మప్రకాశ్

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ 5,8 తరగతులలో డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టేందుకు తీసుకునే చర్యలలో భాగంగా విద్యాహక్కు చట్టంలోని కొన్ని సెక్షన్లను సవరించాలనే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టుటకు సమాయత్తమవుతున్నది. ఈ బిల్లులో రెండు అవకాశాలు ఇచ్చినప్పటికీ కృతార్థులు కాని విద్యార్థులు అదే తరగతిలో కొనసాగాలనే ఆలోచనలు చేస్తున్నది. ఈ విధానాలు అమలు పరచాలా, వద్దా అనేది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసేలా కార్యాచరణ చేస్తున్నది. ఇలాంటి చర్యల పట్ల బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యకు మరింత దూరమయ్యే పరిస్థితులు కనపడుతున్నాయి. అదే తరగతిలో మళ్లీ పిల్లల్ని కొనసాగిస్తే పిల్లలు డ్రాప్ అవుట్ కావచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలోచనలను తిరస్కరిస్తున్నది. ఇది సంతోషకరం. డిటెన్షన్ విధానంలో విద్యార్థులు ఆ తరగతిలో నిర్వహించబడిన పరీక్షల్లో ఉత్తీర్ణుడు కాకపోతే అదే తరగతిలో కొనసాగుతాడు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థి అదే తరగతిలో కొనసాగిస్తే నాణ్యమైన విద్య అందుతుందనుకోవడం శాస్త్రీయం కాదు. పాఠశాల విద్య స్థాయిలో పరీక్షలు మూల్యాంకనం ద్వారా చదువులో ఆశించిన సామర్థ్యాలు సాధించలేదని పిల్లలను అదే తరగతిలో కొనసాగిస్తే వారి విద్యా ప్రమాణాలు మెరుగైనట్టు చూపే మాడల్స్ ప్రపంచంలో ఎక్కడా లేవు. విద్యాపరంగా అభివృద్ధి చెందిన దేశాలన్నీ "నాన్ డిటెన్షన్" విధానాన్ని అమలు చేయడం వల్లే విద్యా ప్రమాణాలను పెంచుకోగలిగాయి. నాన్ డిటెన్షన్ విధానములో విద్యార్థులు ఒక తరగతిలో కాకపోతే మరో తరగతిలోనైనా నేర్చుకునే అవకాశం కలుగుతుంది. నేర్పగలమనే విశ్వాసం ఉపాధ్యాయుల్లో కూడా కలుగుతుంది. విద్యార్థులు నేర్చుకుంటారు, ఉపాధ్యాయులు నేర్పుతారు అనే నమ్మకం విద్యా విధానాలల్లో కనపడటం లేదు. వ్యవస్థీకృతంగా ఉన్న అవరోధాలను తొలగించకుండా నాణ్యతను ఆశించలేము. విద్యార్థుల సంఖ్యకు సరిపోను, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల నియామకం జరుగాలి. టీచర్ల బోధన హాజరు గూర్చిన పక్కా పర్యవేక్షణ ఫిన్లాండ్‌లా అన్ని రకాల పాఠశాలలు అంటే గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలలో ఉన్న ప్రతి పాఠశాలకు ఒకే రకమైన నిధులు, ఉపాధ్యాయులు, వసతులుండాలి. నిధులు, వసతుల సద్వినియోగం జరుగాలి. వ్యవస్థీకృత లోపాలపై దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్య అందకపోవడానికి విద్యార్థులను,ఉపాధ్యాయులను బాధ్యులను చేసేలా డిటెన్షన్ ప్రవేశపెట్టాలనే ఆలోచనలు సబబు కాదు. పై పెచ్చు ఇది ఎంతో కష్టపడి, ఎన్నో పోరాటాల తర్వాత తెచ్చుకున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కడమే. వాస్తవానికి పేద, దళిత, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు మధ్యలోనే బడిమానకుండా విద్యా హక్కు చట్టం రూపొందించ బడింది. ఈ చట్టంలో ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన బాలబాలికలు 8వ తరగి పూర్తి చేసే వరకు అదే తరగతిలో కొనసాగించడమో, బడి నుంచి తొలగించడమో చేయకూడదు. ఈ తరగతులలో ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించకూడదు. డిటెన్షన్ ఆలోచనలు చేస్తున్న మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారంగా ప్రస్తుతం దేశంలో బడి మానేస్తున్న పిల్లలు 36.3శాతం. అందులో దళితులు 50.1 శాతం గిరిజనలు 62.4 శాతంగా ఉన్నారని చెబుతున్నాయి. ఇక డిటెన్షన్ విధానం ప్రవేశపెడితే బడి మానేసే పిల్లల సంఖ్య మరింతగా పెరిగి వీరంతా విద్యవ్యాసంగానికి దూరమయ్యే ప్రమాదం ఉన్నది. ఏ విద్యార్థి ఫెయిల్ కావాలని అనుకోడు. దీనికి ఎన్నో సామాజిక, ఆర్థిక కారణాల నేపథ్యం ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థుల్లో ఆవేదన, నిస్సహాయత పెరుగుతుంది. విద్యలో వెనుకబాటు విద్యార్థులకు తన రోజువారీ సమస్యలను పరిష్కరించుకోగలిగే నేర్పు, ధైర్యం, వాళ్లు చదువుకోగలరనే నమ్మకం కలిగించే దిశగా వ్యవస్థ ఉండాలి. ఇలాంటి ప్రోత్సాహం ఉంటేనే చదువులో రాణిస్తారు. విషయం అవగాహనలో ఉన్న ఆనందం జీవన సమస్యలను స్వంతగా పరిష్కరంచుకోగల కౌశలాలు వారికి నేర్పాలి.

నిరంతరం సమగ్ర మూల్యాంకనం అనేది మంచి ఫలితాలిచ్చే విద్యా సంస్కరణ. దీన్ని స్వాగతించాలి. వైయక్తిక బేధాలతో పిల్లలుండే తరగతి గదుల్లో వారికి సరిపడు బోధనా పద్ధతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఇలాంటి పిల్లలకు సరిపోను శాస్త్రీయ బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో చదువగలరనే నమ్మకం కలిగించాలి. వ్యవస్థీకృతంగా ఉన్న లోపాలను సవరించాలి. దీనికి శాస్త్రీయ కార్యాచరణ జరగాలి. డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టడమంటే రాజ్యాంగ మూల సూత్రాలైన బహుళత్వం, సమన్యాయం సమానతలకు విఘాతం కలిగించడమే అందరూ చదవాలి. అందరూ ఎదగాలి అనే ఆశలకు గండిపడకూడదు.

నిరంతరం సమగ్ర మూల్యాంకనం అనేది మంచి ఫలితాలిచ్చే విద్యా సంస్కరణ. దీన్ని స్వాగతించాలి. వైయక్తిక బేధాలతో పిల్లలుండే తరగతి గదుల్లో వారికి సరిపడు బోధనా పద్ధతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. ఇలాంటి పిల్లలకు సరిపోను శాస్త్రీయ బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో చదువగలరనే నమ్మకం కలిగించాలి. వ్యవస్థీకృతంగా ఉన్న లోపాలను సవరించాలి. దీనికి శాస్త్రీయ కార్యాచరణ జరగాలి. డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టడమంటే రాజ్యాంగ మూల సూత్రాలైన బహుళత్వం, సమన్యాయం సమానతలకు విఘాతం కలిగించడమే అందరూ చదవాలి. అందరూ ఎదగాలి అనే ఆశలకు గండిపడకూడదు.

అక్షరాస్యత రేటు

	2001			2011		
	అన్ని వర్గాలు	ఎస్సీ	ఎస్టీ	అన్ని వర్గాలు	ఎస్సీ	ఎస్టీ
పురుషులు	75.3	67.0	59.0	80.9	75.2	68.5
స్త్రీలు	64.8	42.0	35.0	64.6	56.5	49.4
మొత్తము	64.8	54.7	47.1	73.0	66.1	59.0

జనాభా కోట్లల్లో

	2001	2011
పురుషులు	53.22	62.31
స్త్రీలు	49.65	58.75
మొత్తము	102.87	121.06

సెల్: 9989732423

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్(ప్రాథమిక స్థాయి

	2000-01	2014-15
బాలురు	90.3	94.8
బాలికలు	72.4	99.2
మొత్తం	81.6	96.9

డ్రాప్ అవుట్ రేటు

	2011-12	2013-14
బాలురు	5.89%	4.53%
బాలికలు	5.34%	4.14%
మొత్తం	5.62%	4.34%

వయస్సులు/ వర్గాల వారీగా చదువుకున్న వారి జాబితా 2013-14 (మానవ వనరుల మంత్రిత్వ శాఖ గణాంకాలు)

సకల జనుల సమ్మె ప్రతిష్టాత్మకం



కోదాటి శ్యాంసుందర్

గౌరవ ముఖ్యమంత్రి గారు ఉద్యోగుల పట్ల అసహనం వహించడంతో తెలంగాణలో పలు ఉద్యోగ సంఘాలు ఆలోచనలో పడ్డాయి. ఇటీవల పత్రికల్లో వచ్చిన పదవీ విరమణ వయస్సు సమస్య ప్రభుత్వం ఉద్యోగులకు ఎంత వెసులుబాటు కల్పించినా తక్కువే. పదవీ విరమణ వయస్సు 58 సంవత్సరాల నుండి 60 ఏండ్లకు పెంచమనేది ఉద్యోగుల చిన్న కోరిక మాత్రమే. ఇది ఎప్పటి నుండో వస్తున్న డిమాండ్. అప్పటి ఉమ్మడి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు దిగిపోయే ముందు ఫైల్‌పై సంతకం పెట్టకుండా వెళ్లిపోయారు. అప్పటి నుంచి అవి మా రాష్ట్రం వచ్చిన తరువాత సాధించుకుంటామని ఉద్యోగుల మనస్సులో ఉన్నది. కానీ ఇప్పటి ప్రభుత్వం దీనిని ససేమిరా అన్నట్టు పత్రికల్లో వస్తున్నది. పదవీ కాలం పొడిగించినందున నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంది అని ప్రభుత్వం అనుకుంటుండొచ్చు. కానీ పక్క రాష్ట్రంలో కొత్త రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుండి లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అక్కడి ప్రభుత్వం ఉద్యోగులకు 58 నుండి 60 సంవత్సరాల వయో పరిమితిని పెంచింది. కానీ తెలంగాణ ఉద్యోగులు ఏమి పాపం చేశారు. 2018 నుండి 2022 వరకు ఉద్యోగులు వేల సంఖ్యలో పదవీ విరమణ చేయనున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కింద పని చేసే బంట్రోతు కూడా సమ్మెలో చురుకుగా పాల్గొన్నారు. తమ పైఅధికారుల దగ్గర అప్పులు చేసి జీతం ఆశించకుండా రాష్ట్రం కోసం కష్టపడటం వర్ణనాతీతం. కానీ చిన్న చిన్న ప్రజాప్రతినిధుల నుండి అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు కూడా చోద్యం చూస్తూ ఉండిపోయారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం చెప్పే తీరు మాత్రం వేరే భావనను కలుగచేస్తున్నది. వయోపరిమితి పెంచినట్లయితే నిరుద్యోగ సమస్య ఎక్కువవుతుంది అనుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను బట్టి లక్ష ఉద్యోగాలిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు 40 వేల ఉద్యోగాలు కూడా భర్తీ కాకపోవడం గమనార్హం. అసలు 10వ పీఆర్‌సీ 2015 బకాయిలు కూడా ఒక్కసారి ఇవ్వని పరిస్థితి. నెలకింద ప్రకటించినా ఆయా ట్రెజరీలలో అవి పాసుకాని స్థితి. చిన్న చిన్న ఉద్యోగులకు పెండ్లీడుకొచ్చిన ఆడ పిల్లలున్నారు. సదరు ఉద్యోగులు రిటైర్‌మెంటు అయినట్లయితే పరిస్థితి ఏమిటి? వారు తమ తమ పిల్లల పెండ్లిండ్లు ఎలా చేస్తారు. ఈ విషయాన్ని ప్రభుత్వం నిశితంగా గమనించాలి. ముఖ్యంగా రాజకీయంగా చూసినట్లయితే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నవారు గానీ ప్రతిపక్షంలో ఉన్నవారు గానీ ఏ ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో పోరాడినవారు కాదు. ప్రభుత్వం రిటైర్‌మెంటు వయస్సును పొడిగించుట లేదు అనే మాట మీద ఉంటే సరే అనుకోవచ్చు. కానీ కొందరు పై అధికారులు అనగా ఎవరికైతే రాజకీయ అండదండలు ఉన్నవారున్నారో వారి వయో పరిమితి మాత్రం ఒక్కసారి కాదు, రెండు సార్లు కూడా పెంచారు. వారు సంకేతికంగా కూడా అంత ప్రావీణ్యం ఉన్నవారు కారు. పదవీ విరమణ వయస్సును పొడిగిస్తే నిరుద్యోగులు, విద్యార్థులు ఆగ్రహానికి గురవుతారని అనుకోవచ్చు. కానీ ఉన్న ఉద్యోగాలే ఇప్పటి వరకు నింపిన పరిస్థితి లేదు. కానీ రిటైర్ అయిన ఉద్యోగాలు ఎప్పుడు నింపాలి. ఇది గమనించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కుంటిసాకులతో విరమణ వయస్సు పెంచడం పక్కన పెట్టడం సరైనది కాదు. ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లు కూడా పెంచం, సాధ్యం కాదు అని కేంద్రం తేల్చేసింది. ఫిరాయింపుదారులకు టికెట్స్ ఇవ్వకపోతే వారు తిరగబడతారు. ఎన్నికల నగారా మోగిన తరువాత వారి తీరు, తెన్నులు బయటకు వస్తాయి. ఎప్పుడు పుట్టి ముంచుతారో తెలియదు. ఉద్యోగులు ఎప్పుడు ప్రభుత్వం వెన్ను, దన్నుగా ఉంటూ ప్రభుత్వ కార్యకలాపాలు అభివృద్ధి పథకాలు ప్రజల వద్దకు తీసుకుపోతారు. అందుకని ప్రభుత్వం ఉద్యోగుల కష్టాలను అర్థం చేసుకొని ముందుకు వెళ్లాలి. బంట్రోతు నుండి ఆఫీసరు వరకు ఉద్యోగుల మేలును మర్చిపోని విధంగా ఉద్యోగ వయోపరిమితిని 58 సంవత్సరముల నుంచి 60 ఏండ్లకు పెంచాలి. డాక్టర్స్‌కు 58 ఏండ్ల నుంచి 63 ఏండ్లకు పెంచాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 65 ఏండ్లకు, పక్క రాష్ట్రం 63 ఏండ్లకు పెంచడం విదితమే.

రాజకీయంగా చూసినట్లయితే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నవారు గానీ ప్రతిపక్షంలో ఉన్నవారు గానీ ఏ ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో పోరాడినవారు కాదు. ప్రభుత్వం రిటైర్‌మెంటు వయస్సును పొడిగించటం లేదు అనే మాట మీద ఉంటే సరే అనుకోవచ్చు. కానీ కొందరు పై అధికారులు అనగా ఎవరికైతే రాజకీయ అండదండలు ఉన్నాయో వారి వయో పరిమితి మాత్రం ఒక్కసారి కాదు, రెండు సార్లు కూడా పెంచారు. వారు సంకేతికంగా కూడా అంత ప్రావీణ్యం ఉన్నవారు కారు. పదవీ విరమణ వయస్సును పొడిగిస్తే నిరుద్యోగులు, విద్యార్థులు ఆగ్రహానికి గురవుతారని అనుకోవచ్చు. కానీ ఉన్న ఉద్యోగాలే ఇప్పటి వరకు నింపిన పరిస్థితి లేదు. కానీ రిటైర్ అయిన ఉద్యోగాలు ఎప్పుడు నింపాలి. ఇది గమనించాల్సిన అవసరం ఉంది.

సెల్: 9949505780




డా॥ సోమేశ్వర్ బోనకుర్తి

తెలంగాణ బతుకు చిత్రాన్ని, గ్రామీణ జానపద జీవన సాంస్కృతిక వైవిధ్యాన్ని సజీవ చిత్రాలుగా మలచి, పల్లెల్లోని ప్రకృతి అందాలను, గ్రామీణ ప్రాంత ప్రజల జీవనశైలిని, ఆ ప్రాంత సంస్కృతిని, తెలంగాణ కీర్తిని తన కుంచె విన్యాసాల ద్వారా ఖండాంతరాలకు వ్యాప్తి చేసిన చిత్ర కారుడు డాక్టర్ కాపు రాజయ్య. కళా ప్రపంచంలో ఒక శిఖరం, రంగుల లోకంలో జీవన వర్ణాన్ని తరగని సంపదగా అందించి తెలంగాణ చిత్రకళకు అంతర్జాతీయ స్థాయి కల్పించి అపురూప సన్నివేశాన్ని సృష్టించిన గొప్ప చిత్రకారుడు ఆయన. మట్టి వాసనలు తెలిసిన ఆయనకు జీవితములోని లోతు పాతులను రంగులుగా ఎలా మలచాలో తెలుసు. రాజయ్య మెదక్ జిల్లాలోని సిద్ధిపేటలో 1925 ఏప్రిల్ 7వ తేదీన రాఘవులు, భూలక్ష్మి దంపతులకు జన్మించిన కాపు రాజయ్య ఏడవ తరగతి వరకే చదివారు. తల్లి భూలక్ష్మి ఒక

శ్రమైక జీవన చిత్తరువు కాపు రాజయ్య

మార్వాడీ ఇంట్లో పనులు చేసేది. తల్లి అక్కడ పని చేస్తున్నంత సేవు ఆ గోడల మీద ఉన్న నకాషీ చిత్రాలను గీసుకుంటూ సాధన చేసేవారు. అలా చిత్రాకళ పట్ల ఆయనలో తొలి బీజం పడింది. 5వ తరగతిలో కుబేరుడు అనే డ్రాయింగ్ టీచర్ రాజయ్య జిజ్ఞాసను, ప్రతిభను గుర్తించి ఫైనార్ట్స్ వైపుకు నడిపించారు. కానీ కుంచెలు, రంగులు, కాగితాలు సైతం కొన లేని స్థితి ఆయనది. హైదరాబాద్‌లో చిత్రకారుల వద్ద కూలిపని చేస్తూ స్వయం కృషిలో డ్రాయింగ్ నేర్చుకున్న చరిత్ర ఆయనది. అందుకే కన్నీటిని, చెమటను కలగలిపిన రంగులతో బతుకు చిత్రాలు గీయడంలో ఆయన సిద్ధహస్తులయ్యారు. రాజయ్య కుంచెకు ఆయన చుట్టూ ఉండే కంసాలి, కుమ్మరి, నకాషి పని వారే స్ఫూర్తి. అనేక కులాల జీవన చిత్రణను ఆయన అపురూపంగా మలిచారు. సృజనలో అంతర్ దృష్టి, సాహసం, భావన, నిజాయితీ, నిబద్ధత అన్నీ నిండుకొని ఉండడం అవసరం అని గట్టిగా నమ్మిన సృజనశీలి రాజయ్య. పీర్ల పండుగ రోజుల్లో పీర్ల కొమ్ములకు రంగులు వేయడంతో ఆయన బాల్యం ప్రారంభమైంది. తెలంగాణ జానపద జీవనం, ఆ ప్రాంత చేతివృత్తులు, దేవాలయాలు, ఆచార సంప్రదాయాలు, పండుగలు, కష్టాలు, కడగండ్లు వంటివన్నీ ఆయన బొమ్మల్లో ప్రస్ఫుటించాయి. రాళ్ల రప్పల మధ్య ఒంటరిగా నిలబడ్డ చెట్టుతో, పల్లెనిండా ఉదయ, సాయంత్రాలు దుమ్ము పొగల్ని నింపుతూ పరుగులు తీసే మూగజీవాల్లో, కల్లుగీసే కేశయ్యతో పాలమ్మే పోశమ్మతో, బతుకమ్మ నెత్తి నెత్తుకున్న లచ్చమ్మతో, పొద్దు తిరుగుడు పువ్వు పట్టుకున్న చంటిదానితో, పతంగులు ఎగరేసే చిన్నోడిలో ఆత్మీయతను పెంచుకున్నవాడాయన. పల్లెలో పూచే విశ్వాసాల నమ్మకాలను రెండు చేతుల్తో పోగెసుకున్నాడాయన. గ్రామ వేర్లను వీడకుండా జీవంపోసి తనదైన బతుకమ్మ, బోనాలు, మొహర్రం, ఎల్లమ్మ జోగి, బుర్ర కథ, శౌరదగాళ్ళు, వంటి తెలంగాణ కళా, వారసత్వ సంపదలను మొదటగా ప్రపంచానికి పరిచయం చేశారు. కుమ్మరి, జాలరి, చాకలి, యాదవ, గౌడ్‌లను, సోది చెప్పేవారికి వృత్తుల్లోని సహజ సౌందర్యాన్ని తన రంగుల్లో ప్రాణం పోశాడు. అసంఖ్యాకమైన అవార్డులు ఆయన్ని అలంకరించినప్పటికీ తెలుగు వారి జెమినీ రాయ్‌గా, ప్రజా చిత్రకారునిగా ఆయనకి జనం తమ గుండెల్లో 'ఏనాడో పట్టం కట్టుకున్నారు. డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగం, సిద్దిపేటలో చిత్రకళా శిక్షణ కోసం నెలకొల్పిన కళా భవన్ నిర్వహణలే ఆయన జీవితంగా గడిపారు. వందలాది శిష్యులను చిత్రకళలో తీర్చిదిద్దారు. రాజయ్య చిత్ర కళా ప్రవీణుడే కాదు, కవి కూడా. ఆయన భౌతికంగా 2012 ఆగస్టు 20 సాయంత్రం మరణించినా, పల్లె ప్రజలు ఉన్నంతకాలం వారి గుండెల్లో బతికే ఉంటారు.

సెల్: 9293762428



కె.ఎస్. ప్రదీప్

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఆక్సిజన్ అందక చిన్నారులు మృతి చెందిన ఘటన అందరి హృదయాలను ద్రవింప చేసింది. పసి తనంలలోనే మెదడు వాపు వ్యాధి గ్రస్థులు కావడమే బాధాకరమనుకుంటే, ఆక్సిజన్ అందక ఏకంగా 72 మంది చిన్నారులు మరణించిన తీరు, గుండెలవిసేలా వారి తల్లిదండ్రుల ఆక్రందనలు చూస్తే మానవ త్వమున్న ప్రతి వారిని కంటతడి పెట్టించింది. మరి, ఈ గోరఖ్‌పూర్ ఘోరక లికి కారణం ఎవరు? పాలకులా? హాస్పిటల్ డాక్టర్లా? ఆక్సిజన్ నిలిపివేసిన సంస్థ వారిదా?

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ప్రాంతం ప్రస్తుతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన ఆదిత్యనాథ్ యోగి నియోజకవర్గం. 20 యేండ్లుగా తనే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆ ప్రాంతంలోనే బాబా రాఘవ్ దాస్ (బీఆర్‌డీ) కళాశాల & హాస్పిటల్. దీనిలో వందల మంది రోగులతోపాటు మెదడు వాపు వ్యాధి సోకిన చిన్నారులు వస్తుంటారు. వీరికి ఆక్సిజన్‌ను అందిస్తూ వైద్యం చేయాల్సి వుంటుంది. ఆ హాస్పిటల్‌కు ఆక్సిజన్ లేక పోవడంతో వేరే ప్రయివేట్ సంస్థ నుంచి కొనుగోలు చేస్తున్నారు. కానీ ఈ బకాయిలు 67 లక్షల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి వుంది. అనేక మార్లు అడిగినా చెల్లించక పోవడంతో మానవత్వం మరిచిపోయి ఆక్సిజన్ సరఫరాని నిలిపివేశారు. ఈ తరుణంలో ఆక్సిజన్ లేక పోవడంతో, శ్వాస ఆడక పదుల సంఖ్యలో ఊపిరివదిలేశారు.

ఈ ఘటనకు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాదా? ఎందుకంటే ఆ హాస్పిటల్‌లో ఆక్సిజన్ సౌకర్యం ఎందుకు లేదు? కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయింపులో ఎందుకు నిర్లక్ష్యం వహించారు? మానవత్వం మరచి ఆక్సిజన్‌ను బంద్ చేస్తే శ్వాస ఆడక పిల్లలు పిట్టల్లా రాలుతుంటే చూసి హృదయం ద్రవించిపోయి ఆ పిల్లల వార్డుకు చెందిన డాక్టర్ కపిల్ అహ్మద్ ఆక్సిజన్‌ను అందించాలని తాపత్రయ పడ్డాడు. బయట నుండి ఆక్సిజన్ సిలిండర్లను తెప్పించాడు. అవి కాస్త అయిపోవడంతో సొంత డబ్బుతో ఆక్సిజన్ సంస్థ నుండి సిలిండర్స్

పిల్లల మరణాలకు కారకులెవరు?

కొనుగోలు చేసి, తన వృత్తి ధర్మాన్ని, మానవత్వాన్ని చాటుకొన్నాడు. కానీ ప్రభుత్వం మాత్రం సాయపడిన డాక్టర్ కపిల్ అహ్మద్‌ను సస్పెండ్ చేసింది. తమ పిల్లల ప్రాణాలను కాపాడిన డాక్టర్‌ని అక్కడి వారు ఆరాధిస్తుంటే ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. డాక్టర్‌ని ఎందుకు తొలగించిందో ప్రభుత్వం మాత్రం సమాధానం చెప్పలేదు. మరి దీనిలో ఏ మత రాజకీయం ఉందో చూడాలి.

గోవధ చేయవద్దని, చేస్తే ఎటువంటి చర్యలకైనా వెనకాడబోమనీ, చట్టం చేసిన బీజేపీ ప్రభుత్వం గోవుల సంరక్షణకు కోట్ల రూపాయల నిధులు కేటాయించిన ఈ ప్రభుత్వం పసి పిల్లలకు నిధులు కేటాయించని బీజేపీ పాలకుల స్వభావాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ మధ్య కాలంలో ఇదే రాష్ట్రంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవులను తప్పించి అదుపు తప్పిన తమ పోలీసుల వాహనం ఫుట్‌పాత్‌పై వున్న చిన్నారులపైకి పోనివ్వడానికైనా సిద్ధపడ్డారు. పసి పిల్లలను చంపామని బాధని మరిచి ఆవులను రక్షించామని సంబరపడి పోయిన ఈ పోలీసుల మీద కనీస చర్యలు తీసుకోని ఈ పాలకులను ఏమనుకోవాలి. ఇది క్షమించరాని నేరం కాదా? గోవుల ప్రాణాలకు ఇచ్చిన విలువ పసి బిడ్డల ప్రాణాలకు ఇవ్వరా? రాజస్థాన్‌లో గోసంరక్షణ అంటూ బీజేపీ ప్రభుత్వం రోజుకు ఆవుకు రూ.70, దూడకు రూ.35 ఖర్చు చేస్తున్నది. కానీ అదే రాష్ట్రంలో కూటికి లేక అర్థాకలితో అలమటిస్తూ, పౌష్టికాహారం అందక వేలల్లో చిన్నారులు మరణిస్తుంటే పట్టింపే లేదు. ఈ పసి పిల్లల మరణం స్థానంలో ఆవులు మరణించి ఉంటే ఎంత రాద్ధాంతం చేసే వారు? ఎంత మంది మనుషులను పొట్టన పెట్టుకునే వారో? ఎందుకంటే ఆవు పేరుతో రాజకీయం చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడానికే తప్ప ఆవుపై ప్రేమ కాదు. ఈ మైకంలో మనుషులను మరిచిపోతున్నారు. ఇకనైనా ఆవు రాజకీయాలు మానుకొని మనుషులపై మనసు మరల్చి, నిధులు కేటాయించండి. మనుషులను రక్షించండి.

సెల్ : 9440758760

తీగలాగితే డొంక కదిలింది..!



ఎన్.రాజేంద్రప్రసాద్

భారతదేశంలో రెండో రాజధాని అయిన హైదరాబాద్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ సరఫరా మాఫియా కొనసాగించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా చూస్తే మనదేశంలో యువత 60శాతంపైనే ఉంది. యువతను లక్ష్యంగా చేసుకొని విదేశాల నుండి కొకైన్, హెరాయిడ్ లాంటి అతి ప్రమాదకరమైన మత్తు పదార్థాలను దొంగచాటున సరఫరా చేస్తున్నారు. తీగ లాగితే డొంక కదిలినట్టు ఒక కార్పొరేట్ స్కూల్ అమ్మాయి వల్ల మొత్తం వ్యవహారం బయటకు వచ్చింది. సదరు స్కూలు విద్యార్థిని మత్తుకు బానిపై నగ్నంగా ఫొటోస్ పంపిందంటే హైదరాబాద్‌లో ముఖ్యంగా స్కూల్స్ పరిస్థితి ఏ విధంగా ఉందో గమనించవచ్చు. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని తెలంగాణ కొత్త రాష్ట్ర విద్యా అభివృద్ధి కాకుండా చేస్తున్న శక్తులను ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డ్రగ్స్ మాఫియాపైన యుద్ధాన్ని ప్రకటించి అసలు హైదరాబాద్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నాయో తెలంగాణ ప్రభుత్వం తేల్చాల్సిందే. భవిష్యత్ తరాలకు ఇది క్యాన్సర్‌లా తయారవుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఇంత వరకు ఏ పబ్బుమీద గానీ, ఏ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల మీద గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్తు మాఫియాను అరెస్టు చేసి ఉజ్వల, నూతన భవిష్యత్ కల్పించాలి. కానీ సిట్ అధికారులు తూతూ మంత్రంగా విచారించి సినిమా పోలీసింగ్ చేస్తున్నారు. తరువాత రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు మారుతారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం కనుక్కోరు. కెల్విన్ పాత్రపై పలు అనుమానాలు ఉన్నాయి. మొదట వాటిని బయట పెట్టాలి. ఇంకా ఎంతమంది కెల్విన్ లాంటి నేరస్తులు ఉన్నారు. వారిలో ఎంతమంది పాస్‌పోర్ట్ అయిపోయిన తరువాత హైదరాబాద్‌లో ఉంటున్నారు. మన పోలీస్ నిబంధనలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల కూడా కొంత జాప్యం జరుగుతున్నది. కెల్విన్‌తో పరిచయం వున్నందుకు మాత్రమే సినీ పరిశ్రమలోని ప్రముఖులను విచారించి కొంతమంది రక్త నమూనాను సేకరించి విచారిస్తున్నారు. ఒక్కో కళాశాలలో సుమారు వంద మంది విద్యార్థులు డ్రగ్స్ వాడుతున్నారంటే విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో మనం అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులు ముఖ్యంగా ఇంజనీరింగ్ చదివే వారిని మత్తుకు బానిసలు చేయడం ద్వారా వారి భవితను ముతాలు ఫణంగా పెడుతుండడం దిగ్భ్రాంతి గొలుపుతుంది. ఎన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లాసెస్ తీసుకుంటున్నారు. అవగాహన ఎంతమందికి కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్స్ ఎడిక్షన్ సెంటర్స్ ఏమయ్యాయి. మరి ప్రభుత్వం ముఖ్యమైన పబ్లిక్ స్కూల్స్ లాంటి 13 పాఠశాలలకు నోటీసులిచ్చి వారిని ఎందుకు విచారించడం లేదు. రానున్న రోజుల్లో ఇంకా డ్రగ్స్ మాఫియా మరింత రెచ్చిపోయే ప్రమాదముంది. ఇప్పటికైనా పాలకులు చిత్తశుద్ధితో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి. అధికార పార్టీ సన్నిహితులే పబ్బులు నిర్వహిస్తున్నారన్న వార్తలు వచ్చాయి. వాస్తవాలు ప్రకటించినప్పుడే ప్రజలు పాలకులను విశ్వసిస్తారు.

సెల్ : 9704846563

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్


మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228




సాహసోపేత సముద్ర నేపథ్య చిత్రాలు





















ఏ క్షణంలో ఏం జరుగుతుందో కూడా తెలియని సముద్ర ప్రయాణం అనుక్షణం సవాల్ విసురుతూనే ఉంటుంది. అటువంటి సముద్రంపై దేశ రక్షణ కోసం సైనిక దళాలు చేసిన సాహసోపేత పోరాటాలకు, అనుకోకుండా సముద్రంలో చిక్కుకుపోయి మనుగడ కోసం పోరాటం చేసిన సాధారణ మనుషుల జీవితాలకు వెండితెర రూపంగా ఎన్నో చిత్రాలొచ్చి ఆదరణ పొందాయి. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతూ జీవితం విలువను తెలియజేసే కొన్ని సాహసోపేత సముద్ర నేపథ్య చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ 'షో'..

ఆల్ ఈజ్ లాస్ట్

సముద్రంలో సంభవించిన అల్లకల్లోలం కారణంగా ఒంటరిగా ప్రయాణిస్తున్న ఓ నావికుడి షిప్ తునాతునకలై పోతుంది. అన్ని కోల్పోయిన ఆ నావికుడు సముద్రం నుంచి బయటపడేందుకు చేసే పోరాట నేపథ్యంలో ఈ చిత్రాన్ని దర్శకుడు జె.సి. చండోర్ తెరకెక్కించారు. ఇందులో కొన్ని మాత్రమే డైలాగ్స్ ఉంటాయి, మిగతాదంతా నావికుడు మనుగడ కోసం చేసే సాహసమే ఉంటుంది. నావికుడిగా రాబర్ట్ రెడ్‌ఫోర్డ్ నటన ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. 2013లో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలూ పొందింది.

డీప్ బ్లూ సీ

అల్జీమర్ డిసీజ్‌ని నయం చేసేందుకు కొంత మంది శాస్త్రవేత్తల బృందం సముద్ర గర్భంలో పరిశోధన చేస్తుంటుంది. ఈ తరుణంలో వెంటాడుతున్న ఓ పెద్ద షార్క్ చేప బారి నుంచి ఈ బృందం ఎలా బయట పడిందనేదే అసలు కథ. రెన్నీ హర్లిన్ దర్శకత్వం వహించిన ఈ సైన్స్ ఫిక్షన్ హర్రర్ 1999లో విడుదలై 165 మిలియన్ డాలర్లు కలెక్ట్ చేసింది.

స్ఫియర్

సముద్రానికి వెయ్యి అడుగుల లోతులో నేవీ అధికారులు, ఓ పరిశోధక బృందం గోళం ఆకారంలో ఉన్న ఒక షిప్ స్ఫియర్‌ను కనిపెడతారు. అదొక అద్భుతమైన ఆవిష్కరణ. దాన్ని ఎవరు తయారు చేశారు?, ఎందుకు తయారు చేశారు?, అందులో ఉన్న మర్మమేంటనేది మిస్టరీ. ఆ మిస్టరీని ఛేదించేందుకు శాస్త్రవేత్తలు సముద్రంలో చేసిన పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం. బారీ లెవిన్సన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1998లో విడుదలైంది.

ది హంట్ ఫర్ రెడ్ అక్టోబర్

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సోవియట్ రష్యా మోస్ట్ అడ్వాన్స్ న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను తయారు చేస్తుంది. సముద్రగర్భ రక్షణ వ్యవస్థలోనే అదొక విప్లవాత్మకమైన చోదక వ్యవస్థ. సముద్రంలో అనుకోకుండా అమెరికా సబ్‌మెరైన్, రష్యా సబ్‌మెరైన్ ఒకదానికొకటి ఎదురుపడతాయి. దీంతో నియంత్రణ రేఖల వద్ద యుద్ధ వాతావరణం నెలకొంటుంది. రష్యా సబ్‌మెరైన్ కెప్టెన్, యుఎస్ సబ్‌మెరైన్ కెప్టెన్ తీసుకున్న నిర్ణయాలు ఎలాంటి పరిణామాలకు దారితీశాయనేది ఈ సినిమా. కోల్డ్‌వార్‌గా చెప్పుకునే ఈ యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు జాన్ మెక్ టెర్నాన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. 1990లో విడుదలైన ఈ చిత్రం 30మిలియన్ డాలర్లతో తెరకెక్కి 200మిలియన్ డాలర్లను వసూలు చేసింది. సౌండ్ ఎడిటింగ్ విభాగంలో ఆస్కార్ అవార్డును దక్కించుకుంది.

క్రిమ్సన్ టైడ్

రష్యా సమాఖ్యలో రాజకీయ సంక్షోభం నెలకొన్న సమయంలో అమెరికా, జపాన్ న్యూక్లియర్ మిసైల్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతుంటారు. ఈ సమయంలో అమెరికా న్యూక్లియర్ మిసైల్స్ సబ్ మెరైన్‌లోకి కొత్తగా వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు, కమాండింగ్ ఆఫీసర్‌కు మధ్య జరిగిన ఘర్షణ ఎలాంటి పరిణామాలకు దారి తీసిందనేది సినిమా. టోనీ స్కాట్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1995లో విడుదలై 3 విభాగాల్లో ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. 53 మిలియన్ డాలర్లతో తెరకెక్కి 164 మిలియన్ డాలర్లను వసూలు చేసింది.

మాస్టర్ అండ్ కమాండర్

దక్షిణ అమెరికాకు చెందిన నౌకలు తమ షిప్‌పై దాడి చేయడంతో తన షిప్‌ను, తమ బృందాన్ని కాపాడేందుకు, అదే సమయంలో ప్రత్యర్థులను తెలివితో ఓడించేందుకు ఓ బ్రిటన్ షిప్ కెప్టెన్ చేసిన పోరాటమే ఈ చిత్ర ఇతివృత్తం. పీటర్ వెయిర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విశేష ఆదరణ పొందింది. 150 మిలియన్ డాలర్లతో తెరకెక్కి 212 మిలియన్ డాలర్లను వసూలు చేసింది. విజువల్‌గా మంత్రముగ్దుల్ని చేసే ఈ చిత్రం సినిమాటోగ్రఫీ, సౌండ్ ఎడిటింగ్ విభాగంలో ఆస్కార్ అవార్డులను సొంతం చేసుకుంది.

టైటానిక్

1912లో జరిగిన టైటానిక్ షిప్ ప్రమాద నేపథ్యంలో దర్శకుడు జేమ్స్ కామెరూన్ 1997లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. షిప్‌లో చోటు చేసుకున్న విషాదభరిత ప్రేమ కథా చిత్రంగా సినీ చరిత్రలో నిలిచిపోయింది. ఈ చిత్రం దాదాపు 220 కోట్ల డాలర్లకుపైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది. అంతేకాదు ఏకంగా 11 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను సొంతం చేసుకుని రికార్డు సృష్టించింది. ప్రపంచ సినీ చరిత్రలో అత్యధిక ఆస్కార్‌లను గెల్చుకున్న రెండో చిత్రమిది.

యు-571

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఓ వైపు భూభాగంపై జర్మన్, అమెరికా కూటముల మధ్య యుద్ధం జరుగుతుంటుంది. మరోవైపు సముద్రంలోనూ అమెరికా సబ్‌మెరైన్ జర్మన్ బార్డర్‌ను క్రాస్ చేస్తుంది. దీంతో జరిగిన దాడిలో అమెరికాకు చెందిన యు సబ్‌మెరైన్ ఎక్కువ శాతం డ్యామేజ్ అవుతుంది. మనుగడ కోసం అందులోని సైనిక దళాలు చేసిన పోరాటమే ఈ చిత్రం. జోనాథన్ మోస్తోవ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం 2000లో విడుదలై సౌండ్ ఎడిటింగ్‌లో ఆస్కార్ అందుకుంది. విశేష ఆదరణతో 127 మిలియన్ డాలర్లను కలెక్ట్ చేసింది.

ది పర్‌ఫెక్ట్ స్టార్మ్

1991 అక్టోబర్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో సెబాస్టియన్ జంగర్ రాసిన పుస్తకం ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది. సముద్రంలో సంభవించిన మృత్యు తుపాన్ కారణంగా ఓ కమర్షియల్ ఫిషర్ బోట్ మునిగిపోతుంది.అందులోని వారిని కాపాడేందుకు వచ్చిన రక్షణదళ హెలికాప్టర్ సైతం తుపాన్ ధాటికి సముద్రంలో కూలిపోతుంది.అత్యంత విషాదకరమైన ఈ ఇతివృత్తం ఆధారంగా వోల్ఫ్‌గంగ్ పీటర్‌సన్ 2000లో ఈ చిత్రాన్ని రూపొందించారు.

వైట్ స్క్వాల్

స్టడీలో భాగంగా ప్రాక్టికల్ ప్రాక్టీస్ కోసం కాలేజ్ విద్యార్థులు ఓడలో సముద్ర ప్రయాణం చేస్తున్న క్రమంలో వాళ్ళు ఎదుర్కొన్న ఆటుపోట్లు ఏంటదనేదే ఈ చిత్ర కథ. రిడ్లీ స్కాట్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 1996లో విడుదలై మంచి విజయం సాధించింది. కమర్షియల్‌గానూ సత్తా చాటింది.

వాటర్ వరల్డ్

ధృవ భాగంలో ఉన్న భారీ మంచు పర్వతాలు కరిగిపోవడంతో భూమి మొత్తం నీటితో మునిగిపోతుంది. దీంతో మనుగడ సాధించడం కోసం జనం పోరాడుతున్న క్రమంలో ఓ చోట చిన్న దీవి కనిపిస్తుంది. దాని కోసం రాక్షస జాతి, మనుషులు చేసే పోరాటమే ఈ చిత్రం. సముద్రంపై జీవనం, మట్టి కోసం పోరాటం చేసే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కెవిన్ రేనాల్డ్స్ రూపొందిన ఈ చిత్రం 1995లో విడుదలై 264 మిలియన్ డాలర్లను వసూలు చేసింది.

కె-19: ది విడో మేకర్

సోవియట్ రష్యా తొలిసారి తయారు చేసిన న్యూక్లియర్ సబ్‌మెరైన్‌ను ప్రయోగ నిమిత్తం సముద్రంలోకి పంపిస్తుంది. కానీ సబ్‌మెరైన్‌లో చోటు చేసుకున్న లోపాల వల్ల ఆ సబ్‌మెరైన్ పేలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఆ ప్రమాదం జరగకుండా ఉండటం కోసం అందులోని టీమ్ చేసే పోరాటమే ఈ చిత్రం. 2002లో విడుదలైన ఈ చిత్రాన్ని కేథరిన్ బిజిలో రూపొందించారు.

ఓపెన్ వాటర్

ఓ నవదంపతుల జంట హాలీడేస్‌లో భాగంగా ఓ రోజు స్క్యూబా డ్రైవింగ్ ట్రిప్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటున్నారు. బోట్‌లో సముద్రం లోపలికి వెళ్తారు. ఈ ఇద్దరూ సముద్రంలోకి దూకి స్క్యూబా డ్రైవ్ చేసి వచ్చాక చూస్తే బోట్ మాయమవుతుంది. వీరిని పసిగట్టిన ఓ షార్క్ చేప దాడి చేసేందుకు వస్తుంటుంది. మరి ఆ షార్క్ నుంచి ఎలా తప్పించుకున్నారు. సముద్రం నుంచి ఎలా బయటపడ్డారనేది సినిమా. యదార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు క్రిస్ కెంటిస్ 2003లో ఈ చిత్రాన్ని రూపొందించారు.

కాన్ టికి


నార్వేకు చెందిన అన్వేషకుడు థోర్ ఐదుగురితో కలిసి బోట్‌లో పసిఫిక్ సముద్రంలో ప్రయాణిస్తుంటాడు. ఈ క్రమంలో ఎదురైన బాల్సావుడ్ అలను తప్పించుకుంటారు. ఆ తర్వాత షార్క్ చేప దాడిని ఎదుర్కొంటారు. ఇలా 101 రోజులపాటు 8వేల కిలోమీటర్లు ప్రయాణించి పాలినేషియన్ దీవికి చేరుకుంటారు. 1947లో అత్యంత సాహసోపేతంగా సాగిన నిజమైన యాత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. జోచిం రెన్నింగ్, ఎస్పెన్ సాండ్‌బర్గ్ సంయుక్త దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2012లో విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఆ ఏడాది అత్యధిక కలెక్షన్లు రాబట్టిన నార్వే చిత్రంగా నిలిచింది. అంతేకాదు విదేశీ విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. ఇందులో థోర్ పాత్రలో పాల్ సువర్ వాల్మీం హెగెన్ నటించారు.

కెప్టెన్ ఫిలిప్స్


2009లో సోమాలియా సముద్ర దొంగలతో హైజాక్ చేయబడిన అమెరికా వ్యాపార నౌకను కాపాడిన కెప్టెన్ రిచర్డ్ ఫిలిప్స్ జీవితం ఆధారంగా 2013లో దర్శకుడు పాల్ గ్రీన్ గ్రాస్ రూపొందించిన చిత్రమిది. కెప్టెన్ రిచర్డ్ పాత్రలో టామ్ హాంక్స్ నటించిన ఈ చిత్రం దాదాపు 22కోట్ల డాలర్లు వసూలు చేయడంతోపాటు పలు అవార్డులను సొంతం చేసుకుంది.
























ఊర్లు జలసమాధి

- రీడిజైన్‌తో ఏడు గ్రామాలకు ముంపు
- భారం రూ.800 కోట్లు... అదనంగా సాగయ్యేది 31 వేల ఎకరాలే
- ఊర్లను ముంచితే ఉద్యమిస్తామంటున్న జనాలు
- టీఎంసీల సామర్థ్యాన్ని తగ్గించాలని విపక్షాల డిమాండ్
- రేపు ప్రజాభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-యాదాద్రిభువనగిరి ప్రతినిధి

ప్రాజెక్టుల రూపకల్పనలో చారాణ కోడికి బారాణ మసాలా అన్న చందంగా సర్కారు తీరు ఉంది. యాదాద్రి భువనగిరిలో జిల్లాలో బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్ల కింద కేవలం 31 వేల ఎకరాల అదనపు సాగు కోసం 8 వేల ఎకరాలను ముంచేందుకు సర్కారు సిద్ధపడింది. దీని వల్ల సర్కారుపై 1500 కోట్ల వరకు అదనపు భారం పడే అవకాశముంది. రిజర్వాయర్ల నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణను ముంపు ప్రాంతాల్లో కాకుండా లబ్దిపొందే గ్రామాల్లో పెట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు సర్కారు పూనుకుంది. 'గత ప్రభుత్వం రూపకల్పన చేసిన 0.8 బస్వాపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి...గొలుసుకట్టు చెరువుల కాలువలను పునరుద్ధరిస్తే సాగునీరును అందుబాటులో తెచ్చే వీలున్నా...అట్లా కాకుండా గుడ్డెద్దు చేన్లో పడ్డ చందంగా సర్కారు ఒంటెద్దు పోకడలకు పోతోంది' అని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు16 ఫేజ్ కింద యాదాద్రి భువనగిరి జిల్లాలో లక్షా 62లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో భువనగిరి మండలం బస్వాపురంలో 0.8టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను రూ.1093 కోట్లతో నిర్మించతలపెట్టారు. 96 కిలోమీటర్ల కెనాల్‌ను నిర్మించేందుకు అనుమతులూ వచ్చాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న పీఎల్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ఈపీసీ పద్ధతిలో నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 900 ఎకరాలు ముంపునకు గురయ్యేలా రిజర్వాయర్‌ను డిజైన్ చేశారు. అందులో కేవలం బస్వాపురం, బీఎన్ తిమ్మాపురం గ్రామాల్లోని వ్యవసాయ భూములు మాత్రమే ముంపునకు గురయ్యాయి. 40 శాతం పనులు పూర్తయ్యాయి.

రీడిజైన్‌తో ఏడు గ్రామాలు ముంపు

2015లో బస్వాపురం రిజర్వాయర్ సామర్థ్యాన్ని 14 టీఎంసీలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుంది. దీంతో యాదగిరిగుట్ట మండలం రాళ్లజనగాం, దాతరుపల్లి, జంగంపల్లి, మరో రెండు గిరిజన తండాలు ముంపు జాబితాలో ఉన్నాయి. ఇవన్నీ టీఆర్ఎస్‌కు మంచి పట్టున్న గ్రామాలు. గ్రామాల నుంచి నిరసన రాగానే ఆలేరు ఎమ్మెల్యే సునీత సీఎంపై ఒత్తిడి చేశారు. దీంతో 1,88,500 ఎకరాలకు సాగునీరందించేందుకు 11.39 టీఎంసీలకు ఈ రిజర్వాయర్‌ను ఖరారు చేశారు. దీనివల్ల అదనంగా 23,000 ఎకరాలకు సాగు అందనుంది. కానీ, బిఎన్ తిమ్మాపురం, లక్ష్మినాయకుని, చెంగల్‌నాయకుని తండాలతో పాటు 3977 ఎకరాల పంట పొలాలను నిండా ముంచుతుంది. ఫేజ్ 15లో 63,300 ఎకరాలకు సాగునీరు అందించడానికి తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువును 9.86టీఎంసీల సామర్థ్యానికి పెంచారు. రూ.8, 625 కోట్ల వ్యయంతో రీ డిజైన్ చేయడం వల్ల తుర్కపల్లి మండలం గందమల్ల, ఇందిరానగర్, వీరరెడ్డిపల్లి, తెట్టెకుంట గ్రామాలు జలసమాధి కానున్నాయి. ఈ రెండు రిజర్వాయర్ల కింద అదనంగా 31 వేల ఎకరాలకు నీరందించేందుకు 8,087 ఎకరాలను ముంపునకు గురిచేస్తున్నది. బస్వాపురం రిజర్వాయర్ కింద 655 ఇండ్లు, గందమల్ల రిజర్వాయర్ కింద 1568 పైగా ఇండ్లు ముంపునకు గురువుతున్నాయి.

పెరిగిన వ్యయం

పాత డిజైన్ ప్రకారం బస్వాపురం రిజర్వాయర్, కెనాల్ నిర్మాణ వ్యయం రూ.1093కోట్లు. రీడిజైన్‌తో అది కాస్తా రూ.1751 కోట్లకు చేరింది. గంధమల్లకు రూ.860.25 కోట్లను కేటాయించారు. ఇంకా 13,746 ఎకరాల భూసేకరణకు నిధులు కేటాయించాలి. 2013 చట్టం ప్రకారం భూసేకరణ చేయాలని హైకోర్టు ఇటీవలే ప్రభుత్వాన్ని మందలించింది. మార్కెట్ ప్రకారం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు సుమారు రూ. ఐదు వేల కోట్లు అవసరం. ఇంత పెద్ద మొత్తంలో నిధులను విడుదల చేసే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అంటే అనుమానమే! పాత డిజైన్ ప్రకారమే నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులుండవు.

ముంపు గ్రామాలకు దూరంగా..

రిజర్వాయర్ల నిర్మాణం కోసం ఈ నెల 22న ప్రభుత్వం భువనగిరి మండలం రాయిగిరిలో ప్రజాభిప్రాయసేకరణ ఏర్పాటు చేసింది. ముంపు గ్రామాల్లో కాకుండా 30 కిలోమీటర్ల దూరంలో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌తో లబ్దిపొందే 11 మండలాల ప్రజలను పిలిచి అభిప్రాయసేకరణ చేయడం వల్ల తమకు అన్యాయం జరగుతుందని వాపోతున్నారు. మొదట తమ గ్రామాల్లో సభలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచి బస్వాపురం రిజర్వాయర్ కెనాల్ కోసం జీవో 123 ప్రకారం 539ఎకరాలు, రిజర్వాయర్ కోసం రైతుల నుంచి 416.21 ఎకరాలు సేకరించి నిర్వాసితుల నోట్లో మట్టి కొట్టారని బాధితులు వాపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం బిఎన్ తిమ్మపురం గ్రామానికి చెందిన యెన్నం యాదగిరి బెంగతో గుండెపగిలి చనిపోయినట్టు ఆయన మనువడు రాజు వాపోయాడు.


రీ డిజైన్‌తో దండుకుంటున్న ప్రభుత్వం : ఎమ్‌డీ జహంగీర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

ప్రాజెక్టుల రీడిజైన్‌తో ప్రభుత్వం వేల కోట్లను దండుకునే ప్రయత్నం చేస్తోంది. నీటి సామర్థ్యాన్ని పెంచి ముంపుతో గ్రామాలను కనుమరుగు చేస్తోంది. బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్లను పాత డిజైన్ ప్రకారమే యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారమే పరిహారం అందించాలి.



కన్నీరు కార్చని రోజు లేదు


చిన్ననాటి జ్ఞాపకాలు, పూర్వీకుల గోరీలు, రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇండ్లు జలసమాధి కాబోతున్నాయని తెల్సి కన్నీరు కార్చని రోజు లేదు. చూస్తుండగానే ఊరి బంధమూ, పేగు బంధాలూ తెగి పోతున్నాయి. పంటి కిందబాధని, కండ్లల్లో నీళ్లని కుక్కు కొని ఎడబాటు గుండా కొత్తబాట ప ట్టాల్సి వస్తోందని ఎన్నడూ అనుకోలేదు.



మోరె పాపిరెడ్డి, బీఎన్ తిమ్మపురం

గ్రామాల మధ్య చిచ్చు..


ముంపు గ్రామాల్లో కాకుండా వేరే గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం వెనుక ప్రభుత్వ కుట్ర దాగి ఉంది. ముంపు గ్రామాల ప్రజలకు, లబ్దిపొందే గ్రామాల ప్రజల మధ్య చిచ్చు రాజేసుందుకే రాయిగిరిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారు.



జిట్టా బాలక్రిష్ణారెడ్డి, యువ తెలంగాణ అధ్యక్షులు

టీఎంసీలు తగ్గించాలి

కమీషన్ల కక్కుర్తి కోసమే రిజర్వాయర్లను రీడిజైన్ చేశారు. బస్వాపురం రిజర్వాయర్ పాత డిజైన్ ప్రకారమే 0.8టీఎంసీ సామర్థ్యంతో నిర్మించాలి. గందమల్ల చెరువును టీఎంసీ సామర్థ్యానికి కుదించాలి. వీటిని నింపి గొలుసుకట్టు కాలువల ద్వారా చెరువులను నింపితే జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారమవుతుంది.



కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

నేడు ఉద్యోగాల భర్తీపై కడియం కీలక సమావేశం

- హాజరుకానున్న సీఎస్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, జీఏడీ, ఆర్థిక, న్యాయశాఖ కార్యదర్శులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో కీలక సమావేశం జరగనుంది. ఉద్యోగాల భర్తీకి ఆటంకంగా ఉన్న అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఆర్థిక ముఖ్యకార్యదర్శి కె రామకృష్ణారావు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు హాజరవుతారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగివంతం చేయడం కోసం ఈనెల 16న ఓ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఖాళీలను పాత జిల్లాల ప్రకారమా?, లేక కొత్త జిల్లాల ప్రకారం చేపట్టాలా?అన్న దానిపై సందిగ్ధం నెలకొంది. అంశాన్ని తేల్చాలని న్యాయశాఖను కోరిన విషయం తెలిసిందే. సోమవారం నిర్వహించే సమావేశంలో ఈ అంశంపై స్పష్టత రానుంది. రాష్ట్రపతి ఉత్వర్వుల్లో పాత పది జిల్లాలే ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన 31 జిల్లాలు రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పొందుపరచలేదు. దీంతో 31 జిల్లాల ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేస్తే సమస్యలు తలెత్తుతాయని న్యాయ శాఖ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. పాత జిల్లాల ప్రకారమే నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంటుందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి సూచించే అవకాశముంది. దీంతో పాత జిల్లాల ప్రకారమే నోటిఫికేషన్లు విడుదల చేస్తామని కీలక ప్రకటన వెలువడే సూచనలున్నాయి. సీఎం కేసీఆర్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వివిధ శాఖల్లో 84,876 ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా ఉద్యోగాల భర్తీకి జారీ చేసే నోటిఫికేషన్లకు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించనున్నారు. నోటిఫికేషన్లలో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా రూపొందించే దిశగా సమాలోచన చేయనున్నారు. ఇంకోవైపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీపైనా చర్చించనున్నారు. 8,792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. పాత జిల్లాల ప్రకారం నోటిఫికేషన్లు ఇచ్చేందుకు కీలక నిర్ణయం తీసుకొని వెల్లడించే అవకాశముంది. ఇంకోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన 84,876 ఖాళీలను శాఖల వారీగా తెప్పించుకొని భర్తీకి సంబంధించిన సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నారు.

రెండు నెలల్లో రామమందిర నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత భారత పార్లమెంటు, న్యాయవ్యవస్థలపై ఉన్నదని అన్నారు. ధర్మానికి వ్యతిరేకంగా న్యాయస్థానాలు తీర్పులు చెప్పజాలవని వ్యాఖ్యానించారు. రామమందిర నిర్మాణం కేసు సుప్రీంకోర్టులో దశాబ్దాలుగా నానుతోందన్నారు. వందకోట్ల మంది హిందువుల మనోభావాల్ని న్యాయస్థానం గుర్తించాలని, చట్టపరమైన వివాదాలను ప్రభుత్వం చూసుకోవాలని చెప్పారు. కాచిగూడలో జరిగిన భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. తమ పోరాటం రామమందిరం కోసం కాదని, రామజన్మభూమి కోసమేనని తేల్చిచెప్పారు. తాము న్యాయవ్యవస్థను, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని, అదే సమయంలో రామజన్మభూమి స్వాధీనం తమ ఆశయమని అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగే వరకు తాము విశ్రమించబోమని, ఎన్ని అవాంతరాల్ని ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. మందిర నిర్మాణ బాధ్యత పూర్తిగా వీహెచ్‌పీదేనని స్పష్టం చేశారు. గోహత్యల్ని నిరోధిస్తూ తమ కార్యకర్తలు చట్టాన్ని పరిరక్షిస్తున్నారని, ఆ బాధ్యత నిర్వర్తించాల్సిన ప్రభుత్వాలు పట్టీపట్టనట్టు ఉండటం వల్లే వివాదాలు చెలరేగుతున్నాయని అన్నారు. గోహత్యలు చేసేవారే గూండాలు, హంతకులు...వారిని ఎలా వెనకేసుకువస్తారని ఆయన ప్రతిపక్షాల్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. చట్టబద్ధ పాలన చేసే బాధ్యత ప్రభుత్వాలది...గోహత్యలు జరుగుతున్నాయంటే అక్కడ చట్టబద్ధ పాలన లేనట్టేనని అన్నారు. దేశంలో మైనారిటీల హక్కుల గురించి మాట్లాడేవారు...కాశ్మీరీ హిందువుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గోరక్షక్ విషయంలో భజరంగ్‌దళ్‌ను విమర్శించడం సరికాదని, వారు చట్టాన్ని రక్షిస్తున్నారని చెప్పుకొచ్చారు. కాశ్మీర్‌లో సైన్యంపై రాళ్లువేసేవారికి బాంబులతో సమాధానం చెప్పాలని, అక్కడ 370 ఆర్టికల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 19 కోట్లమంది హిందువుల ఆకలితో అలమటిస్తున్నారని, పదికోట్లమంది నిరుద్యోగ యువత ఉన్నదని చెప్పారు. ముస్లింలలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తూ, హిందువులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ముస్లింలకు మాదిరే హిందూ నిరుద్యోగ యువకుల కోసం ప్రత్యేక హిందూ ఆర్థిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హిందువులకు మరణం లేదని, వారికి పునర్జన్మతో తిరిగి ద్వారాలు తెరుచుకుంటాయని చెప్పుకొచ్చారు. ప్రపంచంలో ఉగ్రవాదులు, జిహాదీలను అంతం చేసి, అఖండ హిందూరాజ్య స్థాపనే లక్ష్యమని చెప్పారు. కశ్మీర్‌లో ఆర్మీకి స్వేచ్ఛలేదని, అక్కడి ముస్లింలు సైన్యంపై దాడులు చేస్తున్నారని అన్నారు. వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షులు జి రాఘవరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ముస్లిం రిజర్వేషన్లను వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. శివరాత్రికి అన్ని థియేటర్లలో భక్తి సినిమాలే ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. భజరంగ్‌దళ్ జాతీయ అధ్యక్షులు మనోజ్‌శర్మ మాట్లాడుతూ అయోధ్యలో కరసేవ జరిగి 25 ఏండ్లు పూర్తయ్యిందని, దాని ఫలితాలను ఇప్పుడు చూడగలుగుతున్నామని చెప్పారు. అంతకుముందు కాచిగూడలోని శ్యాంబాబా మందిర్ నుంచి భజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు.

ప్రజలకు ప్రశ్నించటాన్ని నేర్పుతాం



(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ కల భౌతికంగా సాకారమైంది కానీ వాటి ఫలితాలు మాత్రం పేదలకు అందడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ కంచె ఐలెయ్య మాట్లాడుతూ...లాల్‌లీల్ జెండాలు కలిసి పోరాటం చేయాలని కోరారు. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా భూములన్నీ బీడుబారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ మెంబర్ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... కేసీఆర్ దుర్మార్గ పాలనపై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజా పోరాటాలను నిర్బంధిస్తూ.. దుర్మార్గమైన పాలనను కేసీఆర్ కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సర్కారుపై పోరాడేందుకు గ్రామస్థాయి వరకు టీ మాస్ ఫోరం నిర్మాణం కావాలన్నారు. టీ మాస్ ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ. సాగర్ మాట్లాడుతూ.. ఆగస్టు చివరినాటికి 31జిల్లాల్లో టీ-మాస్ ఫోరం కమిటీలు వేయడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 26మండలాల్లో మండల కమిటీలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆశయ్య మాట్లాడుతూ.. సమన్యాయం కోసం సమరం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బిసి సబ్‌ప్లాన్ రాష్ట్ర కార్యదర్శి కిల్లెగోపాల్, టిమాస్ ఫోరమ్ స్టీరింగ్ కమిటి సభ్యులు జాన్‌వెస్లీ, తెలంగాణ గిరిజ న సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మానాయక్, గిరిజన సంఘం నాయకులు దేశ్యా నాయక్, కేవీపీఎస్ నాయకులు లక్ష్మణ్, నిర్మల, జలజం సత్యనారాయణ, ఎం.కురుమయ్య, వి.కురుమూర్తి, చంద్రకాంత్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి సాగరంలో కన్నవారు

(మొదటిపేజీ తరువాయి)

64.1 శాతం సీనియర్ సిటిజన్స్ ఒంటరిత నంతో బాధపడుతుండగా, గ్రామాల్లో ఇది 39.19 శాతంగా ఉన్నదని సర్వేప్రతినిధులు ఈసందర్భంగా తెలిపారు.

అక్కడ కూడా వృథే! :

రక్తసంబంధీకులకు దూరమై, ఆత్మీయుల ప్రేమానురాగాలు కరువై అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో చేరుతున్న వారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతున్నదని, గత పదిహేను సంవత్సరాల కాలంలో దేశంలో ఎన్నో మార్పులు జరిగినా.. వద్దుల జీవన స్థితిగతులు అంతగా మెరుగుపడలేదని ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ (ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగం) నిర్వహించిన సర్వేలో తేలింది. అధ్యయనం ప్రకారం.. ప్రతీ ఏడుగురు యోవ వృద్ధుల్లో ఒకరు కుటుంబ సభ్యుల నుండి లేదా బయటి వ్యక్తుల నుండి వేధింపులకు గురవుతుండగా, ముసలివారమని కూడా చూడకుండా రక్తసంబంధీకుల చేతుల్లోనే ఎన్నో ఈసడింపులు, వేధింపులకు గురయ్యామని సర్వేలో పాల్గొన్న దాదాపు 58 శాతం మంది అభిప్రాయపడ్డారంటే.. దేశంలో సీనియర్ సిటిజన్స్ హదయవిధారక జీవితం బోధపడుతోంది. దేశంలో వయో వృద్ధుల ప్రాథమిక హక్కులను రక్షించే బలమైన వ్యవస్థను ప్రభుత్వాలు అమలుపరచడంలో విఫలమయ్యాయని అధ్యయనంలో పాల్గొన్న దాదాపు 46.82 శాతం పండుటాకులు తమ ఆక్రోశాన్ని వ్యక్తపరిచాయంటే.. వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మలివయసులో కన్నవారు బిడ్డల నుండి కోరుకునేది ప్రేమానురాగాలు మాత్రమే! ఆధునిక జీవన శైలిని ఆహ్వానించడం అంటే, కన్నవారిని దూరం చేసుకోవడం కాదని ఇప్పటికైనా నేటి పిల్లలు గ్రహించాలి. ప్రభుత్వాలు సైతం ఆ వయో వృద్ధులకు బాసటగా నిలుస్తూ వారి పక్షాన నిలబడే అవసరం ఎంతైనా ఉన్నది.

వయో వృద్ధులు రాష్ట్రాల సరళి :

అధికంగా కలిగిన రాష్ట్రాలు / రాష్ట్ర జనాభాలో వాటా అల్పంగా కలిగిన రాష్ట్రాలు / రాష్ట్ర జనాభాలో వాటా	
కేరళ	12.6%
అరుణాచల్ ప్రదేశ్	4.6%
గోవా	11.2%
మేఘాలయ	4.7%
తమిళనాడు	10.4%
నాగాలాండ్	5.2%
పంజాబ్	10.3%
మిజోరాం	6.3%
హిమాచల్ ప్రదేశ్	10.2%
సిక్కిం	6.7%

దేశంలో వయో వృద్ధులు అంకెల్లో:

- 12కోట్లు (సుమారు)- దేశంలో మొత్తం సీనియర్ సిటిజన్లు
- 8.2% - మొత్తం పురుష జనాభాలో 60 యేండ్లు పైబడినవారు
- 9% - మొత్తం మహిళా జనాభాలో 60 యేండ్లు పైబడినవారు
- 35.5% - దశాబ్ద కాలంలో వయో వృద్ధుల సగటు పెరుగుదల

మూఢనమ్మకాల నిరోధక చట్టం రావాలి

నవతెలంగాణ - రాంనగర్

తెలంగాణలో మూఢనమ్మకాల నిరోధక చట్టం రావాలని సామాజిక కార్యకర్త దేవి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో 'తెలంగాణలో మూఢ నమ్మకాల నిరోధకచట్టం-మన కర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా దేవి, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి గురజాల రాధా రాణి హాజరై మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతోగానో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో పాతకాల మూఢత్వమే కొత్త రూపంతో మనల్ని ఆకర్షించి వెనక్కి లాగుతోందన్నారు. నోములు, వ్రతాలు, అర్చనలు, ప్రవచనాలు వంటి మీడియా ప్రచారాల వల్ల పెచ్చుమీరి మహిళా లోకం భావధాస్యంలోకి నెట్టుతున్నాయన్నారు. తద్వారా తెలంగాణలో బాల్యవివాహాలు పెరిగిపోయాయని వాపోయారు.

రాంకీ భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- కొనుగోలు చేసిన భూ రికార్డులను స్వాధీనం చేసుకోవాలి
- ఆ యాజమాన్యంపై కేసు పెట్టి అరెస్టు చేయాలి
- ఎలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి రైతులకు న్యాయం చేయాలి : సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలిమినేడు, గుండంపల్లి, సుంకెనపల్లి గ్రామాల్లో రాంకీ సంస్థ కొనుగోలు చేసిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ బినామీ రిజిస్ట్రేషన్లు, చట్ట ఉల్లంఘనలపై కేసు నమోదు చేసి, యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావుకు తమ్మినేని వీరభద్రం ఆదివారం లేఖ రాశారు. ఆ గ్రామాల రైతుల నుండి రాంకీ సంస్థ మల్టీ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్ పేరుతో 2011-12 నుండి భూములు కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఇప్పటి వరకూ ఈ మూడు గ్రామాలకు చెందిన 1,200 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుందని పేర్కొన్నారు. మరో 200 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సిద్ధమైందని తెలిపారు. ఈనెల 10న భూ నిర్వాసితుల పోరాట కమిటీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆ ప్రాంతంలో పర్యటిం చాయని పేర్కొన్నారు. ఈనెల 18న టీమాస్ తరపున తనతోపాటు ఎలిమినేడు పంచాయితీ కూడలిలో బహిరంగ విచారణను నిర్వహించిందని తెలిపారు. వందలమంది రైతులు, గ్రామ ప్రజలు రాంకీ చేసిన అన్యాయాలను వివరించారని పేర్కొన్నారు. రాంకీ సంస్థ భూముల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు పాల్పడిందని తెలిపారు. పట్టాదారులతో సంబంధం లేకుండా దొంగ ఫొటోలు పెట్టి బినామీ పేర్లతో వందల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుందని పేర్కొన్నారు.

భూ అక్రమాల వివరాలు

- నక్కా ఊశయ్య బతుకుదెరువు కోసం 2009లో సౌదీ వెళ్లి 2013 జులై 21న తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్టు పాస్‌పోర్టులో వివరాలున్నాయి. కానీ 2012లో రాంకీ సంస్థకు నక్కా ఊశయ్య 4.07 ఎకరాలు అమ్మినట్టు ఆ గ్రామానికి చెందనివారి ఫొటో పెట్టి బినామీ రిజిస్ట్రేషన్ చేయించారు.
- కందుల లింగారెడ్డి 1999లో చనిపోయారు. 2003లో ఆయన కుమారుడు కందుల అంజిరెడ్డి పేరుతో సర్వే నెంబర్ 688లో ఐదెకరాల భూమికి పట్టా మార్పిడి జరిగింది. 2012 మార్చి 12న చనిపోయిన లింగారెడ్డి పేరుతో వేరే ఫొటో పెట్టి రాంకీ సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకుంది.
- గడ్డం ప్రమీల, కర్థూరి నర్సమ్మలు అర ఎకరం, ముప్పావు ఎకరం చొప్పున రాంకీ సంస్థకు అమ్మితే అదే సర్వే నెంబరులో ఉన్న వారిద్దరి మరో 2 ఎకరాల 27 కుంటలనూ రిజిస్ట్రేషన్ చేయించుకుంది.

చనిపోయిన వారు బతికున్నట్టుగా దొంగ ఫొటోలు సృష్టించారని తెలిపారు. బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన వారి భూములనూ వేరే ఫొటోలు పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. మల్టీ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీస్ పార్క్ ఏర్పడితే పిల్లలకు ఉద్యోగాలొస్తాయని రైతులకు ఎరచూపి ఎకరానికి రూ.4.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు కారుచౌకగా భూములు కొన్నారని తెలిపారు. ఇవే



భూములను ఎకరం రూ.9 లక్షల నుంచి రూ.9.50 లక్షల వరకు కొన్నట్టు రాంకీ సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకుందని పేర్కొన్నారు. ఈ భూములకు ఐసీఐసీఐ, ఇతర బ్యాంకుల్లో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు సేల్‌డీడ్ చేసి కోట్ల రూపాయల డబ్బును రాంకీ సంస్థ రుణం పొందిందని తెలిపారు. బినామీ పేర్లతో రాంకీ సంస్థ చేయించుకున్న రిజిస్ట్రేషన్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఎలిమినేడులోనే 16 కుటుంబాల్లోని 25 మందికి చెందిన 74 ఎకరాలు రాంకీ సంస్థ దొంగ ఫొటోలతో బినామీ రిజిస్ట్రేషన్లు చేయించిందని తెలిపారు. రాంకీ మల్టీ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్ సంస్థకు ఎండి నేరెడ్డి గౌతమ్‌రెడ్డి ఈ బినామీ పేర్లతో తమ ఏజెంట్లు మోసం చేశారని అంగీకరిస్తూ ఆగస్టు 11న రైతులకు ఒప్పంద పత్రం రాశారని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన వివరాల్లోనే మొత్తం 74 ఎకరాల భూమి ఉందని తెలిపారు. గత ప్రభుత్వాల అండతో రాంకీ సంస్థ భూ అక్రమాలకు, మోసాలకు, చట్ట ఉల్లంఘనలకు పాల్పడిందని పేర్కొన్నారు. రెండు నెలలుగా రాంకీ మోసాలు బట్టబయలవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. రైతులు, ప్రజా సంఘాలు వీఆర్‌వో, ఎంఆర్‌వో, జాయింట్ కలెక్టర్ మొదలు సీసీఎల్‌ఏ వరకూ విజ్ఞాపనలిచ్చినా ఏ అధికారీ ఆ గ్రామాలకు వెళ్లి పరిశీలించలేదని పేర్కొన్నారు. ఈనెల 9న చిట్యాల ఎస్ఐకి నష్టపోయిన రైతులు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని తెలిపారు. భూదందాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయని తెలిపారు. భూ కబ్జాలు, భూ దందాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా ఉండి తెలంగాణ సమాజానికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని ఆ మూడు గ్రామాల రైతులకు న్యాయం చేయాలని కోరారు.

డిమాండ్లు..

- రాంకీ సంస్థ కొనుగోలు చేసిన భూ రికార్డులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.
- బినామీ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆ భూముల హక్కులన్నీ వాస్తవ పట్టాదారులకు బదలాయించాలి.
- బినామీ రిజిస్ట్రేషన్లు, మోసాలకు పాల్పడ్డ రాంకీ సంస్థపై ల్యాండ్ గ్రాబింగ్, 420, ఆస్తుల నష్టం లాంటి సెక్షన్లతో కేసులు పెట్టి వెంటనే యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి.
- రాంకీ రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న ఎకరాకు రూ.9.50 లక్షల విలువను రైతులకు ఇవ్వాలి.
- నాడు చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన రేణుక అలియాస్ ఎల్లమ్మపై కేసు పెట్టాలి.
- రాంకీ భూముల వ్యవహారం పూర్తయ్యే వరకూ ఆ భూములన్నీ రైతులకే చెందేటట్టుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ఎలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాల భూముల సర్వేను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి.

ఐటీ రిటర్న్స్‌పై గందరగోళం?

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వ పెద్దల హడావుడి ప్రకటనల వెనుక అసలు ఉద్దేశమేమిటో అర్థమవుతుంది. ముందుగా ప్రధాని ప్రకటనపై సీబీడీటీ ఇచ్చిన వివరణ ఇలా ఉన్నది. .2017 ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 5 వరకు ఐటీ రిటర్న్ సంఖ్య 2.79 కోట్లు. ఇదే కాలానికి గతేడాది(2016లో) 2.23 కోట్లు. తేడా 56 లక్షలు. అంటే గతేడాదితో పోలిస్తే ఈ కాలానికి 56 లక్షలమంది అదనంగా చేరారన్నది లెక్క.. అయితే, ఇందులో చెప్పుకోదగిందేమీలేదు. ఎందుకంటే ఐటీ రిటర్న్ ప్రతిఏటా పెరుగుతూనే ఉన్నాయి. ఇదే కాలానికి చూస్తే 2015లో ఐటీ రిటర్న్ సంఖ్య 2 కోట్లు. ఆ తర్వాతి ఏడాది(2016లో) 23 లక్షలు పెరిగాయి కదా..!


ఇక ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పిన 91 లక్షల విషయానికొస్తే..2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా చూస్తే అదనంగా తోడైన ఐటీ రిటర్న్ సంఖ్య అది. ఆర్థిక సర్వేలో చెప్పిన 5.4 లక్షలన్నది నోట్ల రద్దు జరిగిన 8, నవంబర్,2016 నుంచి 2017, మార్చి వరకు అదనంగా చేరిన ఐటీ రిటర్న్ అన్నది వివరణ.

అయితే, ఈ లెక్కలకు సంబంధించి కాస్త గతంలోకి వెళితే మోడీ ప్రభుత్వంలోని పెద్దలు ఇంతగా దేశ ప్రజల్ని గందరగోళంలోకి ఎందుకు నెడుతున్నారో అర్థమవుతుంది. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనూ ఐటీ రిటర్న్ అనూహ్యంగా పెరిగాయని సీబీడీటీ గణాంకాలే చెబుతున్నాయి. 2006-07లో కేవలం 4 లక్షలు మాత్రమే ఉన్న ఐటీ రిటర్న్ సంఖ్య 2007-08లో 22 లక్షలకు పెరిగింది. అంటే 450 శాతం పెరిగాయి. ఆ తర్వాతి ఏడాది 2008-09లో 48.5 లక్షలకు ఆ సంఖ్య చేరింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 120 శాతం పెరుగుదల. 2009-10లో 52.5 లక్షలుండగా, 2010-11లో 91.56 లక్షలుగా నమోదైంది. అంటే 74 శాతం పెరుగుదల. ఆ తర్వాతి ఏడాది 2011-12లో 164.12 లక్షలు. అంటే 79 శాతం పెరుగుదల. యూపీఏ చివరి ఏడాది 2013-14లో 2 కోట్ల 97 లక్షలకు ఐటీ రిటర్న్ సంఖ్య చేరిందన్నది గమనార్హం. ఇప్పుడు మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ హయాంలో అనూహ్యమైన పెరుగుదల ఏమీ నమోదు కాలేదని ఈ అధికారిక లెక్కల్ని పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

సెన్సెక్స్ ▼271	నిఫ్టీ ▼67	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,525	9,837	64.14	రూ. 29,689	రూ. 42,200

శుక్రవారం మార్కెట్లు ముగింపునాటికి





కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



అంతర్జాతీయ సంకేతాలపై మార్కెట్ల దృష్టి..!

దేశీయ అంశాలూ ముఖ్యమే

- వినాయక చవితి సందర్భంగా శుక్రవారం సెలవు
- స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ నాలుగు రోజులే

నవతెలంగాణ, వాణిజ్యవిభాగం: దేశీయ స్టాక్ మార్కెట్లకు ఈ వారం అంతర్జాతీయ అంశాలు కీలకంగా నిలువనున్నాయి. అలాగే దేశీయంగా ఇన్ఫోసిస్ పరిణామాలతో పాటు చివరిదశకు చేరిన కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, వర్షాపాత నమోదుపై మదుపర్లు దృష్టిసారించనున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటితో పాటు ప్రపంచ మార్కెట్ల పోకడ, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, డాలరుతో రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు వంటి తదితర అంశాలు కూడా స్టాక్ మార్కెట్లను నిర్దేశిస్తాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతవారం విదేశీ అంశాలకు తోడు శుక్రవారం (18న) ఇన్ఫోసిస్ చైర్మెన్ పదవి నుంచి విశాల్ సిక్కా హఠాత్తుగా వైదొలగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 271 పాయింట్లు నష్టపోయి 31,524 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 67 పాయింట్లు క్షీణించి 9,837 వద్ద స్థిరపడింది. వినాయక చవితి సందర్భంగా ఈ నెల శుక్రవారం (25న) స్టాక్ మార్కెట్‌కు సెలవు. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఈ వారం నాలుగురోజులకే పరిమితం కానున్నది.

ఇన్ఫీ అంశాలకు ప్రాధాన్యం..

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ రూ.13,000 కోట్ల విలువైన షేర్ల బైబ్యాక్‌కు బోర్డు ఆమోదం



తెలిపిన సంగతి తెలిసిందే. కాగా షేరు ఒక్కింటికి రూ.1,150 చొప్పున ధర చెల్లించి తిరిగి కొనుగోలు చేపట్టనున్నట్టుగా ప్రకటించింది. విశాల్ సిక్కా రాజీనామా నేపథ్యంలో ఇన్ఫీ షేరు ధర శుక్రవారం 932 వద్ద ముగిసింది. ముగింపు ధరతో పోలిస్తే ప్రస్తుతం సంస్థ ప్రకటించిన బైబ్యాక్ ధరను పోలిస్తే దాదాపు 25శాతం ప్రీమియంతో షేర్లను తిరిగి కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నట్టుగా తెలుస్తోంది. కాగా అమెరికా స్టాక్ మార్కెట్లలోనూ ఇన్ఫోసిస్ లిస్టయింది. దీంతో ఈ టెక్ దిగ్గజానికి మరో భారీ షాక్ తగిలినట్టు అయ్యింది. విశాల్ సిక్కా సీఈవో, ఎండీ పదవులకు అనూహ్యంగా రాజీనామా చేసిన నేపథ్యంలో అమెరికాలోని అక్కడి న్యాయ సంస్థలు న్యాయవిచారణకు దిగాయి. ప్రధానంగా ఫెడరల్ చట్టాలన ఈ దేశీయ సాఫ్ట్‌వేర్ సంస్థ అధికారులు, డైరెక్టర్లు ఉల్లఘించిన ఆరోపణల నేపథ్యంలో ఇన్వెస్టర్ల తరుపున బ్రోన్‌స్టెయిన్, జివెర్ట్జ్ అండ్ గ్రాస్మాన్, రోసెస్ న్యాయ సంస్థ, పోమెరాంట్జ్ న్యాయ సంస్థ గోల్డ్ బర్గ్ పీసీలు ఈ విచారణ చేపట్టాయి. దీనికితోడు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) కూడా ఇన్ఫోసిస్ విషయమై అసహనం వ్యక్తం చేసినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం నాటి మార్కెట్‌లో ఈ అంశాలకు ప్రాధాన్యం సంతరించుకోనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే బైబ్యాక్ ఆఫర్ కొంత ఊరటనిచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

చివరి దశ ఫలితాలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సర జూన్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే వారం క్యాస్ట్రోల్ ఇండియా, జిల్లెట్ ఇండియాతో పాటు పలు ఇతర సంస్థలు ఏప్రిల్-జూన్ ఆర్థిక ఫలితాలు వెల్లడించనున్నాయి. దీంతో పాటు రుతుపవనాల విస్తరణ మార్కెట్ సెంటిమెంటుకు కీలకంగా నిలువనుంది. అలాగే బ్యాంకింగ్ రంగంలో నానాటికి పెరిగిపోతున్న మొండిబాకీల అంశంపై... ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరింత మూలధనం అందించాల్సిన అవసరముందని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఉర్జిత్ పటేల్ అభిప్రాయం వ్యక్తం చేసిన తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే వారం బ్యాంకింగ్ రంగ షేర్లు స్టాక్ మార్కెట్లకు దిశనిర్దేశం చేయనున్నట్టు నిపుణులు పేర్కొన్నారు.

విదేశీ అంశాలు కీలకమే..

అమెరికా- ఉత్తర కొరియా మధ్య తలెత్తిన యుద్ధ వాతావరణ తొలగినప్పటికీ, అమెరికాలోని టాప్ సీఈవోల రాజీనామాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు వ్యూహాత్మక వ్యాపార సలహా కౌనిల్స్‌ళ్లను రద్దు చేయడం, స్పెయిన్‌లో ఉగ్రదాడులు, ఫెడ్ రిజర్వు కీలక వడ్డీ రేట్ల పెంపుపై వెనక్కి తగ్గడం, అలాగే ఆగస్టు నెలకు చెందిన నిక్కి ఫ్లాష్ జపాన్ తయారీ పీఎంఐ గణంకాలను మార్కిట్ ఎకనామిక్స్ ఈ వారం ప్రకటించనుంది. జులైలో ఇది 52.1శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో మార్కెట్లకు ఈ అంశాలు కీలకంగా మారనున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇన్ఫీ కొత్త సీఈవో ఎంపిక అంత సులువు కాదు!

పరిశ్రమ వర్గాలు, నిపుణుల విశ్లేషణ

న్యూఢిల్లీ: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ కొత్త ముఖ్య కార్యానిర్వహణధికారి (సీఈవో) కోసం శోధించడం అంతా సులువైన పని కాదని పరిశ్రమల వర్గాలు, నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇన్ఫీ సీఈవో, ఎండీ పదవి నుంచి విశాల్ సిక్కా హఠాత్తుగా వైదొలగడంతో భారత సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ బాధ్యతలను తాత్కాలికంగా యు.బి.ప్రవీణ్‌రావుకు ఇన్ఫోసిస్ బోర్డు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే కంపెనీలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి, మార్గ నిర్దేశనం, వ్యూహరచన చేయడానికి శాశ్వత ఎండీ, సీఈవో ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో శాశ్వత సీఈవో ఎవరన్న అంశం పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ అత్యున్నత పదవికి కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం సాధారణ విషయం కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. 'ఎలాంటి ఆధారాలు లేని, తప్పుడు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు కొనసాగుతూ ఉంటే నేను నా బాధ్యతలను ఎలా నిర్వర్తించగలను. చాలా అంతర్మథనం చెందాకే నేనే రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చాను' అంటూ ఇన్ఫోసిస్ సీఈవో పదవికి సిక్కా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో)గా ఉన్న ప్రవీణ్‌రావు తాత్కాలిక సీఈవోగా మార్చి 31, 2018 వరకూ ఆ హోదాలో కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త సీఈవో ఎంపిక ప్రక్రియ కోసం ఇటు అంతర్గతంగా.. అటు అవతలి వ్యక్తుల కోసం శోధించాల్సి ఉండనుంది. ప్రస్తుత తరుణంలో సమర్థుడైన వ్యక్తికోసం ఇన్ఫోసిస్ వెతకవచ్చని.. అది బయట వ్యక్తి కూడా అయిండవచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో సంస్థలో ఉన్న వ్యక్తిని సీఈవో పదవికి ఎంపిక చేసే ఆలోచనను కొట్టి పారేయలేమని వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త సీఈవో కోసం శోధించడం కొంత కష్టమైన పనే అని ఐటీ రంగానికి చెందిన నిపుణులు ప్రమోద్ భాసిన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కొత్త సీఈవో ఎంపిక ప్రక్రియను ఇన్ఫీ వేగవంతం చేయాలని, అదే సమయంలో వ్యాపారాభివద్ధి కొనసాగించడం అవసరమని మరో నిపుణుడు గణేష్ నటరాజన్ పేర్కొన్నారు. విశాల్ సిక్కా సంస్థను వీడవచ్చని, ఈ పరిస్థితుల్లో కంపెనీలో నెలకొన్న పరిస్థితులు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనగల వ్యక్తిని వెతికి పట్టుకోవాలని అన్నారు. 'అనుభవం ఉన్న, వాతావరణాన్ని అర్థం చేసుకోగల సీఈవో మాత్రమే



పరిస్థితిని అంచనా వేయగలడు. అలాంటి పాత్రను పోషించడానికి భారత్‌తో పాటు విదేశాల్లో తగినంత మంది ఉన్నారు. సవాళ్లను స్వీకరించి సీఈవోగా మారడానికి చాలామంది ఉన్నారని తెలిపారు.

ఐపీవో బాటలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్..

- ఇప్పటికే రెండు ప్రభుత్వ రంగ బీమా కంపెనీల దరఖాస్తు

HDFC Life Sar utha ke jiyo!

న్యూఢిల్లీ : హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్) ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) కోసం అనుమతులు కోరుతూ మార్కెట్, సెక్యూరిటీ నియంత్రణ రెగ్యులేటరీ అయినా సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకుంది. గడిచిన మూడు వారాల్లో ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీతో కలుపుకొని మరో రెండు ప్రభుత్వ రంగ బీమా సంస్థలు ఇప్పటికే ఐపీవో కోసం దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ మూడింటి విలువ దాదాపు రూ.20,000 కోట్లు ఉంటుందని అంచనా. దీంట్లో ప్రభుత్వ రంగ 'జనరల్ ఇన్సూరెన్స్' కంపెనీ అయినా 'న్యూ ఇండియా అస్యూరెన్స్' కంపెనీ లిమిటెడ్‌'తో పాటు మరో ప్రభుత్వ రంగ బీమా కంపెనీ 'జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' ఇప్పటికే ఐపీవోకు వచ్చేందుకు సెబీకి దరఖాస్తులను సమర్పించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం ఐపీవో కోసం హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ తన ప్రతిపాదిత పత్రాన్ని సెబీకి అందించింది. ఈ బీమా కంపెనీలో ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీకి 61.5 శాతం వాటా ఉంది. మరో 35 శాతం వాటా బ్రిటిష్ చెందిన స్టాండర్డ్ లైఫ్ కలిగి ఉంది. ఈ ఐపీవోలో 299.8 మిలియన్ షేర్లను విడుదల చేయాలని ఆ కంపెనీ నిర్ణయించుకుంది. గత నెలలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఐపీవోకి సంబంధించిన దరఖాస్తు పత్రాలను సెబీకి అందజేసిన సంగతి తెలిసిందే.

సేవింగ్స్ వడ్డీరేట్లకు మరో రెండు బ్యాంకులు కోత!



ముంబయి: సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ మరో రెండు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంకు కూడా సేవింగ్ అకౌంట్ డిపాజిట్లపై అందించే వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో రూ.50 లక్షల కన్నా తక్కువున్న డిపాజిట్లపై వడ్డీరేట్లు 3.5 శాతానికి పడిపోయాయి. రూ.50 లక్షలు ఆపై ఉన్న డిపాజిట్లకు వడ్డీరేట్లను యథాతథంగా 4 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆ బ్యాంకు తెలిపింది. ఈ వడ్డీరేట్లు ఆగస్టు 19 నుంచి అమల్లోకి వచ్చినట్టు వెల్లడించింది. కాగా యూనియన్ బ్యాంకు కూడా సేవింగ్ ఖాతాలపై అర్థశాతం వడ్డీ రేట్లకు కోత పెట్టినట్టు తెలిపింది. రూ.25లక్షల డిపాజిట్ల వరకు మూడున్నర శాతం వడ్డీ చెల్లించనున్నట్టు పేర్కొంది. రూ.25 లక్షలు పైబడిన వాటిపై యథాతథ వడ్డీ రేటును అందించనున్నట్టు తెలిపింది. ఎస్‌బీఐతో మొదలైన సేవింగ్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు ఒక్కో బ్యాంకు ఈ కోతలకు వరుస కడుతున్నాయి. ఇప్పటికే బ్యాంకు ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, యాక్సిస్ బ్యాంకు, యెస్ బ్యాంకు, కర్నాటక బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడా వడ్డీరేట్లను తగ్గించాయి.

తెలంగాణాకు.. ఐఏ'ఎస్'

- రాష్ట్రానికి వచ్చేందుకు పలువురి ఆసక్తి
- భౌగోళిక స్థితితోపాటు పరిపాలనాపరమైన వెసులుబాటే కారణమా..?
- విభజన నేపథ్యంలో 32 మందిని కేటాయించిన కేంద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్).. ఈ సర్వీసెస్‌కు చెందిన పలువురు అధికారులు తెలంగాణాలో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారా..? అంటే అవుననే అంటున్నాయి ఉన్నతాధికారవర్గాలు. ఇక్కడి భౌగోళిక పరిస్థితులతోపాటు పరిపాలనాపరంగా కొన్ని వెసులుబాట్లు ఉండటమే దానికి కారణమని ఆయా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణాకు మొత్తం 32 మంది ఐఏఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వీరిని ఒకేసారి కాకుండా దఫదఫాలుగా రాష్ట్రానికి పంపిస్తామని ఆ సందర్భంగా తెలిపింది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఇక్కడున్న ఐఏఎస్‌లను జిల్లా కలెక్టర్లు, శాఖల డైరెక్టర్లు, కమిషనర్లుగా సర్దుబాటు చేసింది. సీనియర్లు ముఖ్య కార్యదర్శులుగా సేవలందిస్తున్నారు. ఇదే సమయం లో అదనంగా 20 మంది ఐఏఎస్‌లను రాష్ట్రానికి కేటాయించాలని సీఎం కేంద్రాన్ని కోరారు. ఈ నేప థ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఏపీకి కేటాయించబడిన వారితోపాటు మరికొందరు ఐఏఎస్‌లు తెలంగాణాలో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారని సమాచారం. మంత్రులతో సమానంగా ఐఏఎస్‌లకు వాహన సదుపాయం, ఇతరత్రా సౌకర్యాలు కల్పించటం తోపాటు కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛనిస్తుండటం కూడా ఇందుకు కారణమని తెలిసింది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సీఎస్‌గా డాక్టర్ రాజీవ్‌శర్మ నియమితులయ్యారు. ఆయన పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా రెండుసార్లు పొడిగించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా మోడీతో మాట్లాడి మరీ ఒప్పించారు. ఆ తర్వాత ప్రదీప్‌చంద్ర, ఆయన తర్వాత ఎస్పీ సింగ్ సీఎస్‌లుగా నియమితులైనప్పటికీ రాజీవ్‌శర్మను మాత్రం సీఎం వదులుకోలేదు. ప్రభుత్వ సలహాదారు గా నియమించి కీలక స్థానంలో కూర్చోబెట్టారు. ఎస్పీ సింగ్ సీఎస్‌గా ఉన్నప్పటికీ రాజీవ్‌శర్మ ఇచ్చే సూచ నలు, సలహాలకే సీఎం ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నార ని సమాచారం. గతంలో కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన రాజీవ్‌శర్మ.. ఇప్పుడు కూడా ఆ సంబంధాలను కొన సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు కేంద్రం నుంచి నిధులను రాబట్టటం, వాటిని ఖర్చు చేయటం తదితరాంశాలను రాజీవ్‌శర్మే ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని సమాచారం. కేంద్రంతో ఉన్న సంబంధాలరీత్యా ఇక్కడకు ఐఏఎస్‌లను రప్పించే బాధ్యతను కూడా సీఎం రాజీవ్‌శర్మకే అప్పగించారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులతో సంబంధం లేకుండా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) ఉన్నతాధికారులే వాటిపై సమీక్షలు, సంప్ర దింపులు కొనసాగిస్తున్నారు. ఈవిధంగా సీఎంవో నుండి కలె క్టర్లకు డైరెక్టుగా ఆదేశాలు వెళుతున్నాయని తెలిసింది. మరోవైపు తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాల అభివృద్ధి నిధిని ఏర్పాటు చేశారు. వీటిపై సర్వాధికారాలు కలెక్ట ర్లకు కట్టబెట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో పైస్థాయిలో సీఎంవో, కిందిస్థాయిలో కలెక్టర్లు కార్య కలాపాలు నిర్వర్తిస్తుండగా మధ్యలో ఉన్న ముఖ్య కార్యదర్శులు, డైరెక్టర్లు, కమిషనర్లు నిమిత్తమాత్రులు గా మిగిలిపోతున్నారనే వాదనలు వినబడుతున్నా యి. అయితే ఇప్పుడు రాష్ట్రంలో పనిచేసేందుకు కొంతమంది ఐఏఎస్‌లు ఇష్టపడటానికి కూడా ఇదే కారణమని తెలిసింది. శాఖలకు డైరెక్టర్లుగా, కమిష నర్లుగా ఉంటే ఎలాంటి పని ఒత్తిడి లేకుండా ఉండొ చ్చని వారు భావిస్తున్నట్టు సమాచారం.

ప్రాధాన్యత లేమి...

ఇలాంటి పద్ధతుల వల్ల వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, డైరెక్టర్లు, కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులకు ప్రభుత్వంలో ఎలాంటి ప్రాధా న్యతా లేకుండా పోతున్నదనే వాదనలు వినబడుతు న్నాయి. శాఖల్లో కీలకంగా పనిచేస్తూ పథకాలు, కార్య క్రమాల అమల్లో క్రియాశీలకంగా వ్యవహరించే ప్రిన్సి పల్ సెక్రటరీలను ఈ విధంగా నిర్వీర్యం చేయటం సరికాదనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే శాఖలపై సమీక్షల సందర్భంగా వారు ముఖ్యమంత్రికి ఎలాంటి సమాధానాలు, వివరణ లివ్వలేకపోతున్నారని సమాచారం.

27,28న సంగారెడ్డిలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 27, 28వ తేదీల్లో సంగారెడ్డిలో నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలిపింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఉపాధ్యాక్షులు జీఎన్ నాగరాజన్, భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఐద్వా జాతీయ నాయకురాలు టి జ్యోతి, ఎన్‌పీడీఈ జాతీయ అధ్యక్షులు ఎం జనార్ధన్‌రెడ్డితో పాటు 32 జిల్లాల నుండి 350 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. వెల్లడించింది. ఆదివారం ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లు, సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. బస్సు పాసులను మెట్రో, హైటెక్ బస్సులలో అనుమతించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు పెన్షన్ ఇస్తున్నామన్న నేపథ్యంలో అంత్యోదయ కార్డులను రద్దు చేయడం తగదన్నారు. రద్దు చేసిన కార్డులను పునరుద్ధరించి, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాజకీయ రంగంలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వికలాంగుల పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలన్నారు.

27న చలో సంగారెడ్డి

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకుగాను ఈ నెల 27న చలో సంగారెడ్డి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అడివయ్య తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గోరెంకల నర్సింహ, ఆర్ వెంకటేశ్, కె వెంకటేశ్, సాయమ్మ, మల్లయ్య, గోపాల్, కవిత, రాజు, నాగలక్ష్మి, రంగారెడ్డి, ఉపేందర్, లింగయ్య, రమేష్, చంద్రమోహన్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ పాలనతో లౌకికత్వానికి ప్రమాదం

రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకల్లో ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో నేడు లౌకికత్వానికి ప్రమాదం ఏర్పడిందని, భిన్నత్వంలో ఏకత్వంతో బతికే దేశ ప్రజల మధ్య బీజేపీ ప్రభుత్వం చిచ్చులు పెడుతోందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రాజకీయ స్వార్ధ ప్రయోజనాలు పొందేందుకు కుట్రలు చేస్తోందన్నారు. బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేస్తుందని విమర్శంచారు. ఏమి తినాలో, ఏ బట్టలు కట్టుకోవాలో కూడా వారే నిర్ణయించి ప్రజలను నిర్బంధాల మధ్య బతికేలా చేస్తుందన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమాజిగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళుల్పించారు. మాజీ ఎంపీ హనుమంతరావు నిర్వహించిన సద్భావన పరుగును కూడా ప్రారంభించారు. అనంతరం గాంధీభవన్‌లో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సేవాదళ్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్ ఆవరణలో మొక్కలు నాటారు. తరువాత ప్రకాశం హాల్‌లో నేషనల్ సాలిడారిటీ కమిటి చైర్మెన్ అఫ్జలుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలను విభజించి పాలించి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. నేడు పసి పిల్లలు ప్రాణాలు పోతున్నా కూడా బీజేపీ నేతలు స్పందించడం లేదని, కానీ ఆవుల గురించి ఆందోళన చెందుతున్నారని, ఆవులకు ఉన్న ప్రాధాన్యత పసి పిల్లల ప్రాణాలకు లేకుండా పోతుందన్నారు. రాజీవ్ గాంధీ దేశంలోనే అత్యుత్తమ ప్రధానిగా గుర్తింపు పొందారని ఆయన ఆశయాలను ఆచరించడం దేశ ప్రజలకు చాల ముఖ్యమని అన్నారు.

20న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చలో సెక్రటేరియట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం అమలు కోసం ఈ నెల 23న చలో సెక్రటేరియట్ ఆందోళనను చేపట్టన్నుట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ ఆందోళనలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డైలీవైజ్ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫెరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వెంకటేశ్, జె కృష్ణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీఓ నెంబర్ 16 అమలుకు ఎదురవుతున్న సమస్యలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన జీఓ నెంబర్ 16ను హైకోర్టు నిలుపుదల చేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే కోర్టులు కొట్టి వేస్తున్నాయని, ఇక ప్రభుత్వం ఏం చేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ నిస్సాహాయత వ్యక్తం చేయడం సరికాదన్నారు. నిరుద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య ప్రభుత్వం తగాదాలు సృష్టిస్తున్నదన్నారు. ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెనే.!

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే 'సకల ఉద్యోగుల సమ్మె' నిర్వహిస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీనికి 15రోజుల గడువునిచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో ఉద్యోగుల జేఏసీ సమావేశం బోయ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఎస్ఎస్ఏలోని ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమానపనికి సమానవేతనం ఇవ్వాలనీ, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, గౌరవఅధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, వెంకటరంగారెడ్డి, రవికుమార్, ప్రవీణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సాయి, దామోదర్, సరిత, వెంకన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో నేడు 'సేవ్ ధర్నాచౌక్' పోరు

- జంతర్‌మంతర్‌లో ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ ధర్నా
- రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు : చాడ వెంకట్‌రెడ్డి
- రాష్ట్ర సర్కారు వైఖరి మారాలి :ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

హైదరాబాద్‌లోని ధర్నాచౌక్(ఇందిరాపార్క్) పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో నేడు ధర్నా చేపడుతున్నట్టు ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను ధర్నా అనంతరం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నివేదిస్తామని వివరించారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న ఈ ధర్నాకు ప్రజాస్వామ్యశక్తులు, జేఏసీ నేతలు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు కలిసొచ్చి మద్దతివ్వాలని కోరారు. ఇక ఈ ధర్నాకు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీతో పాటు సీపీఐ(ఎం), సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. సోమవారం నాటి ధర్నాచౌక్ పరిరక్షణ పోరు నేపథ్యంలో ఆదివారం చాడ వెంకట్‌రెడ్డి, ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇందిరాపార్క్‌ను ధర్నాలు లేని చౌక్‌గా మార్చేందుకు కేసీఆర్ సర్కారు కుట్ర పన్నిందని, ప్రస్తుతం ధర్నాచౌక్‌ను పోలీసుల పహారాలో ఉంచిందని విమర్శించారు. ధర్నాచౌక్ విషయంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఢిల్లీలో వినిపించేందుకు జంతర్‌మంతర్‌లో ధర్నా చేపడుతున్నట్టు వివరించారు. ప్రజాస్వామ్య గొంతుకను నొక్కుతున్న వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్ర సర్కారు ఆర్టికల్ 19ని ఉల్లంఘిస్తున్న వైనాన్ని హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ సైతం ఇందిరాపార్క్‌లో ధర్నాలు నిర్వహించిందని ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు చెప్పారు. కానీ రాష్ట్రం ఏర్పాటయ్యాక టీఆర్ఎస్ సర్కారు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఈ ధర్నాలో ఉస్మానియా, జేఎన్‌యూ తదితర వర్శిటీ విద్యార్థులు సైతం పాల్గొననున్నారని తెలిపారు.

అకాడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించాలి: టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా, నేటికీ అకాడమిక్ క్యాలెండర్ విడుదల చేయకుండా విద్యాశాఖ కాలయాపన చేయడం తగదని టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. వెంటనే అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసి, విద్యాసంవత్సరాన్ని గాడిన పెట్టాలని డిమాండ్ చేసింది.

ఆదివారం హైదరాబాద్‌లోని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అకాడమిక్ క్యాలెండర్ లేకపోవడంతో జిల్లా కలెక్టర్లు ప్రస్తుతం జరుగుతున్న 3ఆర్ కార్యక్రమాన్ని కాదని ఇతర పనులు అప్పగిస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి కొండల్‌రెడ్డి, వి మనోహరరావు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని కొనసాగించాలనీ, ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం రవీందర్, శ్రీనివాస్, నాయకులు అశోక్‌కుమార్, పూర్ణచందర్‌రావు, గోపాల్‌రెడ్డి, కె వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిఘటన తప్పదు

భారతదేశంలో దళిత, అభ్యుదయ సమాజం రూపన్‌వాలా ఇచ్చిన నివేదికకు ఏ మాత్రం విశ్వసనీయతని ఇవ్వరు. దానికి ఎలాంటి ప్రాధాన్యత కూడా లేదు. పైగా ఒక కుట్రపూరిత నివేదిక ఇచ్చాడనే పేరుతో చరిత్రలో పేరు సంపాదించుకునేందుకు రూపన్‌వాలా కమిషన్ అవకాశం ఇచ్చింది. ఇకపోతే యూనివర్సిటీల్లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన సూచనలు చేసే బాధ్యత రూపన్‌వాలాకు ఇవ్వటం ఒక శోచనీయ ఘటన. జరిగిన నేరాన్నే వక్రీకరించే ఇంకా జరగబోయే ఘటనలకు పరిష్కారం చూపటం గొప్ప అమాయకత్వమే అవుతుంది. రోహిత్ మృతికి కారణమైన వీసీ అప్పారావు, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఏబీవీపీ నాయకులు సుశీల్‌లను ఎస్సీ, ఎస్టీ కేసుల నుంచి తప్పించేందుకు తెరలేపిన నాటకంలో ఈ రూపన్‌వాలా కమిషన్ నివేదిక ఒక స్క్రీన్‌ప్లే మాత్రమే.

కాడిగల్ల భాస్కర్

విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్‌కుమార్ రూపన్‌వాలాతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ తన నివేదికని మానవ వనరుల అభివృద్ధి శాఖకు నివేదించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దళిత రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల హత్యకు దారితీసిన కారణాలు, యూనివర్సిటీల్లో ఇలాంటి ఘటనల నివారణకు తీసుకోవాల్సిన చర్యలని సూచిస్తూ రిపోర్టు అందజేయడం జస్టిస్ రోపన్‌వాలా కమిషన్ లక్ష్యాలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన నిర్దేశిత మూడు మాసాల సమయంకన్నా అదనంగా మరో ఏడాది సమయం తీసుకొని తయారు చేసిన రిపోర్టు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, దాని మార్గనిర్దేశకురాలు ఆర్ఎస్ఎస్ నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చిందనే చెప్పుకోవాలి. సహజంగా జరిగిన విషయాన్నే నివేదించడం, తక్కువ కాలంలో సులభంగానే జరిగిపోయింది. కానీ వాస్తవాలతో పని లేకుండా ముందుగానే నిర్దేశించబడ్డ లక్ష్యాలకు అనుగుణంగా రిపోర్టులు తయారు చేయడం కొంత సమయం ఎక్కువగానే తీసుకుంటుంది. తన నిర్దేశిత కాలంకన్నా ఎక్కువ సమయాన్ని తీసుకున్న రూపన్‌వాలా రోహిత్ మరణం అనంతరం ముందుకు వచ్చిన రెండు పరస్పర విరుద్ధ వాదనల్లో ఒక శిబిరం తెచ్చిన వాదనలకి చట్టబద్ధత కల్పించేందుకు మాత్రమే శక్తివంచన లేకుండా కృషి చేసినట్టుగా ఉన్నది.

బీజేపీ అధికారానికి వచ్చాక అభ్యుదయ వామపక్ష, దళిత, హక్కుల ఉద్యమాల స్ఫూర్తిని కొనసాగిస్తున్న యూనివర్సిటీల్లోని చైతన్యాన్ని దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అందులో భాగంగానే యూనివర్సిటీల్లో తన భావజాల అనుయాయులని వైస్ చాన్సులర్లుగా నియమించుకొని ముందుకు సాగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ అప్పారావు ద్వారా ఈ గొంతులని నొక్కేయజూసింది. ఈ క్రమంలో వేముల రోహిత్, అతని మిత్రుల మీద తీవ్ర నిర్బంధం ప్రయోగించి క్రమ శిక్షణా చర్యలతో 'వెలివాడ'ని సృష్టించాడు అప్పారావు. యూనివర్సిటీలో భావప్రకటన స్వేచ్ఛని అణిచివేసేందుకు తప్పుడు అభాండాలు వేశారు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ హెచ్ఆర్డీ మంత్రికి ఉత్తరాలు రాయటం విద్యార్థులని తీవ్రవాదులుగా చిత్రీకరించటం, జాతి వ్యతిరేకులుగా సృష్టించడం హెచ్ఆర్డీ శాఖ, వీసీలు కలిసి చేసిన కుట్ర ఫలితంగా రోహిత్ వేముల ఆత్మహత్యకు దారితీసింది. అందువల్ల ఇది వ్యవస్థీకృత హత్యే. ఈనేపథ్యంలో బండారు దత్తాత్రేయ, వీసీ అప్పారావు, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఏబీవీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదైంది. కేంద్ర ఎస్సీ కమిషన్, స్థానిక జిల్లా కలెక్టర్లు రోహిత్ దళితుడే అని ధృవీకరించాయి. ఈ ధృవీకరణతో బీజేపీ గొంతులో వెలక్కాయపడింది. నాటి నుంచి ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీలు రోహిత్ దళితుడు కాదనే పాటని ఎత్తుకున్నాయి. కేంద్రంలోని అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ స్థానిక కలెక్టర్‌పై వత్తిడి చేసి తిమ్మిని బమ్మి చేసి మళ్లీ రోహిత్ దళితుడు కాదని తప్పుడు నివేదికలు తయారు చేయించారు. ఇందుకు ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వం కూడా తమవంతు సహకారం అందించింది.





ఈ తప్పుడు నివేదికలకి అధికార యుతంగా ఒక తప్పుడు ముగింపు పలకటం కోసం ఏర్పాటు చేసిన కమిషన్ అశోక్‌కుమార్ రూపన్‌వాలా ఏకసభ్య కమిషన్. సహజంగానే రూపన్‌వాలా తన ప్రభు భక్తిని చాటుకున్నారు. కమిషన్ నిర్ధారించిన తీరే అనుమానాలకు అవకాశం ఇస్తున్నది. రూపన్ వాలాకి బదులు మార్కేండేయ ఖట్జు, చంద్రకుమార్ లాంటి వాళ్లతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసే ధైర్యం బీజేపీకి ఉన్నదా? లేదు. కారణం కమిషన్ ఏర్పాటు పాలకుల ఉద్దేశమే ఒక కుట్ర పూరితమైనది. మగ నెమలి కన్నీరు తాగి ఆడ నెమలి గర్భం దాలుస్తుందనే బాపతు దగ్గర నుండి ఇంతకు మించి న్యాయాన్ని కోరుకోవటం అత్యాశే అవుతుంది. భారతదేశంలో దళిత, అభ్యుదయ సమాజం రూపన్‌వాలా ఇచ్చిన నివేదికకు ఏ మాత్రం విశ్వసనీయతని ఇవ్వరు. దానికి ఎలాంటి ప్రాధాన్యత కూడా లేదు. పైగా ఒక కుట్రపూరిత నివేదిక ఇచ్చాడనే పేరుతో చరిత్రలో పేరు సంపాదించుకునేందుకు రూపన్‌వాలా కమిషన్ అవకాశం ఇచ్చింది. ఇకపోతే యూనివర్సిటీల్లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన సూచనలు చేసే బాధ్యత రూపన్‌వాలాకు ఇవ్వటం ఒక శోచనీయ ఘటన. జరిగిన నేరాన్నే వక్రీకరించే ఇంకా జరగబోయే ఘటనలకు పరిష్కారం చూపటం గొప్ప అమాయకత్వమే అవుతుంది. రోహిత్ మృతికి కారణమైన వీసీ అప్పారావు, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఏబీవీపీ నాయకులు సుశీల్‌లను ఎస్సీ, ఎస్టీ కేసుల నుంచి తప్పించేందుకు తెరలేపిన నాటకంలో ఈ రూపన్‌వాలా కమిషన్ నివేదిక ఒక స్క్రీన్‌ప్లే మాత్రమే. న్యాయశాస్త్రంలో, జరిగిన సంఘటన మాత్రమే కాకుండా అందుకు ప్రోత్సహించిన అంశాలు అత్యంత ప్రాధాన్యత కలిగినవి. రోహిత్ మరణానికి దారితీసిన అంశాలన్నిటినీ పాతరేసి రోహిత్ బాధాతప్త హృదయంతో జరిగిన కర్కశత్వాన్ని విశాల హృదయంతో క్షమిస్తూ రాసిన ఉత్తరాన్ని ఆధారంగా చేసుకొని రోహిత్ మృతికి ఎవ్వరూ కారణం కాదు. ఆయనే ప్రాపంచిక పరిస్థితులతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, నివేదించడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు హైకోర్టు జస్టిస్‌తో కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమీ లేదు.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ పెద్ద చంద్రశేఖర్‌రావు గారు మౌన మొదటి నుంచి ప్రేక్షకుడిగానే ఉన్నారు. బీజేపీ ప్రభుత్వం కుట్రకి బంట్రోతులా వత్తాసు పలుకుతున్నాడు. ఆయన ఇప్పటికైనా రోహిత్ కేసుపై సక్రమైన పద్ధతిలో స్పందించాలి. తన పోలీసు రిజిస్టర్ చేసిన ఎస్సీ, ఎస్టీ కేసు ప్రకారం ముందుకు వెళ్లాలి. రోహిత్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తప్పుడు వ్యవహారం టీఆర్ఎస్‌కి తప్పకుండా చుట్టుకుంటుంది. ఎన్నికల ప్రచారం ఎంతో దూరంలో లేదు. రేపు దళితులకి అంత చేసిన, ఇంత చేసిన చెప్పుకునేటప్పుడు దళితులు ఈ విషయం మీ సభల్లో ముందు పెడితే ఏం సమాధానం చెబుతారు. రోహిత్ కేసు నేర్పుతున్న గుణపాఠాల్ని దళితులు స్వీకరించాలి. ఈ 70 ఏండ్ల స్వతంత్ర భారతం ఉదారవాద విధానాలతో దళితుల గొంతుకు కొంతైనా విలువనిచ్చింది. ఇక ముందు ఈ గొంతును నిర్ధాక్షిణ్యంగా అణిచివేస్తారు అనేందుకు రోహిత్ కేసు ఒక ఉదాహరణ. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఎస్సీ, ఎస్టీ కేసుకే ఇంతలా నీరుగారిస్తే ఇక ఎక్కడో మారుమూల రోజూ జరిగే ఎస్సీ, ఎస్టీ కేసుల పరిస్థితి ఏమిటి? రాజ్యం, నైతికత, అంగబలం, అర్థబలం అన్నీ ఒకవైపు నిలబడ్డప్పుడు చివరగా నీకు మిగిలిన ఆయుధం ప్రతిఘటించడమే. సమాజం ప్రతిఘటనకి సిద్ధం కావాలి.

సెల్ : 9550603889

'పెద్దింటికి చెందిన నువ్వు.. ఓ మాదిగ కులస్తురాలికి మద్దతుగా సాక్ష్యం చెబుతావా?' నీ సంగతి చెబుతాం..' అంటూ ఆమెపై కక్షగట్టారు. బంధువుల నుండి దూరంచేసి మానసికంగా కుంగదీశారు. అంతటితో ఆగకుండా శుభకార్యాలకూ అడ్డుతగిలారు. సొంత కూతురి పెండ్లికి ఎవర్నీ రానీయకుండా జరిమానా విధిస్తామంటూ హుకుం జారీచేశారు. తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసిన దళితురాలినీ ఒంటరి చేశారు. ఒక 'పెద్దింటి' ఆడపడుచును ఏకాకి చేసి, ఎదురు తిరిగిన దళిత మహిళపై అదే సామాజికవర్గంలో చిచ్చురగిల్చిన పెత్తందారుల ఆగడాలను చూడాలంటే మల్లారం వెళ్లాల్సిందే...

మాదిగకు అండగా నిలిచినందుకు...

ఒంటరైన అగ్రకుల మహిళ

తాళ్లపల్లి ప్రశాంత్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న క్షేత్రానికి కూతవేటు దూరంలో మల్లారం ఊరు. 2 వేల జనాభా ఉంటుంది. భర్తకు 15ఏండ్ల క్రితమే దూరమైన ఇందిరారెడ్డి అనే మహిళ మల్లారంలోని పుట్టింటి వద్దనే నివసిస్తోంది. తల్లిదండ్రులకు ఒకే కూతురు కావడంతో వారి ఆస్తికి పెద్ద దిక్కయ్యింది. 8 ఎకరాలు సాగుచేసుకుంటూ ఇందిరారెడ్డి తన ఇద్దరు కూతుళ్ల పెండ్లిండ్లు చేసింది. ఒంటరిగా ఉన్న ఆమె ఆరెకరాలను సాగుచేసుకుంటూ మరో రెండెకరాల భూమిని అదే గ్రామానికి చెందిన దళితురాలు కొంపెల్లి లక్ష్మికి కౌలుకిచ్చింది. అక్కడ్నుంచి సమస్య మొదలైంది. అగ్రకులస్తుల పక్కన ఓ దళిత కుటుంబానికి చెందిన మహిళ కౌలుకు సాగుచేయడం జీర్ణించుకోలేకపోయారు. దీంతో లక్ష్మి వేసుకున్న పొలం నారును రాత్రికి రాత్రే పీకేశారు. పొద్దున పొలానికెళ్లిన ఆమె తన పంటను చూసి కన్నీరుమున్నీరైంది. పీకేసిన నారును పొదల్లో గమనించగా.. దానికి కారణం వెంకట్‌రెడ్డి అని తెలిసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇందిరా కూడా జరిగింది జరిగినట్టు సాక్ష్యం చెప్పింది. కులం పేరుతో దూషించాడని నిజాన్ని నిర్భయంగా వెల్లడించడంతో తొమ్మిది మందిపై కేసులు నమోదయ్యాయి.



ఒంటరిగా ఉన్నందుకు...

కౌలుకిచ్చిన భూమి పక్కనే నారాయణరెడ్డికి సంబంధించిన మరో రెండెకరాలు ఉండేది. అదే గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి సోదరులకు విక్రయించాడు. కానీ భూముల హద్దులు సరి చూసుకోలేదు. ఈ ఏడాది ఇందిరా వద్ద కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో లక్ష్మి వరి నాట్లు వేసింది. పొలంలో తమ భూమి కూడా ఉన్నదని ఇద్దరు సోదరులు తరచూ గొడవకు దిగేవారు. కౌలుదారును పనిచేయకుండా అడ్డుకున్నారు. వారికి పనులకొచ్చే వారినీ బెదిరించసాగారు. పొలంలో నారు పీకేయగా.. పెద్దల ఆదేశం మేరకు మరుసటి ఉదయం ట్రాక్టర్‌లో పైరును ఊళ్లోకి తీసుకొచ్చి సమస్యను తెలిపారు. అయినప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. 'ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎవరికి చెప్పినా ఏం చేయలేరు' అంటూ ఆ సోదరులు తమను తాము సమర్థించుకున్నారు. లక్ష్మికి మద్దతుగా నిలిచినందుకు ఇందిరపైనా కక్ష పెంచుకున్నారు.

కుటుంబం బహిష్కరణ.. పెండ్లికీ అడ్డంకి

'మాదిగలకు మద్దతు చెప్పిన ఇందిరను ఎవరూ రానివ్వొద్దు. శుభకార్యాలకు పిలవద్దు. దిక్కరిస్తే రూ.20వేలు దండుగ విధిస్తాం' అని అగ్రకులస్తులు హుకుం జారీ చేశారు. మే 22న ఇందిర కూతురు పెండ్లికి బంధువులు రాకుండా పెత్తందార్లు అడ్డుకున్నారు. మేనమామ అయిన బద్దం వెంకట్‌రెడ్డి పెండ్లికి రాగా అతనికి రూ.20వేలు జరిమానా విధించారు. కులం కట్టుబాట్లను దాటితే ఎవరికైనా ఇదే శిక్ష అంటూ హెచ్చరించడంతో కొందరు పెండ్లికి హాజరుకాలేకపోయారు. దీంతో బంధువులకు దూరంగా ఇందిరా ఒంటరి జీవితాన్ని గడుపుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఇందిరకు మరో అవమానం ఎదురైంది. ఆమె సోదరి తన ఇంట్లో శుభకార్యానికి కార్డులు ఇచ్చేందుకు వచ్చింది. కానీ ఇందిర వస్తే తామెవరమూ రామంటూ ఆ సామాజికవర్గానికి చెందినవారు ఆంక్షలు పెట్టారు. చేసేదేం లేక 'ఫంక్షన్‌కు నువ్వురావొద్దు. వస్తే ఎవరూ రారు' అంటూ మొహం మీదనే ఇందిరకు చెప్పింది. పెత్తందార్ల ఆగడాలను తట్టుకోలేకపోయిన ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు కులపెద్దలపై కేసులు నమోదయ్యాయి.

దళితులనూ దూరం చేశారు..

కులం పేరుతో దూషించిన వారిపై ఫిర్యాదు చేసిన కొంపెల్లి లక్ష్మికి బాసటగా నిలవకుండా పెత్తందారీ సామాజిక తరగతికి చెందిన కొందరు కుట్ర పన్నారు. ఆమెకు మద్దతు చెబితే పనుల్లోకి రావొద్దంటూ బెదిరించారు. ఈనేపథ్యంలో బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు ఐద్వా రంగంలోకి దిగింది. ఈ నెల 16న పరామర్శించి వారిలో మనసికస్థైర్యాన్ని నింపింది. పెత్తందార్లను ధైర్యంగా ఎదుర్కొంటున్న వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించింది. ఈ ఘటనలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

ఎటూ వెళ్లడం లేదు : ఇందిరారెడ్డి, బాధితురాలు



నన్ను బంధువుల ఇండ్లకు వెళ్లనీయడం లేదు. నా కూతురు పెండ్లికి నా తమ్ముడు వెంకట్‌రెడ్డి వస్తే అతనికి రూ.20వేలు దండుగ వేశారు. నా అక్క పెండ్లికి నన్ను ఆహ్వానించకుండా అడ్డుకున్నారు. బంధువుల నుంచి వెలేసి ఒంటరిగా ఉన్న నన్ను మరింత ఇబ్బంది పెడుతున్నారు.

కులంపేరుతో దూషించారు : కొంపెల్లి లక్ష్మి, దళితురాలు



కౌలు తీసుకున్న పొలంలో వరినారును తొలగించారు. ఇదేంటని అడిగితే కులంపేరుతో ఇష్టమొచ్చినట్టు తిట్టారు. నా పొలంలో పనికొచ్చే వారినీ అడ్డుకుంటున్నారు. ట్రాక్టర్లను నిలిపివేశారు. ఎదురుతిరిగి ఠాణా మెట్లెక్కితే నాకు అండగా నిలవకుండా నా బంధువులను బెదిరిస్తున్నారు.



బాధితురాలికి అండగా ఉంటాం : ఎన్‌హెచ్.ఆశాలత, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు

సొంత సామాజిక వర్గం నుంచి దూరమైన ఇందిరకు మేము అండగా ఉంటాం. దళితురాలికి మద్దతు చెబితే ఇంతలా క్షోభకు గురి చేస్తారా? ఒంటరిగా ఉన్న ఆ మహిళను మరింత ఏకాకిని చేస్తారా? దీనిపై ఉద్యమిస్తాం. పెత్తందార్ల ఆగడాలను అడ్డుకుంటాం. బాధిత దళిత మహిళకూ భరోసాగా ఉంటాం. న్యాయం జరిగే వరకూ పోరాడుతాం.

సెల్ : 7013343728

జాతీయ జెండా సాక్షిగా వివక్ష...



దళిత, గిరిజన ప్రజాప్రతినిధులకు అవమానం - తహసీల్దార్‌కు ఫిర్యాదు

వనం నాగయ్య

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బైఏండ్లు పూర్తిచేసుకుని వారంరోజుల క్రితమే 71వ వేడుకలు ఘనంగా జరుపుకున్నాం.. కానీ ఏం లాభం. స్వాతంత్ర్యం దేశానికి వచ్చిందని చెప్పుకుంటున్నా ఇదే దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సామాజిక స్వాతంత్ర్యం మాత్రం నేటికీ రాలేదని జాతీయ జెండా సాక్షిగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో రుజువైంది. ఈనెల 15న ఈ రెండు జిల్లాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సాక్షాత్తూ గ్రామానికి మొదటి పౌరురాలుగా రాజ్యాంగబద్ధమైన హక్కు కలిగి ఉన్న సర్పంచ్‌లకే ఈ అవమానం చోటుచేసుకోవడం గమనార్హం. వారిద్దరూ గ్రామానికి సర్పంచ్‌లైనా వారు పుట్టింది దళిత, గిరిజన కులం కావడమే వారికి జరిగిన అవమానికి కారణమైంది. కేవలం కుల, వర్గ ప్రాతిపదికన చోటుచేసుకున్న ఈ ఘటనలో సర్పంచ్‌లు ఇద్దరూ కన్నీరు పెట్టుకున్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా సర్పంచ్‌లే కన్నీరు పెట్టుకుని తమకు జరిగిన అవమానా న్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మరో రకమైన అవమానంగా వారు భావిస్తు న్నారు. ఇదే నెలలో ఆరో తేదీన మంత్రి తుమ్మ ల నియోజకవర్గంలోని కూసుమంచి మండల కేంద్రంలో ఉపసర్పంచ్‌ను బోనాలెత్తే దగ్గర కొబ్బరికాయ కొట్టకుండా గ్రామపెద్దలే కొట్టి ఉత్సవాలను ప్రారంభించిన ఘటన మరువక ముందే ఇదే నియోజకవర్గంలో మరో ఘటన చోటుచేసుకోవడం జిల్లాలో అగ్రకుల పెత్తనానికి సజీవసాక్ష్యంగా నిలుస్తోంది.



అసలేం జరిగింది...?

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన సర్పంచ్ మాలోతు జ్యోతికి అవమానం జరిగింది. తొలుత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్పంచ్ మాలోతు జ్యోతి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. జాతీయ జెండాను ఎగురవేసే ప్రక్రియలో భాగంగా మొదట సర్పంచ్ జ్యోతి కొబ్బరికాయ కొట్టగా అనంతరం వార్డు సభ్యులు కొట్టారు. జాతీయ జెండాను ఎగరేసేందుకు సిద్ధమైన సర్పంచ్ జ్యోతిని వీఆర్ఓ పి.సత్యనారాయణ అడ్డుకున్నారు. సర్పంచ్ జ్యోతి నిబంధనల ప్రకారం నేనే జెండాను ఎగరేయాలని ఎంత వాదించినా వినకుండా వీఆర్ఓ పట్టుబట్టి మరీ జెండాను ఎగరేశారు. గిరిజన సర్పంచ్‌ను అయినందునే తనను జెండా ఎగుర వేయకుండా అడ్డుకున్నారని, వీఆర్ఓపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను జెండా ఎగుర వేయడం వెనుక ఇదే గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ హస్తం ఉందని అక్కడున్న వారు ఆరోపించారు. దీనిపై పలువురు వీఆర్వోను నిలదీయగా తనను ఉపసర్పంచ్ జెండావిష్కరణ చేయాల్సిందిగా పదేపదే ఒత్తిడిచేశారని తెలిపారు.

కన్నీటి పర్యంతమైన సర్పంచ్ జ్యోతి...

తనను గ్రామస్తులందరి ముందూ అవమాన పరిచి జెండాను ఎగురవేయకుండా చేసినందుకు సర్పంచ్ జ్యోతి కన్నీరు పెట్టుకున్నారు. తన అధికారాలను ఉపసర్పంచ్ కాలరాసి కేవలం తక్కువ కులంలో పుట్టానని అవమానానికి గురిచేశాడని సర్పంచ్ వాపోయింది. తనకు జరిగిన ఈ అవమానం మరే మహిళా సర్పంచ్‌కూ జరుగకూడదని ఆమె వాపోయింది. ఈసందర్భంగా ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తున్నట్టు తెలిపింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గ్రామ ప్రథమ పౌరురాలైన గిరిజన మహిళా సర్పంచ్‌ని జెండా ఎగరేయనీయకుండా అడ్డుకునేందుకు వీఆర్ఓని ఉసిగొల్పిన అగ్రకులానికి చెందిన ఉపసర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దమ్మాయిగూడెంలో జరిగిన ఈ ఘటనపై వారు మంగళవారం గ్రామాన్ని సందర్శించి ఆరా తీశారు. సర్పంచ్ జ్యోతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గంలో దళితులకు, గిరిజనులకు అవమానాలు రోజురోజుకూ ఎక్కువ వుతున్నాయన్నారు. ఉపసర్పంచ్ ఆలస్యం నాగేశ్వరావు అగ్ర కులస్తుడు కావటం వల్లనే గిరిజన సర్పంచ్‌ని జెండా ఎగరేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఇదే విషయమై కేవీపీఎస్ బృందం తహసీల్దార్ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు కొమ్ము శ్రీను, రాయిండ్ల సుందరయ్య, మట్టి దుర్గప్రసాద్, కొమ్ము నాగేశ్వరావు తదితరులు సర్పంచ్‌కు సంఘీభావంగా నిలిచారు.



సర్పంచ్‌ను పరామర్శించిన టీమాస్ నేతలు

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామసర్పంచ్ జ్యోతికి జరిగిన అవమానంపై జిల్లా టీమాస్ కమిటీ పరామర్శించింది. ప్రధానంగా టీమాస్ జిల్లా కన్వీనర్ యర్రాశ్రీకాంత్, జిల్లా స్టీరింగ్ కమిటీసభ్యులు మల్సూర్, బండిరమేష్, తిరుమలాయపాలెం మండల కన్వీనర్ దోనెపల్లి వెంకన్న, నాయకులు కొమ్ము శ్రీను, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు అంగిరేకుల నర్సయ్య తదితరులు సర్పంచ్‌ను పరామర్శించి ఓదార్చారు.

భద్రాద్రిజిల్లాలోనూ దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం...

ఖమ్మం జిల్లాలో గిరిజన సర్పంచ్ జ్యోతికి అవమానం జరిగిన రోజే భద్రాద్రి జిల్లాలో మరో వివక్ష ఘటన చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో దళిత మహిళా సర్పంచ్ పుట్టి కుమారికి అవమానం ఎదురైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపీపీ, జడ్పీటీసీ, సొసైటీ ఛైర్మన్లు, బూర్గంపాడు సర్పంచ్ పుట్టి కుమారి వచ్చారు. మహాత్మా గాంధీ చిత్రపటం ఎదుట కొబ్బరి కాయ కొట్టేందుకు అందరినీ పిలిచిన తహసీల్దార్ కె.వి.శ్రీనివాసరావు గ్రామ ప్రథమ పౌరురాలైన సర్పంచ్ పుట్టి కుమారిని విస్మరించాడు. సర్పంచ్‌గా ఆమెను ముందుగా పిలకవపోగా ఇదే విషయాన్ని ఓ వీఆర్వో గుర్తు చేయగా కొబ్బరి కాయలు అయిపోయాయి, ఆమె కొట్టనవసరం లేదంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. బయటి వ్యక్తులు కొబ్బరి కాయ కొట్టేందుకు అవకాశం కల్పించిన తహసీల్దార్ తన పట్ల అవమానకరంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆవేదన వ్యక్తం చేసింది. తహసీల్దార్ తీరుకు నిరసనగా ఆమె అక్కడి నుంచి వెనుదిరిగారు. తహసీల్దార్ వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈఘటనలోనూ దళిత సర్పంచ్ కుమారి గ్రామస్తులందరి ముందు జరిగిన అవమానం తట్టుకోలేక కన్నీరుపెట్టుకుని అక్కడినుండి అవమాన భారంతో ఇంటికి వెళ్లారు.

సెల్ : 9490099343

పతకాలు తీసుకొస్తారా?

బరిలో సింధు, సైనా, శ్రీకాంత్

నేటి నుంచే ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

గ్లాస్గో (స్కాట్లాండ్) : బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్.. భారత్ ప్రతి సీజన్‌కు మెరుగైన పతకం సాధిస్తున్న ప్రతిష్టాత్మక టోర్నీ. 2013, 2014లలో తెలుగు తేజం పి.వి సింధు వరుసగా కాంస్య పతకాలు సాధించగా, 2015లో హైదరాబాదీ అమ్మాయి సైనా నెహ్వాల్ రజతం నెగ్గింది. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మెడల్ తీసుకొచ్చిన తొలి షట్లర్‌గా సింధు చరిత్ర సృష్టించగా, సిల్వర్ సాధించిన ఏకైక షట్లర్‌గా సైనా రికార్డు నెలకొల్పింది. ఇప్పుడు సైనా నెహ్వాల్, పి.వి సింధులు ఇద్దరూ రేసులో ఉన్నారు. వీరికి తోడు పురుషుల సింగిల్స్ విభాగంలో తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ ఈసారి పతకంపై ఆశలు రేపుతున్నాడు. వరుసగా మూడు సూపర్ సిరీస్ ఫైనల్స్ సహా ఇండోనేషియా, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన కిదాంబి శ్రీకాంత్ ప్రస్తుతం హాట్ ఫామ్‌లో ఉన్నాడు. దీంతో ఈసారి గ్లాస్గో ఈవెంట్‌లో భారత బ్యాడ్మింటన్ కనీసం రెండు పతకాలు ఆశిస్తోంది. పి.వి సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు మెడల్ రేసులో ముందున్నారు!. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ గ్లాస్గో వేదికగా నేటి నుంచే ఆరంభం కానున్నది.





మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు, సైనా నెహ్వాల్‌లకు తొలి రౌండ్‌లో బై లభించింది. దీంతో సైనా, సింధులు రెండో రౌండ్లోనే బరిలోకి దిగనున్నారు. ఈ రౌండ్లలోనూ వీరిద్దరికి సులువైన ప్రత్యర్థులే ఎదురుకానున్నారు. స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే సెమీఫైనల్స్ వరకూ సైనా, సింధులకు తిరుగులేదు. అక్కడే ఇద్దరికీ కఠిన ప్రత్యర్థులు ఎదురయ్యే వీలున్నది. రితు పర్ణ దాస్, తన్వీ లాడ్‌లు తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఆడుతున్నా.. అవకాశాలు తక్కువే అని చెప్పాలి.



పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లో రష్యా కుర్రాడితో తలపడనున్నాడు. హాంగ్‌కాంగ్ షట్లర్‌తో బి. సాయిప్రణీత్ ఆడనుండగా, ఆస్ట్రియా ఆటగాడితో అజయ్ జయరాం తలపడనున్నాడు. సమీర్ వర్మ తొలి రౌండ్‌లో స్పెయిన్ షట్లర్‌తో తేల్చుకోనున్నాడు. బి. సాయిప్రణీత్‌కు మెరుగైన అవకాశమున్నా.. అతడు ఏ విధంగా ఆడతాడనేది ఆసక్తికరం. డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి జోడీకి సహా సుమీత్ రెడ్డి, మను అత్రీలకు మెరుగైన చాన్సుంది.



దంబుల్లాలో ధనాధన్. ధావన్ దంచికొట్టుడు, వీరాట్ వీరంగం లంకను చుట్టేసింది. శిఖర్ శతకవిహారానికి కోహ్లి మెరుపులు తొలి వన్డేలో టీమ్ ఇండియాకు అలవోక విజయాన్ని అందించాయి. వీరిద్దరి ధనాధన్‌తో 216 పరుగుల లక్ష్యాన్ని 30 ఓవర్లలోపే ముగించిన భారత్ 9 వికెట్ల తేడాతో ఏకపక్షంగా గెలుపొందింది.

139/1.. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జోరు ఇది. కానీ స్పిన్నర్లు కేదార్ జాదవ్, అక్షర్ పటేల్, చాహల్‌లు శ్రీలంక భారీ స్కోరు ఆశలను నీరుగార్చారు. ఆఖరి ఏడు వికెట్లను 11 ఓవర్ల వ్యవధిలోనే పడగొట్టి ఆతిథ్య జట్టును 216 పరుగులకే కుప్పకూల్చారు. 300 ప్లస్ పరుగులు చేసేలా కనిపించిన శ్రీలంకను మాయచేసి..పడగొట్టారు. వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించారు.

ధావన్ దంచికొట్టాడు

భారత్ 220/1
శ్రీలంక 216/10

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

- అర్ధ సెంచరీతో మెరిసిన కోహ్లి
- అక్షర్ పటేల్, జాదవ్ మాయాజాలం
- సిరీస్‌లో 1-0 ఆధిక్యం


కోహ్లి 82 నాటౌట్

శిఖర్ ధావన్
132 నాటౌట్
(90 బంతుల్లో 20X4, 3X6)

నవతెలంగాణ- దంబుల్లా

పోటీ అనే పదానికి చోటే లేదు!. దంబుల్లా దూకుడుకు వేదికైందా అన్నట్టు వీరవిహారం చేసిన శిఖర్ ధావన్ (132 నాటౌట్, 90 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకంతో శ్రీలంకపై దండెత్తాడు. 217 పరుగుల స్వల్ప ఛేదనలో శ్రీలంకను ఉతికారేశాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి (82 నాటౌట్, 70 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) సైతం క్లాసికల్ ప్రదర్శనతో మెరవటంతో తొలి వన్డేలో టీమ్ ఇండియా అత్యంత ఏకపక్ష విజయం నమోదు చేసింది. 28.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి.. 200 ప్లస్ టార్గెట్ ఛేదనను మరో 21.1 ఓవర్లు మిగిలిఉండగానే ముగించిన ఘనత దక్కించుకున్నది. తొలి బంతి నుంచే విధ్వంసానికి శ్రీకారం చుట్టిన శిఖర్ ధావన్ తన ఇన్నింగ్స్‌లో బౌండరీల రూపంలోనే 98 పరుగులు పిండుకున్నాడు. ఓపెనర్ రోహిత్ శర్మ (4) అనూహ్య రీతిలో రనౌట్‌గా నిష్క్రమించాడు. స్పిన్నర్లు అక్షర్ పటేల్ (3/34), కేదార్ జాదవ్ (2/26), యుజ్వేందర్ చాహల్ (2/60) రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 216 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ నిరోశన్ డిక్‌వాలా (64, 74 బంతుల్లో 8 ఫోర్లు), ఏంజెలో మాథ్యూస్ (36 నాటౌట్, 50 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) సహా గుణతిలక (35), కుశాల్ మెండిస్ (36) రాణించినా.. భారత బౌలర్ల ధాటికి శ్రీలంక స్వల్ప స్కోరుకే పరిమితమైంది. శతక హీరో శిఖర్ ధావన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. సిరీస్‌లో రెండో వన్డే ఆగస్టు 24న (గురువారం) పల్లెకెల్ వేదికగా జరుగనున్నది.

ధావన్‌కు అడ్డేది? : స్వల్ప ఛేదనలో భారత్‌కు ధావన్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ (4) అనూహ్య రీతిలో రనౌట్‌గా నిష్క్రమించినా.. భారత్ జోరుకు బ్రేక్ పడలేదు. సింగిల్ తీసే క్రమంలో రోహిత్ క్రీజులోకి చేరుకున్నా.. అతడి బ్యాట్ బ్యాలెన్స్ కోల్పోయి వదిలేశాడు. డైరెక్ట్ త్రో విసిరిన కపుగెదర శ్రీలంకకు ఏకైక వికెట్ ఆనందాన్ని ఇచ్చాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి (82 నాటౌట్) లంకేయులకు మరో అవకాశం ఇవ్వలేదు. మరో ఎండ్‌లో ధావన్ రెచ్చిపోతుండటంతో అతడికి సహాయక పాత్ర పోషించాడు. 8 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 36 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన ధావన్, 71 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్లు బాది సెంచరీ పూర్తి చేశాడు. విరాట్ కోహ్లి 50 బంతుల్లో కెరీర్ 44వ అర్ధ సెంచరీ సాధించాడు. డిసిల్వ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు బాదిన ధావన్.. శ్రీలంకపై సూపర్ ఫామ్ కొనసాగిస్తూ టూర్‌లో ముచ్చటగా మూడో సెంచరీ నమోదు చేశాడు. తన ఇన్నింగ్స్‌లో 20 ఫోర్లు సహా మూడు సిక్సర్లు బాదిన ధావన్ బౌండరీల రూపంలోనే 98 పరుగులు పిండుకున్నాడు. అర్ధ సెంచరీ తర్వాత వేగం పెంచిన కోహ్లి.. బౌండరీ లైన్‌పై విరుచుకుపడ్డాడు. డిసిల్వ బౌలింగ్‌లోనే స్ట్రయిట్ బౌండరీ బాదిన ధావన్.. లాంఛనాన్ని ముగించాడు. ధావన్ ధాటికి లంక బౌలర్లందరూ బాధితులయ్యారు. మరో 127 బంతులుండగానే 9 వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్ సిరీస్ 1-0తో ముందంజ వేసింది.

స్పిన్నర్ల మాయ : టాస్ నెగ్గిన కోహ్లి.. తొలుత శ్రీలంకకు బ్యాటింగ్ అప్పగించాడు. లంక సైతం బ్యాటింగే కోరుకోవటంతో సంతోషంగా బరిలోకి దిగింది. అందుకు తగినట్టుగానే ఓపెనర్లు నిరోశన్ డిక్‌వాలా (64, 74 బంతుల్లో 8 ఫోర్లు), ధనుష్క గుణతిలక (35, 44 బంతుల్లో 4 ఫోర్లు) అదిరే ఆరంభాన్నిచ్చారు. డిక్‌వాలా దూకుడుగా ఆడాడు. దీంతో పరుగులు సైతం అంతే వేగంగా జమయ్యాయి. మరో ఎండ్‌లో గుణతిలక నాల్గు బౌండరీలతో మెరిశాడు. ఆరంభ ఓవర్లలో మెరుగైన ప్రదర్శన చేసిన ఓపెనర్లు భారత్‌కు వికెట్ నిరాకరించారు. యువ స్పిన్నర్ యుజ్వేందర్ చాహల్ భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. గుణతిలకను అవుట్ చేసిన చాహల్ తొలి వికెట్ పడగొట్టాడు. కానీ కుశాల్ మెండిస్ (36, 37 బంతుల్లో 5 ఫోర్లు)తో జతకలిసిన డిక్‌వాలా మరో కీలక భాగస్వామ్యం నిర్మించాడు. మెండిస్ ఐదు ఫోర్లతో ఫామ్‌లో కనిపించాడు. అర్ధ సెంచరీ పూర్తి చేసిన డిక్‌వాలా.. రెండో వికెట్‌కు 65 పరుగులు జోడించాడు.

ఈ సారి పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ కేదార్ జాదవ్ బ్రేకిచ్చాడు. డిక్‌వాలాను ఎల్బీగా అవుట్ చేసిన జాదవ్.. మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. డిక్‌వాలా నిష్క్రమణకు ముందు 139/1తో ఉన్న శ్రీలంక అతడు పెవిలియన్‌కు చేరాక.. అనూహ్యంగా పతనమైంది. తర్వాతి వరుస బ్యాట్స్‌మెన్‌లో ఎంజెలో మాథ్యూస్ (36 నాటౌట్, 50 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఒక్కడే రెండెంకల స్కోరు చేయగలిగాడు. స్పిన్నర్లు జాదవ్, చాహల్‌కు తోడు అక్షర్ పటేల్ విజృంభించటంతో శ్రీలంక ఆఖరి ఏడు వికెట్లను 11 ఓవర్లలో కోల్పోయింది. జాదవ్ ఎక్కువ టర్న్‌కు అవకాశం లేకుండా బ్యాట్స్‌మెన్‌ను తికమక పెట్టగా, వైవిధ్యమై బంతులతో అదనపు బౌన్స్ రాబట్టిన అక్షర్ లంకను శాసించారు. కెప్టెన్ ఉపుల్ తరంగ (13)నూ సాగనంపిన జాదవ్.. లంకను కోలుకోలేని దెబ్బకొట్టాడు. ఎంజెలో మాథ్యూస్ ఓ ఎండ్‌లో నిలిచానా.. మరో ఎండ్‌లో కపుగెదర (1), డిసిల్వ (2), పెరీరా (0), సందకన్ (5), మలింగ (8), ఫెర్నాండో (0)లు క్రీజులో నిలువలేకపోయారు. జాదవ్ (2/26), అక్షర్ పటేల్ (3/34), చాహల్ (2/60)లకు తోడు జస్ప్రీత్ బుమ్రా (2/22) వికెట్ల వేటలో దుమ్మురేపారు. దీంతో 43.2 ఓవర్లలోనే శ్రీలంక కుప్పకూలింది.


అక్షర్ పటేల్ (3/34)

శ్రీలంక ఇన్నింగ్స్ : డిక్‌వాలా (ఎల్బీ) కేదార్ జాదవ్ 64, గుణతిలక (సి) రాహుల్ (బి) చాహల్ 35, కుశాల్ మెండిస్ (బి) అక్షర్ పటేల్ 36, ఉపుల్ తరంగ (సి) ధావన్ (బి) కేదార్ జాదవ్ 13, ఎంజెలో మాథ్యూస్ నాటౌట్ 36, కపుగెదెర రనౌట్ (కోహ్లి) 1, డిసిల్వ (బి) బుమ్రా 0, లక్షన్ సందకన్ (ఎల్బీ) అక్షర్ పటేల్ 5, లసిత్ మలింగ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 8, విశ్వ ఫెర్నాండో (బి) బుమ్రా 0, ఎక్స్‌ట్రాలు : 16, **మొత్తం : (43.2 ఓవర్లలో ఆలౌట్) 216.**

వికెట్ల పతనం : 1-74, 2-139, 3-150, 4-166, 5-169, 6-176, 7-178, 8-187, 9-209, 10-216.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 6-0-33-0, హార్దిక్ పాండ్య 6-0-35-0, జస్ప్రీత్ బుమ్రా 6.2-0-22-2, యుజ్వేందర్ చాహల్ 10-60-2, కేదార్ జాదవ్ 5-0-26-2, అక్షర్ పటేల్ 10-0-34-3.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ రనౌట్ (కపుగెదర) 4, శిఖర్ ధావన్ నాటౌట్ 132, విరాట్ కోహ్లి నాటౌట్ 82, ఎక్స్‌ట్రాలు: 02, **మొత్తం : (28.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 220.**

వికెట్ల పతనం: 1-23.

బౌలింగ్ : లసిత్ మలింగ 8-0-52-0, విశ్వ ఫెర్నాండో 6-0-43-0, ఎంజెలో మాథ్యూస్ 2-0-9-0, తిశార పెరీరా 2-0-18-0, లక్షన్ సందకన్ 6-0-63-0, డిసిల్వ 4.5-0-35-0.

పర్దీప్ మెరిసినా..

42-47తో పట్నాపై పుణె గెలుపు



లక్నో : స్టార్ రైడర్ పర్దీప్ నర్వాల్ 19 రైడ్ పాయింట్లతో చెలరేగినా.. డిఫెండింగ్ చాంప్ పట్నా పైరేట్స్‌కు ఓటమి తప్పలేదు. పుణెరి పల్టన్‌తో పోరులో 13-25తో పట్నా భారీ వెనుకంజలో కొనసాగినా.. పర్దీప్ నర్వాల్ వన్‌మ్యాన్ షో ఆ జట్టును రేసులోకి తీసుకొచ్చింది. 24 సార్లు కూతకెళ్లి పర్దీప్ ఏకంగా 19 పాయింట్లు సాధించుకొచ్చాడు. కానీ పుణె తరపున రాజేశ్ మండల్ 10 పాయింట్ల ప్రదర్శనకు తోడు రెహమాన్ ఆరు టాకిల్స్‌తో పుణె పైచేయి సాధించింది. దీంతో 47-42తో పుణె గెలుపొందింది. పుణె (29) కంటే మెరుగ్గా పట్నా 31 రైడ్ పాయింట్లు సాధించినా.. డిఫెన్స్‌లో పుణె (12) ముందు పట్నా (6) తేలిపోయింది. యూపీ యోధా, జైపూర్ పింక్ పాంథర్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో లక్నో జట్టుపై 24-22తో జైపూర్ జట్టు గెలుపొందింది.

ఆశలన్నీ.. సాక్షి, భజరంగ్‌లపైనే

రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్



పారిస్ : రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ రెజ్లర్లు పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. రియో ఒలింపిక్స్ స్టార్ సాక్షి మాలిక్ సహా ఆసియా చాంపియన్ భజరంగ్‌లపైనే భారత్ మెడల్ ఆశలు నెలకొన్నాయి. 58 కేజీల విభాగంలో ఒలింపిక్స్ కాంస్యం నెగ్గిన సాక్షి మాలిక్.. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 60 కేజీల విభాగంలో పోటీపడనున్నది. ఇదే విభాగంలో ఆసియా చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించిన సాక్షి.. వరల్డ్ ఈవెంట్‌లోనూ మెరవాలని తపిస్తోంది. మహిళల విభాగంలో వినేశ్ ఫోగట్ 48 కేజీల విభాగంలో బరిలోకి దిగుతోంది. వినేశ్ మినహా ఫోగట్ సిస్టర్స్ గీతా, బబితాలు బరిలో లేరు. పురుషుల విభాగంలో భజరంగ్ పూనియా 65 కేజీల విభాగంలో పోటీపడుతున్నాడు. సందీప్ తోమర్, దీపక్, ప్రవీణ్ రానా, సుమీత్‌లు పతకాలు ఆశిస్తున్నారు. పారిస్ వేదికగా రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ నేటి నుంచే ఆరంభం కానున్నాయి.



చెట్టు నెక్కగలమూ.. మ్యాచ్ చూడగలమూ!

భారత్‌తో వన్డే మ్యాచ్‌ను స్టేడియానికి సమీపంలోని చెట్టునెక్కి వీక్షిస్తున్న దంబుల్లా క్రికెట్ ప్రేమికులు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.